# జనబలం

ప్రజలే ప్రభువులు

జూలై 2026 | లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక | రూ.10/-










## హైదరాబాద్ ట్రాఫిక్ ప్రజారవాణా, మంచినీరుపై ఇంకెప్పుడు మేలుకొంటాం?

## పెన్సిల్ ఆత్మకథను మరచిన అమెరికా



## యువతలోనూ పెరుగుతున్న జీవనశైలి వ్యాధులు

## జేపీ టౌన్‌హాల్‌కు అఖిలపక్షం మద్దతు

# 'స్త్రీ'కి గౌరవం, సమానావకాశాలు - ప్రభుత్వ విధానాలు






ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంక్లూజివ్ గవర్నెన్స్ హైదరాబాద్ (ఐఐజీహెచ్) రాంభావు మాల్గీ ప్రబోధిని (ఆర్ఎంపీ) సంస్థతో కలిసి 'స్త్రీ' పేరుతో నిర్వహించిన పబ్లిక్ పాలసీ సదస్సులో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ పాల్గొన్నారు. తెలంగాణలో మహిళల ఆత్మగౌరవం, వారికి సమానావకాశాలు, సామాజిక-ఆర్థిక, రాజకీయ న్యాయంపై ప్రసంగించారు. బేగంపేటలో జరిగిన ఈ కార్యక్రమంలో.. ఆర్ఎంపీ వైస్ చైర్మన్, రాజ్యసభ మాజీ సభ్యులు, ఐసీసీఆర్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ వినయ్ సహస్రబుద్ధి, జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయ భారతి సయాని, మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి బడుగుల, టెక్ మహీంద్ర సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కృష్ణకుమారి పల్లె, భారతీయ స్త్రీ శక్తి, సమున్నత బాధ్యురాలు (ప్రభారి) విశాఖ సమీర్ మాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

---

## ఉచితాలపై పార్టీలకతీతంగా ఉద్యమం రావాలి.. అభివృద్ధి గ్రామాలకూ విస్తరించాలి



ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయిల్ యుద్ధం కారణంగా తలెత్తిన ఇంధన సంక్షోభాన్ని భారత్ తట్టుకున్నట్లుగా మరే దేశం తట్టుకోలేదని డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. పెట్రో ధరల్ని తక్కువ పెంచినది, ఆలస్యంగా పెంచినది మన దేశం మాత్రమేనన్నారు. కేవలం 3 నెలల్లో మన ప్రభుత్వం రూ.4 లక్షల కోట్లు అదనంగా ఖర్చు చేసిందన్నారు. బ్యాంకింగ్ వ్యవహారాల నిపుణుడు తుమ్మల కిశోర్ రచించిన 'ఆర్థిక వ్యవస్థకు యుద్ధం సెగ' పుస్తకావిష్కరణ హైదరాబాద్‌లోని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడి నివాసంలో జరగగా, జేపీ పాల్గొన్నారు. ఈనాడు పత్రిక ఎడిటర్ ఎం.నాగేశ్వరరావు, ఏపీ ప్రభుత్వ సలహాదారు శ్రీధర్, సీనియర్ జర్నలిస్టు వల్లీశ్వర్, కిశోర్ తదితరులు హాజరయ్యారు. సంక్షేమ పథకాలలో అవినీతిలేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి బదిలీ చేసే యూపీఐ, ఇతర డిజిటల్ సాంకేతి కతల్ని ప్రోత్సహించటం ఎంతో ఆర్థిక పారదర్శకతకు ఎంతో ఉపయోగపడిందన్నారు. నిజమైన పాలన ఉండే రాష్ట్రాల్లో చాలా చోట్ల సంక్షేమం, అభివృద్ధి మధ్య సమతూకం దెబ్బతిందన్నారు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో పరిస్థితి మరింత అధ్వాన్నంగా ఉందని జేపీ అన్నారు. తెలంగాణ, ఏపీల్లో అమలవుతున్న తాత్కాలిక ఉపశమనాల్లో నిజమైన సంక్షేమం ఎంత అన్న అంశాన్ని పక్కనపెడితే.. అప్పు చేసి మరీ పోటాపోటీగా ఇవ్వటం వల్ల భవిష్యత్తులో ఆస్తుల సృష్టికి అవసరమైన డబ్బు కొరవడుతోందన్నారు. ప్రభుత్వం ఏ క్షణానయినా ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుని కార్యకలాపాలు స్తంభించే ప్రమాదం పొంచి ఉందన్నారు. ఆర్థిక విషయాలు, హద్దుమీరుతున్న ఉచితాలపై ప్రజల్లో విస్తృతంగా చర్చ జరగాలన్నారు. దీంతో పాటు, కేవలం నగరాలలో మాత్రమే కేంద్రీకృతమైన అభివృద్ధి.. గ్రామాలనూ తాకాలన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజల్లో అత్యధికులు ప్రభుత్వాలపై నమ్మకంలేక.. తాత్కాలిక తాయిలాల కోసమే ఎక్కువ ఓట్లు వేస్తున్నారన్నారు. వారిలో విశ్వాసం పెంచేలా అభివృద్ధిని సమ్మిళితం చేసేందుకు విద్య, ఆరోగ్యం, చిన్న పట్టణాల అభివృద్ధితో తయారీరంగాన్ని ప్రోత్సహించటం మొదలైన అంశాలపై ప్రభుత్వాలు దృష్టి సారించాలన్నారు. గ్రామాల అభివృద్ధికి కృషి చేయటం ఆదర్శమో, త్యాగమో కాదని.. అక్కడి ప్రజలకూ సమానావకాశాలు అందించే విధానాలను అమలుచేయటం కీలకమని జేపీ పేర్కొన్నారు. వెంకయ్యనాయుడు మాట్లాడుతూ, ఉచిత పథకాలతో అభివృద్ధి గాడి తప్పుతోందని, వాటితో జరుగుతున్న నష్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఇందుకోసం పార్టీల కతీతంగా ఉద్యమం రావాలన్నారు. సారా నిషేధ ఉద్యమంలా పొదుపు ఉద్యమం రావాల్సి ఉందని అనంత్ టెక్నాలజీస్ అధినేత సుబ్బారావు అన్నారు.

# జనబలం

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక

ప్రజలే ప్రభువులు


జూలై 2026

సంపుటి 27 సంచిక 07


## జనబలం చందా రుసుము వివరాలు

| | | |
|---|---|---|
| సంవత్సర చందా | : | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | : | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | : | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | : | రూ. 1200.00 |


సంపాదకవర్గం

బండారు రామ్మోహనరావు

శిరమని నరేష్

వర్కింగ్ ఎడిటర్

దూసనపూడి సోమసుందర్




*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*


### చందాదారులకు విజ్ఞప్తి

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.

### కార్టూన్ కార్నర్





06 పెన్సిల్ ఆత్మకథను మరచిన అమెరికా

09 బహుళ ధృవ ప్రపంచంలో అమెరికా @ 250

11 హైదరాబాద్ ట్రాఫిక్, ప్రజారవాణా, మంచినీటి సరఫరాపై ఇంకెప్పుడు మేలుకొంటాం?

20 పదేళ్లలో రాష్ట్రాల ఆర్థిక స్థితిగతులు

23 కార్పొరేట్ ఆస్పత్రుల్లోనూ 'ప్రాథమిక వైద్యానికి' పెద్దపీట..

27 ఈ చదువులతో వికసిత భారత్ అసాధ్యం.. స్కూలు చదువుల నాణ్యతకు మార్గసూచి

31 రాజకీయం..ఎజెండా మారకుండా ఎవరొచ్చినా ప్రయోజనం లేదు

33 తెలుగు రాష్ట్రాల్లో 'సర్'



కార్యాలయ చిరునామా : H.NO. 6-3-678, B-106 , పాషా కోర్టు, 71 , సోమాజీగూడ, త్రిభువన్‌దాస్ జ్యాయలరీ వెనుక, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288, 040-23419949

Email: accountsdept@loksatta.org

# పౌరసత్వాన్ని చేజేతులా సంక్లిష్టం చేస్తున్నామా?

సంపాదకీయం

పౌరసత్వం గురించిన చర్చ మరోసారి దేశంలో మొదలయ్యింది. పాస్‌పోర్టు అనేది విదేశాలకు ప్రయాణ అనుమతి పత్రమే తప్ప పౌరసత్వానికి రుజువు కాదని ఇటీవల విదేశాంగ శాఖ ఉన్నతాధికారి ఒకరు చెప్పడంతో తాజా చర్చకు తెర లేచింది. నిజానికి 1955 నాటి భారతీయ పౌరసత్వ చట్టం ఎవరు భారతీయ పౌరులు, ఎవరు కాదు అనే అంశాన్ని స్పష్టంగానే చెప్పింది. చట్టం రావడానికి చాలా కాలం ముందే దేశంలో పౌరసత్వం గురించిన చర్చ బోలెడు జరిగింది.

"స్వరాజ్యం నా జన్మహక్కు దాన్ని నేను పొంది తీరాలి" అంటూ బాల గంగాధర్ తిలక్ నినాదం ఇచ్చే సమయానికి దేశం పరాయి పాలనలో ఉంది. అప్పటికి రాజ్యాంగ హక్కులు అనే మాటే లేదు. వాటితో సంబంధం లేకుండానే దేశ ప్రజలకు పుట్టుకతోనే కొన్ని మానవహక్కులు, రాజకీయ హక్కులు సంక్రమిస్తాయని జాతీయోద్యమ నేతలు గట్టిగా భావించారు. వాటిలో జీవించే హక్కు, స్వేచ్ఛ, వాక్ స్వాతంత్ర్యం, మత స్వేచ్ఛ, వంటివి ఇమిడి ఉంటాయని వారు బోధించారు. ఆ తర్వాతనే అలాంటి హక్కులకు రాజ్యాలు, రాజ్యాంగాలు గుర్తింపు ఇస్తాయన్న భావన కూడా వారిలో ప్రబలంగా ఉండేది. ప్రపంచవ్యాప్తంగా రిపబ్లికన్, లిబరల్ ఆలోచనా ధోరణులు అత్యంత ప్రభావవంతంగా ప్రాచుర్యంలో ఉన్న కాలమది. జాతీయోద్యమం జరిగినన్నాళ్లు భారతీయుల పౌరహక్కులపై, మానవహక్కులపై, పౌరసత్వంపై నాయకులు నిరంతరం మాట్లాడుతూనే వచ్చారు.

రాజ్యాంగ రచనా కాలంలో కూడా పౌరసత్వం గురించిన చర్చ రాజ్యాంగ పరిషత్తులో విపులంగానే జరిగింది. ఆ సందర్భంగా డా.బి. ఆర్. అంబేద్కర్ రిపబ్లికన్, లిబరల్ భావనలను బలంగా ముందుకు తెచ్చారు. "పౌరసత్వం పలు హక్కుల సంపూర్ణ సమాహారంగా ఉంటుంది, అందులో వ్యక్తి స్వేచ్ఛ, చట్టం ముందు సమానత, రాజకీయ భాగస్వామ్యం, అధికారంలోకి ఎన్నికయ్యే అవకాశం, కుల వ్యత్యాసాలను తొలగించడం వంటి హక్కులన్నీ మిళితమై ఉంటాయి. పౌరసత్వం దేశవాసులందర్నీ కలుపుకుని వెళ్ళేదిగా ఉంటుంది" అన్నారు డా.అంబేద్కర్. భారతీయ పౌరసత్వం ఎవరెవరికి ఇవ్వాలో రాజ్యాంగ పరిషత్తు ప్రతినిధులు లోతుగానే చర్చించారు.

పౌరసత్వానికి సంబంధించి అలాంటి విస్తృతమైన అవగాహనతోనే 1955 నాటి పౌరసత్వ చట్టం ఆమోదం. పొందింది. ఆ తర్వాత కూడా పలు సందర్భాల్లో అవసరార్థం చట్టాన్ని సవరించుకుంటూ వచ్చాం! అయితే ఇంతవరకూ మన ప్రభుత్వం మన పౌరులకు పౌరసత్వ ధృవీకరణ పత్రం గానీ, పౌరసత్వ కార్డు గానీ ఏమీ జారీ చేయలేదు. నిజానికి జాతీయ స్థాయిలో అలాంటి అవసరం కూడా ఎన్నడూ తలెత్తలేదు. అక్రమంగా దేశంలోకి పెద్ద ఎత్తున చొరబాటుదారులు వచ్చారన్న సమస్య అసోంలో బలంగా ముందుకు వచ్చాకనే పౌరసత్వ ధృవీకరణ అవసరం కూడా ముందుకు వచ్చింది.

అక్రమంగా దేశంలో ప్రవేశించినవారు కోట్లాది మంది ఉన్నారని, ప్రభుత్వం ఇచ్చే రకరకాల గుర్తింపు పత్రాలు కూడా పొందుతున్నారనీ, ఉద్యోగాల్లో, ఉపాధిలో వారు పెద్ద వాటా పొందుతున్నారన్న కారణాలతో అసోంలో పెద్ద దుమారం చెలరేగింది. సమస్యకు పరిష్కారం చూపడానికి అలనాటి జాతీయ ప్రభుత్వం ఉద్యమకారులతో "అసోం ఒప్పందం" చేసుకున్నది. పర్యవసానంగా పౌరసత్వం నిర్ధారించాల్సిన బాధ్యత కేంద్రంపై పడింది. పలు న్యాయ వివాదాల అనంతరం నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్స్‌ను రూపొందించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.

తమను తాము భారతీయ పౌరులమని రుజువు చేసుకోవాల్సిన బాధ్యత పౌరులపై పడింది. ఇంతకీ పౌరసత్వానికి సంబంధించిన ధృవీకరణ పత్రం ఏమిటి? ఇన్నేళ్లుగా ప్రభుత్వాలు ప్రజలకు రేషన్ కార్డు, ఓటరు కార్డు, ఆధార్ కార్డు, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్టు , బ్యాంకు పాస్ బుక్, బీమా పాలసీ పత్రాలు, ఉద్యోగ గుర్తింపు కార్డు, ఆస్తులు, భూము లు కొనుగోలు పత్రాలు వంటివెన్నో జారీచేస్తూ వచ్చాయి. అయితే ఇవేవీ పౌరసత్వాన్ని రుజువు చేసేవి కావని అసోం ఎన్నార్సీ ప్రక్రియ తేల్చింది. 1955 చట్టం ప్రకారం భారత దేశంలో జన్మించిన పౌరులు పౌరసత్వానికి అర్హులు అవుతారు. వారు తమ జనన ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలి. లేదా తల్లి తండ్రులు ఇద్దరూ, లేదా తల్లి తండ్రులలో ఒకరు భారత దేశంలో జన్మించినట్లు నిరూపించాలి.

అసోంలో ఆ ప్రక్రియ పూర్తి అయ్యాక 2019 ఆగస్టులో ప్రచురించిన పౌర జాబితా ప్రకారం 3 కోట్ల 11 లక్షలమంది ప్రజలను భారతీయ పౌరులుగా నిర్ధారించారు. తిరుగులేని ఆధారాలు చూపించి తమ పౌరసత్వం రుజువు చేసుకోలేని వారు 19 లక్షలమంది ఉన్నట్లు తేలింది. అందులో హిందువులు 12 లక్షల మంది ఉన్నట్లు కూడా వెల్లడి అయ్యింది. అసోంలో చొరబాటు దారుల సంఖ్య కనీసం కోటిన్నర నుండి రెండు కోట్ల వరకూ ఉంటుందన్న ఉద్యమకారుల ప్రచారం అతిశయోక్తి మాత్రమేనని తేలింది. చాలా మంది తగిన పత్రాలు చూపించలేక పౌరసత్వ జాబితాలో చోటు సంపాదించలేక పోయారని కూడా తేలింది.

ఇటీవల ఓటర్ల జాబితాల ప్రక్షాళన కోసం భారత ఎన్నికల సంఘం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియ

చేపట్టింది. ఇప్పటికే బీహార్, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, తమిళనాడు, తెలంగాణా సహా పలు రాష్ట్రాల్లో సర్ ప్రక్రియ పూర్తయ్యేసరికి సుమారు ఆరున్నర కోట్లమందికి ఓటర్ల జాబితాలో చోటు దక్కలేదు. మిగిలిన అన్ని రాష్ట్రాల్లో సర్ పూర్తయ్యే సరికి 16 కోట్లమందికి ఓటర్ల జాబితాలో చోటు దక్కక పోవచ్చునని ఇదే సమస్యపై పని చేస్తున్న పౌర సమాజ సంస్థల నిపుణులు అంచనా వేస్తున్నారు.

ప్రస్తుత రివిజన్ ప్రకారం జాబితాలో ఓటర్ల పేర్లు కొనసాగాలంటే 2002 నాటి ఓటర్ల జాబితాలో పేర్లు ఉండటం, తల్లి తండ్రులకు అప్పటికే ఓటు ఉండటం తప్పనిసరి. ఏవైనా లోపాలు కనిపించి అధికారులకు అనుమానం కలిగితే అల నాటి ఓటర్ ఐడి కార్డులతో పాటు అవసరమైతే జనన ధ్రువీకరణ పత్రాలు కూడా సమర్పించాల్సి ఉంటుంది. అసోం సహా వివిధ రాష్ట్రాల్లో ప్రభుత్వం జారీ చేసిన 14 లేదా 18 రకాల ఐడి కార్డులు రుజువులుగా పనికి రాలేదు. పాస్‌పోర్టు కూడా పౌరసత్వాన్ని రుజువు చేసే పత్రం కాదని తాజాగా విదేశాంగ శాఖ అధికారులు చెప్పిన వివరణ గందరగోళాన్ని తెచ్చింది. పాస్‌పోర్టు చట్టం ప్రవేశికలో పాస్‌పోర్టు , ట్రావెల్ డాక్యుమెంటు అనే రెండు వేర్వేరు మాటలను ప్రస్తావించడం జరిగింది.

విదేశాలకు వెళ్ళే సందర్భంలో మనల్ని భారతీయ పౌరులు అని గుర్తించడానికి మన ప్రభుత్వం పాస్ పోర్టును జారీ చేస్తుంది. ఒకప్పుడు మన పాస్‌పోర్టు లో సదరు వ్యక్తి భారతీయ పౌరుడు అని స్పష్టంగా ఉండేది. ఇటీవల జారీ చేస్తున్న పాస్‌పోర్టులో ఆ మాటలేదు. పాస్ పోర్టు చట్టం నిబంధనల ప్రకారం తన పౌరులు కానివారికి పాస్‌పోర్ట్ జారీ చేయడానికి భారత ప్రభుత్వం నిరాకరించవచ్చునని స్పష్టంగా ఉంది.

పాస్‌పోర్టు కోసం పౌరులు దరఖాస్తు చేసుకున్న తర్వాత వారు సమర్పించిన ఆధారాలను పోలీసులు పరిశీలిస్తారు. దరఖాస్తుదారు మీద ఎలాంటి కేసులు లేవని ధృవీకరించి నిరభ్యంతర పత్రం ఇచ్చాకనే పాస్‌పోర్టు జారీ అవుతుంది. మన దేశంలో పాస్‌పోర్టు కలిగినవారి సంఖ్య 9.6 కోట్లమంది కాగా, సుమారు కోటి పాతిక లక్షల మంది భారతీయులు విదేశాల్లో నివసిస్తున్నారు. ఇంత పెద్ద సంఖ్యలో పాస్‌పోర్టు ద్వారా పౌరసత్వ ధృవీకరణ పొందినప్పటికీ దాన్ని సందేహాస్పదం చేయడం , సంక్లిష్టం చేయడం అనవసరం. పాస్‌పోర్టును ట్రావెల్ డాక్యుమెంటు మాత్రమే అని చెప్పడం చట్ట విరుద్ధమని విశ్రాంత న్యాయమూర్తులు, న్యాయ నిపుణులు ఇప్పటికే స్పష్టం చేశారు.

ఆధార్ కార్డు జారీ చేసే సమయంలో కూడా సదరు వ్యక్తి పూర్తి వివరాలతో పాటు బయో మెట్రిక్, ఐరిస్, వంటివి ప్రభుత్వం సేకరిస్తుంది. దాన్ని కూడా కేవలం ఒక గుర్తింపు పత్రం మాత్రమే అని ఎన్నికల సంఘం అంటున్నది. ఇదంతా సమస్యను సంక్లిష్టం చేయడమే అవుతుంది.దేశంలో 2020 నాటి గణాంకాల ప్రకారం ఐదేళ్ల లోపు వయసున్న పిల్లల్లో 38 శాతం మందికి జనన ధ్రువీకరణ పత్రాలు లేవని లేవని తేలింది. జనన ధ్రువీకరణ పత్రం సంపాదించడమే కష్టంగా మారిన నేపథ్యంలో తల్లి తండ్రుల జనన ధ్రువీకరణ పత్రం చూపించడం అసాధ్యంగా మారిపోయింది.

ఆధారాలు చూపలేని వారి ఓటును ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా నుండి తొలగిస్తున్నది. ఇప్పటివరకూ అసోం, బీహార్, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, తెలంగాణా, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాలో చోటు దక్కనివారి సంఖ్య 6.50 కోట్ల వరకూ ఉందని, దేశం మొత్తం మీద సర్ ప్రక్రియ పూర్తయ్యేసరికి 16 కోట్లమంది పేర్లు ఓటర్ల జాబితాల నుండి తొలగించే అవకాశం ఉందని అంచనా. 1987, 2003 తర్వాత పుట్టినవారు వారి తల్లి తండ్రుల పౌరసత్వాన్ని రుజువు చేసుకోవాలి. జనన మరణ రికార్డులు గానీ, ఆస్పత్రులలో పిల్లల పుట్టుక గురించి గానీ, పాఠశాలల రికార్డులు గానీ సక్రమంగా నిర్వహించ లేని మన దేశంలో తల్లి తండ్రుల జనన ధ్రువీకరణ ఎవరు తీసుకు రాగలరు. దీంతో 35 నుండి 40 కోట్ల మంది తమ పౌరసత్వాన్ని రుజువు చేసుకోవడానికి నానా అగచాట్లు పడాల్సి ఉంటుంది.

"ఈ దేశం ఒక ధర్మసత్రం కాదు, అన్ని రాష్ట్రాల్లో ముందు సర్ పూర్తి అవుతుంది, ఆ తర్వాత ఎన్.ఆర్.సి. జరుగు తుంది. చొరబాటుదారులను ఒక్కొక్కరినీ ఎంచి ఎంచి ఏరి పారేయడం జరుగుతుంది" అంటూ ఎన్నికల సభల్లో హోం మంత్రి పదేపదే చెబుతున్నారు. నిజానికి దేశంలో చొరబాటు దారుల సంఖ్య కన్నా ధ్రువీకరణ పత్రాలు చూపలేక సందేహా స్పద జాబితాల్లో చేరే వారి సంఖ్య ఎక్కువ ఉంటుంది. ప్రభుత్వం పౌరసత్వం విషయమై నిర్దిష్టమైన కొనసాగింపు చర్యలు కూడా తీసుకోవడం లేదు. అసోంలో ఆరేళ్ల క్రితం పౌరులుగా నిర్ధారించిన వారికి ఇంతవరకూ పౌరసత్వ కార్డులు ఇవ్వనే లేదు. పౌరసత్వం రుజువు చేసుకోలేని 19 లక్షల మందికి ఇంతవరకూ ఆమేరకు నోటీసులు జారీ చేయలేదు.

అలాంటి వారికి ప్రభుత్వ పథకాలు అమలు చేయబోమని కొన్ని రాష్ట్రాల్లో ఇప్పటికే ప్రకటిస్తున్నారు. అంటే అన్ని రాష్ట్రాల్లో సందేహాస్పద జాబితాల్లో చేర్చే కోట్లాది మంది జీవితం, దుర్భరం అవుతుంది. ఫలానా వారు భారతీయ పౌరులు కాదని ప్రభుత్వమే రుజువు చేయాల్సి ఉండగా, మొత్తం పౌరుల పౌరసత్వ హోదాను సందేహాస్పదం చేయడం, సంక్లిష్టంగా మార్చడం సామాజిక జీవితాన్ని అల్లకల్లోలం చేస్తుంది. పౌరులు అందరికీ సరళమైన పద్ధతిలో పౌరసత్వ ధ్రువీకరణ జరిగేటట్లు ప్రభుత్వం చూడాలి.

డి. సోమసుందర్

# పెన్సిల్ ఆత్మకథను మరచిన అమెరికా

**- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్-**



మూడు నెలలకు పైగా సాగిన ఇరాన్ యుద్ధ ప్రకంపనలు.. మూడు వారాలయ్యేసరికే ప్రపంచమంతటికీ వ్యాపించాయి. ఆ దేశాన్ని దారికి తేవటానికి ఇతరత్రా మార్గాలున్నా.. అధ్యక్షుడు ట్రంప్, ప్రధాని నెతన్యాహూ యుద్ధాన్నే మార్గంగా, అవకాశంగా మార్చుకున్నారు. ఇది కాస్తా చివరికి విధ్వంసకర యుద్ధంగా పరిణమించింది. పలు దేశాల మనుగడనే ప్రమాదంలోకి నెట్టింది. ఇరాన్ ధిక్కార స్వరంతో మొండిగా నిలబడటం, డేవిడ్–గోలియత్ పోరాటం తరహాలో అసమతుల్య ఎత్తుగడలను ప్రదర్శించటం ఈ అనూహ్య మలుపులకి కారణమైంది.


గల్ఫ్ దేశాలలో పౌర ఆస్తులకు, సైనిక మౌలిక వసతులకు, ముఖ్యంగా చమురు, గ్యాస్ సరఫరా గొలుసులకు.. ఇరాన్ భారీ నష్టం కలిగించింది. అంతకంటే పెద్ద పరిణామం, హొర్ముజ్ జలసంధిని మూసివేయటం. నౌకలు సరకు రవాణా చేస్తే దాడులకు దిగుతామనే బెదిరింపు ద్వారా ఇరాన్ అంతర్జాతీయ ఇంధన వాణిజ్యాన్ని అల్లకల్లోలం చేసింది.

ఇరాన్‌లో పాతుకుపోయిన ఇస్లామిక్ ఛాందస రిపబ్లిక్‌కు స్వదేశంలోనే చాలా చెడ్డ పేరుంది. అయితే ఆధునిక యుద్ధ రీతులకు అనువైన చిన్న చిన్న ఆయుధాలతో వికేంద్రీకృత దాడుల్లో, రక్షణ ఎత్తుగడల్లో ఆ దేశం ఆరి తేరింది. ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ దళాలు మారుమూలలకి కూడా రహస్యంగా విస్తరించి స్లీపర్ సెల్స్ తరహాలో పనిచేస్తున్నాయి. పైనుంచి కేంద్రీకృత ఆదేశాలేమీ వాటికి అక్కర్లేదు. గొలుసు కట్టుగా స్థానిక దాడులు చేసే సామర్థ్యం ఆ గార్డ్స్‌కి ఉంది. ప్రస్తుత యుద్ధాన్ని ఇరాన్ కొన్ని దశాబ్దాల క్రితమే ఊహించి సన్నద్ధమైనట్లు కనిపిస్తుంది. శాస్త్ర సాంకేతిక రంగాలలో దిట్టలైన మానవ వనరులు ఆ దేశానికున్నాయి. ఈ కారణంగానే, తన వనరుల్లో ఎక్కువ శాతాన్ని అణ్వస్త్రాల అభివృద్ధి, బాలిస్టిక్ మిసయిళ్లు, చవగ్గా తయారుచేయగల డ్రోన్ల మీద వెచ్చించింది. గల్ఫ్ దేశాలను తీవ్ర ఒత్తిడిలోకి నెట్టేందుకు, హొర్ముజ్ జలసంధి దిగ్బంధం ద్వారా ఇంధనపరంగా ప్రపంచాన్ని దెబ్బతీసేందుకు తనకున్న భౌగోళిక అనుకూలతను ఉపయోగించేందుకు ఇరాన్ సిద్ధపడిందన్నది సుస్పష్టం.

అధ్యక్షుడు ట్రంప్ వైఫల్యం నైతికమైనదో, చట్టపరమైనదో కాదు. కానీ యుద్ధం అంచనాల గతితప్పి కొనసాగుతుండటంతో సహనం కోల్పోయి.. ఆ గీతల్ని కూడా దాటేశారు. ఈ ఏడాది జులైలో 250వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్న ప్రపంచంలోని అత్యంత శక్తిమంతమైన ప్రజాస్వామ్య దేశానికి నేతృత్వం వహిస్తున్న నాయకుడినని మరచి బాధ్యతారహితంగా మాట్లాడారు, వ్యవహరించారు. తన అనాలోచిత జోక్యం వల్ల తలెత్తే పెను సమస్యల్ని, సంక్షోభాల్ని ఒక సూపర్‌పవర్ ఊహించకపోవటం.. చివరికి ఆ దేశ విశ్వసనీయతకు, ఆధిపత్యానికీ తీవ్ర నష్టం కలిగిస్తుంది. అంతకంటే ముఖ్యం – అమెరికా విఫల నాయకత్వం వల్ల ప్రపంచ మానవాళి మొత్తం భారీ మూల్యం చెల్లించటం. అంతర్జాతీయంగా చమురు, గ్యాస్ ధరలు గణనీయంగా పెరిగాయి.

గల్ఫ్ దేశాలపై ఇరాన్ విచక్షణారహిత దాడులు, హొర్ముజ్ జలసంధిలో నౌకా వాణిజ్యంపై బెదిరింపులు.. సరఫరా గొలుసుల్ని తీవ్రంగా దెబ్బతీశాయి. దీనికితోడు, ఇజ్రాయిల్ నిర్లక్ష్యపూరిత దాడులు. ఇరాన్ భూభాగంలోని సౌత్ పార్స్‌పై ఆయుధాలతో విరుచుకుపడింది. ప్రపంచమంతటినీ కుదిపేసే పరిణామంగా యుద్ధం పరిణమించటానికి ఇది దారి తీసింది. సౌత్ పార్స్ ప్రపంచంలోనే అతిపెద్ద సహజవాయు నిక్షేప క్షేత్రం. ఖతార్, ఇరాన్‌ల మధ్య పంపకమై ఉంటుంది. ఇజ్రాయిల్ దుందుడుకు దాడికి ప్రతిగా.. ఖతార్‌లోని రాస్ లాఫ్రాన్ పారిశ్రామిక నగరంపై ఇరాన్ విరుచుకుపడింది. ప్రపంచంలోనే అతిపెద్ద ద్రవీభవన సహజ వాయు వనరును దెబ్బతీసింది. ఇంధన మౌలిక వసతులు తీవ్రంగా దెబ్బతిన్నందున, పర్యవసానాలు దీర్ఘకాలం కొనసాగుతాయి. దీర్ఘకాలంపాటు మూతవేయాల్సి రావొచ్చు. ఆ మేరకు ప్రపంచం కొరతలను ఎదుర్కోవలసి ఉంటుంది. మొత్తం ఎల్ఎన్‌జీ సరఫరాల్లో ఆరో వంతు మేర అయిదేళ్లపాటు మూసివేస్తున్నట్లు ఖతార్ ప్రకటించింది. ఇటలీ, బెల్జియం, దక్షిణ కొరియా, చైనాలతో ఉన్న దీర్ఘకాలిక కాంట్రాక్టులను నిలిపివేయక తప్పని నిస్సహాయ పరిస్థితిని యుద్ధ సమయంలో ఆ దేశం ఎదుర్కొంది.

ప్రపంచ వినాశనానికి మూడో ప్రపంచ యుద్ధమో, అణ్వస్త్ర విధ్వంసమో అక్కర్లేదు. కీలక సరఫరా గొలుసులకి గండి కొడితే చాలు – వందల కోట్ల ప్రజల జీవితాలపై చాలా కాలం పాటు ప్రతికూల ప్రభావం చూపుతుంది. ప్రపంచ ప్రళయాన్ని తలపిస్తుంది. 1958లో లియోనార్డ్ రీడ్ 'నేను, పెన్సిల్‌ని' అనే ఒక వ్యాసం రాశారు. మిగతా చాలావాటితో పోలిస్తే పెన్సిల్ తయారీకి పెద్ద సాంకేతికత అక్కర్లేదు. మనం రోజువారీ ఉపయోగించే అలాంటి ఒక సాధారణ పెన్సిల్‌ను తయారు చేయటంలో కూడా.. సరఫరా గొలుసుల విషయంలో ఎంత సంక్లిష్టత ఉందో ఆ వ్యాసం వెల్లడిస్తుంది.




పెన్సిళ్లను ఉత్పత్తి, సరఫరా.. దేవదారు చెట్ల కలప సేకరణతో మొదలవుతుంది. కాలిఫోర్నియా, ఓరెగాన్ నుండి ఆ దుంగల్ని శాన్ లియాండ్రో, సీఏలోని మిల్లుకి పంపుతారు. అక్కడ సంక్లిష్ట యంత్రాలు కలప దుంగల్ని సన్నని పలకలుగా కత్తిరిస్తాయి. ఆ తర్వాత తేమను పీల్చి పొడిబారుస్తాయి. అనంతరం రంగు లద్దటంతో పాటు మెరుగులు పెడతాయి. ఈ యంత్రాలకు అవసరమైన ఇంధనమంతా పసిఫిక్ గ్యాస్ ఎలక్ట్రిక్ కంపెనీకి చెందిన జలవనరుల కేంద్రం నుండి తీసుకుంటారు.

సిలోన్ (శ్రీలంక)లో తవ్వితీసిన గ్రాఫైట్‌ను మిసిసిపీ నుండి తెచ్చిన మట్టితో కలుపుతారు. తడిబార్చే సల్ఫోనేటెడ్ జంతు కొవ్వులను జోడిస్తారు. గ్రాఫైడ్ కడ్డీలను (సీసం) అచ్చుల ద్వారా నిర్దిష్ట ఆకారాల్లోకి మలుస్తారు. మెక్సికో నుంచి తెప్పించిన క్యాండిలిల్లా మొక్క నుండి సేకరించిన, ముడిచమురును ఉపయోగించి తయారు చేసిన మెరుపు పదార్థం, హైడ్రోజనీ కరించిన సహజ కొవ్వుల వేడి మిశ్రమంతో వాటిని శుద్ధి చేస్తారు. ఇంకా వివిధ సంక్లిష్ట చర్యలు ఈ ప్రక్రియలో భాగంగా ఉంటాయి – ఆముదం, ఇతర మూలకాలు కలిపిన లాక్వర్ రంగుని దేవదారు ముక్కకి వేస్తారు (ఫర్నిచర్ కోటింగ్ తరహాలో). కర్బన పొడి కలిపిన జిగురుతో పెన్సిల్‌పై ముద్రను రూపొందిస్తారు. ఇత్తడి లోహ భాగాన్ని (ఫెర్యూల్) పెన్సిల్‌కి జత చేస్తారు. అనవసరమైన పెన్సిల్ గీతల్ని చెరిపివేసేందుకు ఉపయోగించే రబ్బర్‌ను ఉంచటం కోసం ఈ ఏర్పాటు. ఇండొనేషియా నుండి తెప్పించిన ఆవనూనె నుండి ఈ రబ్బర్‌ను తయారుచేస్తారు. సల్ఫర్ క్లోరైడ్, వల్కనైజింగ్, వేగవంతం చేసే రకరకాల వాహకాలను కలుపుతారు. ఇటలీ నుండి తెప్పించిన అగ్నిశిల, రంగు కోసం కాడ్మియం సల్ఫైడ్ జోడిస్తారు.

**ఆఫ్రికా దేశ అస్థిరత్వానికి చీరాల చేనేతకారులు మూల్యం చెల్లించారు**

నాలుగు దశాబ్దాల క్రితం, ఆర్థిక సంస్కరణలు ఇంకా భారత తీరాలకు చేరకముందు ఒక యువ అధికారిగా సరఫరా గొలుసులు, వాటికి విఘాతం వల్ల కలిగే విధ్వంసాన్ని మొదటిసారి ప్రత్యక్షంగా చూశాను. నేను కఠిన పాఠాన్ని నేర్చుకోవాల్సిన అనివార్య పరిస్థితిని ఆ ఘటనలు కల్పించాయి. అప్పట్లో కోస్తాంధ్ర ప్రకాశం జిల్లా చీరాల ప్రాంతం లోని చేనేతకారులు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయారు. నైజీరియాలోని రాజకీయ అస్థిరత్వం, ఆర్థిక కల్లోలం ఇందుకు కారణం. రియల్ మద్రాస్ జేబురు మాలుగా పిలిచే ఒక ప్రత్యేక వస్త్రాన్ని వీరు నేస్తారు. నైజీరియా కల్లోలం వల్ల అక్కడికి వీరి ఎగుమతులు ఆగిపోయాయి. ఎక్కడో దూరంగా ఉన్న ఆఫ్రికాలోని పరిణామాలు భారతదేశ తూర్పు తీరంలో సంక్షోభానికి, ఆకలి కేకలకు కారణమయ్యాయి. అప్పట్లో అంతా ప్రభుత్వం చేతుల్లో ఉండేది. వాణిజ్య నియంత్రణలు అమలయ్యేవి. అయినా పత్తి రైతులు, చేనేత కార్మికుల సంక్షోభం ఆగలేదు. ఈవేళ మార్కెట్ ప్రపంచీకరణ ఏ స్థాయిలో ఉందో వేరే చెప్పనక్కర్లేదు. మనం తయారు చేసే ఏ ఉత్పత్తిలో ఏ భాగం ఎక్కడ తయారై వస్తుందో తెలుసుకోవటం అసాధ్యం. ఇలాంటప్పుడు సరఫరా గొలుసుల్లో తేడా వస్తే.. జరిగే విధ్వంసాన్ని ఊహించటం కూడా సాధ్యం కాదు.

దీర్ఘకాలిక కష్టంలో కూరుకుపోకుండా గల్ఫ్ దేశాలు, ప్రపంచ సమాజం సాధారణ స్థితికి రావటానికి ఈ యుద్ధం మొదలైనంత వేగంగా ముగిసిపోవాలని అత్యధికులు కోరుకున్నారు. కానీ ఊహించినదానికంటే ఎక్కువ సమయం కొనసాగింది. ఇప్పుడు యుద్ధ విరమణ ఒడంబడిక శాశ్వత పరిష్కారమైనప్పుడు మాత్రమే.. అభివృద్ధికి అవసరమైన నిజమైన శాంతి, అందుకు అవకాశాలు నెలకొంటాయి. ఇదే రీతిలో నిర్లక్ష్యపూరిత, ఉన్మాద దాడులు–ప్రతిదాడులు జరుగుతుంటే.. సంక్షోభం ఇటీవలి కాలంలో ఎన్నడూ చూడని స్థాయికి చేరుతుంది. ఇరాన్, గల్ఫ్ దేశాలకే కాదు ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థలకు, మానవాళి

సుఖసంతోషాలతో బతకటానికి తీవ్ర విఘాతం ఏర్పడుతుంది. సరిదిద్దలేని నష్టం సంభవిస్తుంది. గొప్ప నాగరిక దేశం ఇరాన్‌లో సామా జిక, నాయకత్వ శూన్యత (నిహిలిజం) నెలకొనటం ఉగ్రవాద శక్తులకు వనరుగా మారే ప్రమాదం పొంచివుంటుంది.

రవాణా, వంట, ఇంధన వ్యవస్థలు, ఎరువులు (యూరియా, ఫాస్ఫేట్), కంప్యూటింగ్ చిప్స్, ఏఐ, అంతరిక్ష పరిశ్రమలు (హీలియం), ఆహారోత్పత్తి ప్రమాదంలో పడతాయి. యుద్ధం ఆగినా, చెల్లించాల్సిన మూల్యం ఇంకొంతకాలం కొనసాగుతుంటుంది. పునర్నిర్మాణానికి, ప్రత్యామ్నాయ సరఫరా అవకాశాలకి, విశ్వసనీయ రవాణా మార్గాలకి, హార్ముజ్, బాబ్ అల్–మందబ్, మలక్కా వంటి కీలక సముద్ర జల సంధుల్లో శాశ్వత పహారా, భారీ ఎత్తు వ్యూహాత్మక నిల్వలు, అందుకు ఏర్పాట్లు, భవిష్యత్తులో అనుకోని అవాంతరాలను ఎదుర్కొనేందుకు అదనపు చర్యలు, అధిక ఇన్సూరెన్స్ మొత్తాలకి.. భారీ ప్రయత్నాలు, పెట్టుబడులు అవసరమవుతాయి. ఇవన్నీ చివరికి వినియోగదారులకే వడ్డిస్తారు. కాబట్టి మన ఖర్చులు భారీగా పెరుగుతాయి.

యుద్ధం మళ్లీ తలెత్తి ఇంధన, ఖనిజ వనరులు శాశ్వతంగా దెబ్బతింటే.. మానవాళి చెల్లించాల్సిన మూల్యం ఊహకు సైతం అందదు. ప్రస్తుతానికి కాల్పుల విరమణని ప్రకటించినా, ఏ క్షణాన మళ్లీ యుద్ధం ప్రారంభమవుతుందో చెప్పలేము. పర్షియన్ గల్ఫ్‌లో యుద్ధం లేకపోయినా ఇరాన్ ఏ క్షణంలోనయినా మళ్ళీ హార్ముజ్ జలసంధిని మూసేయవచ్చు. కొద్దిరోజుల క్రితమే లెబనాన్‌లో ఇంకా దాడులు కొనసాగుతున్నాయన్న నెపంతో ఇరాన్ హార్ముజ్ జలసంధిని మూసేస్తున్నట్లు ప్రకటించింది. ఇలా ఇంధన సరఫరాకి ఎప్పుడయినా అంతరాయం కలగవచ్చు. ప్రపంచమంతా దినదినగండంగా భయాందోళనలతో బ్రతకాల్సి వస్తోంది. ఐరోపా, బ్రిటన్, జీసీసీ దేశాలు, చైనా, భారత్, జపాన్, ఇతర మధ్యస్థ దేశాలు కలసికట్టుగా ఈ పెను ప్రమాదాన్ని నివారించాలి. యుద్ధరంగంలోని దేశాలు వెంటనే శత్రుత్వాలకు స్వస్తి పలకాలి. సుస్థిర శాంతికి కృషి చేయాలి.

★

# జేపీని రాజ్యసభకు పంపాల్సిన బాధ్యత చంద్రబాబు, పవన్ కళ్యాణ్, బీజేపీ కూటమికి లేదా?

ఆంధ్రప్రదేశ్ నుండి ఇటీవల తెలుగుదేశం, జనసేన పార్టీలు రాజ్యసభకు ఎంపిక చేసిన అభ్యర్థుల పట్ల లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సింగపూర్‌లాంటి దేశాల్ని తిరుగుతూ కూడా రాజకీయాల్ని మనం మార్చుకోకపోతే, పెద్దల సభలో తెర వెనుక రాజకీయాలు నడిపేవారినే ఎంపిక చేయటం కొనసాగిస్తే స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్‌లు ఎలా సాధ్యమవుతాయన్నారు. విజయనగరంలో మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో వివిధ రంగాలలో ప్రతిభావంతులు, మేధావులు, నిజాయతీపరులు ఉన్నారని బాబ్జీ అన్నారు. ఆర్‌బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు, విద్యావేత్త కొలకలూరి ఇనాక్‌లను ఉదహరించారు. ఇక రాజకీయ, ఆర్థిక, పాలనా, సామాజిక సంస్కరణల కోసం దశాబ్దాలుగా అపారకృషి చేస్తున్న ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ గురించి చంద్రబాబుకి, పవన్ కళ్యాణ్‌కి చెప్పనక్కర్లేదన్నారు. రాష్ట్ర విభజన సమయంలో ఏపీకి ప్రత్యేకహోదా సహా పలు అంశాలను రూపొందించి, ఢిల్లీ పెద్దలను ఒప్పించి రాష్ట్ర ప్రయోజనాలను పరిరక్షించిన జేపీకి సీటు ఇవ్వటం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి బాధ్యతన్నారు. జేపీ నేతృత్వంలోని స్వతంత్ర నిపుణుల కమిటీ వల్లే రాష్ట్రానికి రూ.10,490 కోట్ల దీర్ఘకాల పెండింగ్ నిధులతోపాటు.. విభజన చట్టంలోని పలు హామీలు అమలయ్యాయన్నారు. 2014లో జేపీని మల్కాజిగిరిలో గెలిపిస్తానని చెప్పి, ఆ తర్వాత ముందుచూపులేకుండా వ్యవహరించటం వల్ల తెలుగుదేశం, జనసేన, తెలుగు ప్రజలు, దేశం కూడా నష్టపోయాయన్నారు. ఎన్‌టీఆర్ హయాం నుండి అనుభవమున్న చంద్రబాబు, మార్పు కోసం కృషి చేస్తున్నామని తరచూ చెప్పే పవన్ కళ్యాణ్ ఇప్పటికైనా ఈ విషయంలో చొరవ తీసుకోవాలన్నారు. రాబోయేకాలంలో జేపీకి అవకాశం ఇవ్వాలని వారు భావిస్తుండవచ్చని, కానీ భారత్‌కి ఈవేళ ప్రతి నిమిషం విలువైనదని అన్నారు. డీలిమిటేషన్, పార్లమెంటులో సీట్ల పెంపు, మహిళా రిజర్వేషన్లు, ప్రపంచీకరణ ఒడిదుడుకులు, రాష్ట్రాల మధ్య అంతరాలు వంటి ప్రస్తుత పరిస్థితుల్లో జేపీలాంటి వారి గళం పార్లమెంటులో వినిపించటం అవసరమన్నారు. ఎస్.కె. డే, మన్మోహన్ సింగ్, జైశంకర్ లాంటి వారిని పార్టీలకతీతంగా ఎంపిక చేయబట్టే, భారత్ ఈవేళ లాభపడిన విషయాన్ని విస్మరించకూడదన్నారు. లోక్‌సభలో కూడా పార్టీలకతీతంగా సమాజంలోని మేధస్సుని స్వీకరించవచ్చని, అలా కొన్ని సీట్లు ఏర్పాటు చేసి, లేకుంటే రాజ్యసభలోనైనా జేపీకి అవకాశం ఇవ్వాలని కోరారు. అదేవిధంగా, ఎఫ్‌డీఆర్ ద్వారా విద్య, ఆరోగ్యం, చట్టబద్ధపాలన, స్థానిక ప్రభుత్వాల సాధికారత, చిన్న పట్టణాల అభివృద్ధితో తయారీరంగంలో గ్రామీణ యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు వంటి అంశాలపై కృషి చేస్తున్న జేపీ సిఫార్సుల్నీ చర్చించి అమలు చేయాలన్నారు.

# బహుళ ధృవ ప్రపంచంలో అమెరికా @ 250




***ఆర్థిక వ్యవస్థను సంపన్న స్థాయికి తీసుకెళ్లటానికి నిరంకుశత్వం అక్కర్లేదు.. స్వేచ్ఛ వికసించే ప్రజాస్వామ్యం ద్వారానే అభివృద్ధి, సామాజిక ఒడంబడిక మెరుగ్గా నెరవేరతాయని నిరూపించి ప్రపంచానికి ఓ ఆదర్శాన్ని నెలకొల్పిన అమెరికా.. 2026 జులై 4న తన స్వాతంత్ర్య ప్రకటన 250వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటోంది. ఈవేళ్టి అమెరికా ఎలావుండేదో భావితరాలకు తెలియచేయటానికి కొన్ని వస్తువుల సింథటిక్ రూపాలతో కూడిన కాప్స్యూల్‌ను ఫిలడెల్ఫియా గడ్డ మీద భద్రపరచటం, ఆ దేశం 500వ వార్షికోత్సం జరుపుకునే 2276లో మాత్రమే తెరవటం వంటి పద్ధతుల్లో.. పూర్వీకులుగా నేటి తరం అమెరికా తన బాధ్యతను పాటించటం ఆసక్తి గొలుపుతుంది, ఇతరత్రా వైవిధ్య కార్యక్రమాలు, అలంకరణలు.. ఈ చారిత్రక వేడుకల్ని ఘనతరం చేస్తున్నాయి.***

పరిణామక్రమంలో మనిషి తన తర్వాతి నాగరిక దశ కలల్ని నెరవేర్చుకునేందుకు అనువైన దేశంగా గుర్తింపుపొందిన అమెరికా.. అందుకు అన్ని విధాలా అర్హమైనది. ఈ చారిత్రక సందర్భంలో అధ్యక్షుడిగా ఉన్న డొనాల్డ్ ట్రంప్ ఇరాన్ యుద్ధాన్ని సగర్వంగా చాటుకునేవిధంగా ముగించి వ్యక్తిగతంగానూ తన ఘనతను చాటుకుని, ఈ ఏడాది నవంబర్‌లో జరగనున్న మధ్యంతర ఎన్నికల్లో తన రిపబ్లికన్ పార్టీ ప్రతినిధుల్ని మెజారిటీ సంఖ్యలో గెలిపించుకోవాలనుకున్నారు. అయితే 107 రోజుల ఇరాన్ యుద్ధం తర్వాత ప్రాథమిక ఒప్పందం.. ఆయనకు తనదైన శైలి అబద్ధాలతో తప్పించుకునే అవకాశం కూడా ఇవ్వలేదు. అమెరికా ప్రజాస్వామిక పాఠాల గురించి గతేడాది 250వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగానే 'జనబలం'లో విహంగవీక్షణంగా చర్చించుకున్నాం. అంతా సవ్యంగా ఉంటే, ఈ ఏడాది వార్షికోత్సవ వేడుకల్నీ వినోదంలా ఆస్వాదించేవాళ్లం. కానీ ప్రస్తుతం.. ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయిల్ యుద్ధం, మునుపెన్నడూలేని రీతిలో వాణిజ్య సుంకాలు మనకు అందివచ్చిన అరుదైన ఆర్థికాభివృద్ధి అవకాశాలపై ప్రభావం చూపుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

ప్రపంచం ఎటుపోయినా ఫర్వాలేదు అనే ధోరణితో.. తన భారీ మార్కెట్‌లోకి దిగుమతులపై ఎడాపెడా సుంకాలు విధించటం, అంతర్జాతీయ సంస్థలకు నిధులు, వాటిలో సభ్యత్వం వంటి కార్యక్రమాల నుండి వైదొలగటం – దేశీయంగా, అంతర్జాతీయంగా కూడా భారత్ మీద పెద్దఎత్తున ప్రభావం చూపుతోంది. ఈ ఒడిదుడుకులను ఎదుర్కోవటానికి ప్రపంచీకరణ నూతన దశను ఎదుర్కొనే సంస్కరణలు, విధానాలు మన దేశానికి ఇప్పుడు అవసరం. ప్రపంచీకరణలో వెనక్కుమళ్లటం అసాధ్యమయ్యాక, దేశాల మధ్య పోటీ అంతరిక్షంలోకీ ప్రవేశించాక.. స్వదేశీ మార్కెట్‌ను వైవిధ్యభరితంగా విస్తరించటంలో, అంతర్జాతీయ సరఫరా గొలుసుల్లో, ఎగుమతుల్లో, పెట్టుబడుల్ని ఆకర్షించటంలో జాగ్రత్తపడటం తప్ప మనకు మార్గం లేదు. వీటన్నిటికీ అవసరమైన శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పాలి. ఒప్పందాల అమలుకి సంబంధించిన వివాదాల్ని పరిష్కరించటంలో విశ్వసనీయతను, వేగాన్ని పెంచుకోవాలి. ఈ నేపథ్యంలోనే, అంతర్జాతీయ భద్రత, యుద్ధాలు, అణ్వస్త్ర బెదిరింపులు లేకుండా ప్రపంచ క్రమాన్ని ఏఐ సహా ఆధునిక సాంకేతిక మార్పుల యుగంలోనూ సవ్యంగా నడిపించే నాయకత్వం అందించటం గురించి ఇటీవల బెర్లిన్‌లో షిల్లర్ ఇన్‌స్టిట్యూట్ నిర్వహించిన సమావేశం సూచనలను కూడా మనం గమనంలోకి తీసుకోవాలి.

దజనుకు పైగా దేశాల నుండి మాజీ దౌత్యవేత్తలు, ఉన్నతాధికారులు, విద్యావేత్తలు, జర్నలిస్టులు, సైనిక నిపుణులు, శాంతి ప్రచారకర్తలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. "ది అర్జంట్ నీడ్ ఫర్ ఎ న్యూ ఇంటర్నేషనల్

సెక్యూరిటీ అండ్ డెవలప్‌మెంట్ ఆర్కిటెక్చర్", "ది ఎండ్ ఆఫ్ 500 ఇయర్స్ ఆఫ్ కాలనైజేషన్: టువర్డ్ ఎ న్యూ ఎరా ఆఫ్ పీస్ అండ్ డెవలప్‌మెంట్" అనే రెండు అంశాలను రెండ్రోజుల సదస్సులో చర్చించారు.

"సుస్థిర శాంతిని నెలకొల్పాలంటే, ప్రస్తుతమున్న వివాదాలను, ఘర్షణలను సమర్థంగా పరిష్కరించటంతో పాటు.. చరిత్రలో అసమానతలు, దేశాల మధ్య దోపిడీకి కారణమైన పరిస్థితుల్ని కూడా చక్కదిద్దే ఉదారతను, బాధ్యతను ప్రదర్శించాలి. చరిత్రలోని ప్రమాద, యాదృచ్ఛిక ఘటనలకు మితిమీరిన భాష్యాలివ్వకుండా.. అన్ని దేశాల న్యాయమైన ఆందోళనలపై భరోసా ఇవ్వాలి. ఏకధృవ ప్రపంచాన్ని కొనసాగించేందుకు మిగిలిన దేశాలను ఒడిదుడుకులలోకి నెట్టటం వల్ల ప్రస్తుత అంతర్జాతీయ సంక్షోభం తలెత్తినట్లు కనిపిస్తోంది. ఈ వైఖరి నుండి.. వాతావరణ మార్పుల పట్ల పెరిగిన ఉదాసీనత, ఇరాన్ యుద్ధ నేపథ్యంలో ఇంధన సంక్షోభం ఆకలి, అనారోగ్యం, అవిద్య, అభద్రత వంటి సమస్యలు కోట్లాది ప్రజల మానవ హక్కులకు విఘాతం కలిగిస్తున్నాయి. ఇప్పటిదాకా పలు దేశాలు సాధించిన అభివృద్ధిని తిరోగమనంలోకి నెడుతున్నాయి. ఈ నేపథ్యంలో.. పాతకాలపు ఆర్థిక, రాజకీయ ఆధిపత్య ధోరణుల్ని ఉన్నకొద్దీ తిరస్కరిస్తున్న దక్షిణ ధృవ దేశాల పట్ల పాశ్చాత్య దేశాలు ప్రజాస్వామిక రీతిలో వ్యవహరించాలి. ఆ దేశాల సార్వభౌమాధికారాన్ని గౌరవించాలి. యుద్ధగతులేకాదు.. దౌత్యపద్ధతులు కూడా ఆధునికమయ్యాయి. 'చర్చలు, అంతర్జాతీయ సహకారం, శాంతియుత పరిష్కారాల కోసం ప్రపంచ దేశాల, పౌరుల నిరంతర కృషి'.. ఇవి మాత్రమే నూతన ప్రపంచ క్రమానికి మూలస్తంభాలు కాగలవు.

21వ శతాబ్దంలో ఏకధృవ ప్రపంచం స్థానంలో బహుళ ధృవాలు ఆవిర్భవిస్తున్నాయి. చైనా పెరగటం, రష్యా నిలదొక్కుకోవటం, భారత్ ప్రభావం పెరగటం, బ్రెజిల్, దక్షిణాఫ్రికా, ఇండొనేషియా, కెనడా, ఐరోపా దేశాలు శక్తిమంతమవుతుండటం.. వంటివన్నీ పరిగణలోకి తీసుకోవాలి. ఈ చారిత్రక సంధి దశలో సమస్యల్ని దౌత్యమార్గంలో మాత్రమే ప్రపంచం పరిష్కరించుకోవాలి. 'దౌత్యం, అభివృద్ధి ఆధారిత బహుళ ధృవ ప్రపంచమే' మానవాళి సుస్థిర మనుగడకు మార్గం. వాణిజ్య, ఆర్థిక పోటీ కాస్తా, భౌగోళిక రాజకీయాల పోటీగా మారి యుద్ధాలకు దారితీయటం వినాశకరం. ఇతర దేశాలు అభద్రతతో ఉంటే ఏ దేశానికీ భద్రత లభించదు" అని ఆ సమావేశంలో వక్తలు పేర్కొన్నారు. ఈ అంశాన్ని ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయిల్ సుదీర్ఘ యుద్ధానికి ముందు 2025లో పశ్చిమాసియాలో ఘర్షణ వాతావరణం నేపథ్యంలో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ మరింత స్పష్టంగా పేర్కొన్నారు.

"కొంత హింస, రక్తపాతం ఉన్నప్పటికీ రెండో ప్రపంచ యుద్ధం తర్వాత గత 80 ఏళ్లుగా ప్రపంచం ఎంతో శాంతియుతంగా, స్థిరంగా ఉంది. ప్రపంచ నియమ నిబంధనల పట్ల ఒక స్థూల అంగీకారం, వాటిని పాటించటం కనిపిస్తుంది. అయినా కూడా.. ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్రను, ఇరాన్ అణుసదుపాయాలపై ఇజ్రాయిల్-అమెరికా దాడుల్ని మారుతున్న ప్రపంచ క్రమానికి సంకేతాలుగా గుర్తించాలి. ఈవేళున్న అంతర్జాతీయ వ్యవస్థ 1648లోని వెస్ట్‌ఫేలియా ఒప్పందం శాంతి పునాదులపై నిర్మితమైంది. కాలక్రమేణా ఇప్పుడున్న సార్వభౌమాధికార, జాతి-రాజ్య వ్యవస్థగా మారింది. పూర్వంలాగా.. ఒక దేశ సరిహద్దుల్ని సైనిక బలంతో మార్చటం లేదా ఆ దేశాన్ని ఆక్రమించటం ఆధునిక ప్రపంచంలో ఉల్లంఘనలు. ఉక్రెయిన్‌పై రష్యా దురాక్రమణ వంటివి, సరఫరా గొలుసుల్లో కీలకమైన ఇరుకు సముద్ర మార్గాలను దిగ్బంధించటం, ఇతర దేశాలను నాశనం చేయటమే ధ్యేయంగా కొన్ని దేశ ప్రభుత్వాలే ఉగ్రవాదుల్ని పోషించటం, అణ్వాయుధాల తయారీకి వెంపర్లాడటం, వాటితో బెదిరింపులకి దిగటం.. మొదలైనవి పరిష్కరించుకునే వివేకాన్ని, హేతుబద్ధత ఆలోచనాతీరుని మానవాళి పెంపొందించుకోవాలి. దీంతోపాటు, దేశీయంగా సమ్మిళిత ఆర్థికాభివృద్ధిని సాధించగలగాలి. వీటి మీదే ప్రపంచ మనుగడ ఆధారపడివుంది" అని జేపీ పేర్కొన్నారు. వెస్ట్‌ఫేలియా సంధి స్ఫూర్తికి, జాతి-రాజ్య భావనకు అమెరికా అడపాదడపా గండి కొడుతున్నా.. ఇన్నాళ్లూ ప్రపంచదేశాలు తమ ఆర్థిక అవసరాలు, పక్షపాత ధోరణితో చూసీచూడనట్లు వ్యవహరించాయి. ట్రంప్ సుంకాల నేపథ్యంలో కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ దావోస్ ప్రపంచ ఆర్థిక సదస్సులో చేసిన విమర్శలతో ఏకీభవించేవారి సంఖ్య ఇరాన్‌పై యుద్ధం వంటి భౌగోళిక రాజకీయ దుస్సాహసాల తర్వాత ఇంకా పెరుగుతోంది.

బహుళ ధృవ ప్రపంచంలో శక్తిమంతమైన దేశంగా ప్రపంచ క్రమాన్ని తిరిగి సుస్థిరం చేయటంలో తన బాధ్యతను క్రమశిక్షణతో నిర్వహించటం మాత్రమే.. 250వ స్వతంత్ర ప్రకటన వార్షికోత్సవాన్ని అమెరికా ఘనంగా జరుపుకోవటం; వాషింగ్టన్, జెఫర్సన్, రూజ్వెల్ట్, బెంజమిన్ ఫ్రాంక్లిన్, లింకన్ వంటి ఎందరో దార్శనికుల కృషికి సార్థకత కల్పించటమవుతుంది. ★

# హైదరాబాద్ ట్రాఫిక్, ప్రజారవాణా, మంచినీటి సరఫరాపై ఇంకెప్పుడు మేలుకొంటాం?



**- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్-**

ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్) మాతృసంస్థగా లోక్‌సత్తా రాజకీయ ఉద్యమ సంస్థ ఆవిర్భవించాక 1998, అక్టోబర్ 2న 'స్వరాజ్యం' పేరుతో ప్రజాహక్కుల పత్రాన్ని విడుదల చేశాం. గాంధీజీ చెప్పినట్లు.. ప్రజాస్వామ్యంలో రాజకీయాలకి సూత్రబద్ధత, ఎన్నికల ద్వారా ప్రజలు నిర్దిష్టకాలం పాటు ఇచ్చే అధికారానికి ఓ లక్ష్యం ఉంటాయి. ఆ లక్ష్యం – పౌరుల చుట్టూ పాలన. పౌరులకు ప్రభుత్వ కార్యాలయాల్లో హక్కుగా అందించాల్సిన సేవలు ఏమిటి, వాటిని ఎలా అందుకోవాలి మొదలైనవన్నీ స్వరాజ్యం పుస్తకం సవివరంగా పేర్కొంది. ఈ పౌర హక్కుల పత్రం ద్వారా ప్రజలు హక్కులను ఏ హడావుడీ, రాస్తారోకో, బంద్‌లు లేకుండా రాజ్యాంగ నిర్మాతగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేర్కొన్న పద్ధతుల్లో ఎలా సాధించుకోవాలో తెలియచేయటానికి లోక్‌సత్తా చేసిన మొదటి కార్యక్రమం – పెట్రోల్ బంక్‌లలో తూనికల్లో అక్రమాలను బయటపెట్టి వాటిని కట్టడి చేయటం. ఇందుకోసం నేను, ఇతర లోక్‌సత్తా కార్యకర్తలు హైదరాబాద్‌లో ట్రాఫిక్‌కి ఎటువంటి అంతరాయం కలిగించకుండా, ఒక వరుస క్రమంలో నడుచుకుంటూ వెళ్లి, తమ వద్ద ఉన్న క్యాన్‌లలో పెట్రోల్ పోయమని బంక్‌లలో అడిగాం. పెట్రోల్‌ను పంప్ ద్వారా మాత్రమే కాకుండా.. అధికారిక ఆమోదముద్ర ఉన్న క్యాన్‌లలో కూడా పోసి కొలత కచ్చితంగా ఉందో లేదో అడిగే అధికారం వినియోగదారులుగా ప్రజలకు ఉంది. ఆ హక్కుతోనే లోక్‌సత్తా క్యాన్‌లలో పోయమని అడిగితే, కొలతల్లో తేడా వచ్చింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని పెద్ద పట్టణాల్లో లోక్‌సత్తా కార్యకర్తలు ఇదేరకంగా పౌర తనిఖీలు చేశారు. ఈ సమాచారం వెల్లడికాగానే, సదరు మంత్రి, తూనికలు కొలతల శాఖ ఉన్నతాధికారుల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా అన్ని బంకుల్లో తనిఖీలు చేపట్టి, మీటర్లు సరి చేశారు. స్వరాజ్యాన్ని సురాజ్యంగా రాజ్యాంగబద్ధంగా మార్చే ఈ పద్ధతి దేశవ్యాప్తమై, అన్ని పెట్రోల్ బంకుల్లోనూ కొలతల్ని తగిన పర్యవేక్షణతో సరిచేశారు. అదేవిధంగా, కల్తీలపై కూడా వినియోగదారులు పరీక్షించుకునే పద్ధతిని లోక్‌సత్తా తెలియచెప్పింది. అప్పటితో పోలిస్తే ఈ మూడు దశాబ్దాలలో అనేక రెట్లు వాహనాలు, పెట్రోలు బంకులు పెరిగాయి. ఆ స్కేల్‌ను పరిగణలోకి తీసుకుంటే, లోక్‌సత్తా ఆనాడు చేసిన చిన్న ప్రయత్నం వల్ల ఇప్పటికి మనదేశంలో కొన్ని లక్షల కోట్ల డబ్బు ప్రజలకు ఆదా అయింది.

ఆ తర్వాత శిలాజ ఇంధనాల కంటే, పునరుత్పాదక ఇంధనాల వైపు, అది కూడా సుదీర్ఘకాలం కావలసినంత అందుబాటులో ఉండే సౌర శక్తి ఇంధనం వినియోగాన్ని ప్రోత్సహించేందుకు లోక్‌సత్తా ప్రయత్నం ప్రారంభించింది. అందువల్లే, పెట్రో ధరలు పెంచినప్పుడు మిగతా రాజకీయ ఉద్యమాలు, పార్టీల్లా ఎప్పుడూ ఆందోళన చేయలేదు. ఉన్నకొద్దీ ఆ వినియోగాన్ని తగ్గించాలన్నది లోక్‌సత్తా విధానం. మరో వంక, ఆరోజులా ఈవేళ లోక్‌సత్తా రోడ్డు మీద క్రమశిక్షణతో నడిచే పరిస్థితి లేదు. ట్రాఫిక్ అంత దారుణంగా తయారైంది. ఈ నేపథ్యంలో.. రోడ్డు మీద రాజ్యాంగబద్ధంగా చేసే ఆందోళన కూడా రాజ్యాంగ విరుద్ధ రాస్తారోకోలా తయారయ్యే పరిస్థితి. హైదరాబాద్ ట్రాఫిక్ ఒక సంక్షోభంగా మారుతున్న క్రమాన్ని గుర్తించి, నగరంలో డెడికేటెడ్ బస్ లేన్లతో బీఆర్‌టీఎస్‌ను అమలు చేయాలని లోక్‌సత్తా 2007–08లోనే ప్రతిపాదించింది. దీనివల్ల ప్రజలకు సౌకర్యంగా, కాలుష్యరహితంగా ఉండటంతో పాటు, నగరం ఇంకా వేగంగా పెరుగుతూ పెట్టుబడులు వస్తాయని గణాంకాలు సహా వివరించింది. అయితే అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఎల్ అండ్ టీతో ఒప్పందం కుదుర్చుకుని మెట్రో రైలు వైపు మొగ్గుచూపారు. ప్రభుత్వం కేవలం భూసేకరణ చేస్తే, మిగతావన్నీ తామే చూసుకుంటామని ఎల్ అండ్ టీ చెప్పటంతో, అది ప్రజలకు లాభసాటి కావటంతో లోక్‌సత్తా అంగీకరించింది. నిజానికి ఆ ప్రాజెక్ట్ ఎల్ అండ్ టీ సంస్థకు నష్టదాయకం. కానీ తర్వాత వేరే ప్రభుత్వ పనులు ఏమైనా వస్తే, ఆ నష్టాన్ని భర్తీ

చేసుకోగలమనే ఆశతో ఒప్పుకున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఎల్ అండ్ టీని కేసీఆర్ వ్యతిరేకించినా, లోక్‌సత్తా గట్టిగా సమర్థించింది. హైదరాబాద్ ఆదాయం పెరగటం తెలంగాణకు ఎలా లాభమో తెలియచెప్పింది. నిజానికి హైదరాబాద్‌లో హైటెక్ సిటీ ఏర్పాటుకి భూముల్ని కేటాయించటం, ఎల్ అండ్ టీని డెవలపర్‌గా నియమించటం, కేపీహెచ్‌బీ నుండి సైబరాబాద్‌కి రోడ్డు ప్రాజెక్టును ప్రతిపాదించటం ఇవన్నీ నేను ఏపిఐఐసి మానేజింగ్ డైరెక్టర్‌గా ఉన్నప్పుడు తీసుకున్న నిర్ణయాలు. ఆనాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంకల్పబలం, అవిశ్రాంత కృషి వల్ల హైదరాబాద్ నగరం టెక్నాలజీ రంగంలో ఒక కీలక కేంద్రంగా రూపొందింది. ఆ కృషినే రాజశేఖరరెడ్డి, కె.సి.ఆర్‌లు కొనసాగించి హైదరాబాద్ అభివృద్ధికి పార్టీలకతీతంగా విశేష ప్రయత్నం చేశారు. ఆ తర్వాత 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడటం, కేసీఆర్ మెట్రో రవాణాని ప్రోత్సహించటం తెలిసిందే. అయినా హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ జటిలమవుతోంది. రెండు సెంటీమీటర్ల వర్షం వస్తే, ముఖ్యమంత్రి నివాసమున్న ప్రగతిభవన్ ముందే రోడ్లు మీద నీళ్లు నిలిచే పరిస్థితి. ఈ వర్షంలో ప్రయాణించటమంటే నరకమే. కేసీఆర్ తర్వాత వచ్చిన కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా.. మెట్రోకి అదనంగా 30 కోచ్‌లు ఏర్పాటు చేసి రద్దీని తగ్గించేందుకు రూ.300 కోట్లు ఇవ్వకుండా, మెట్రోని ఎల్ అండ్ టీ నుండి ప్రభుత్వ పరిధిలోకి తీసుకున్నారు. రూ.22,000 కోట్ల ప్రాజెక్టుకు రూ.300 కోట్లు ఇవ్వటం తేలికా, మొత్తం నెత్తినేసుకోవటం తేలికా? అదేవిధంగా, ఏడాదికి రూ.1500 కోట్లతో అయిదేళ్లపాటు ఏడు వేల కోట్లు వెచ్చించి.. ముందుగా నగర ట్రాఫిక్ సమస్యను ప్రజారవాణాతో పరిష్కరించే ప్రయత్నం చేయకుండా, యూనియన్ ప్రభుత్వంతో కలిసి మెట్రో రెండోదశను రూ.48,000 కోట్లతో ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. పాలనలో ప్రాథమ్యాలు సరిగా లేకుంటే, ఎంత చిత్తశుద్ధి ఉన్నా సమస్యలు కొనసాగుతూనే ఉంటాయి.

హైదరాబాద్ గర్వంగా చెప్పుకునే మన నగరం. అభివృద్ధిలో బెంగళూరుతో పోటీపడాలని కోరుకుంటా. కానీ మనం ట్రాఫిక్ నరకంలో ఆ నగరంతో పోటీపడుతున్నాం. బెంగళూరులో గతంలో లోక్‌సత్తా తరపున రోజుకు నాలుగైదు కార్యక్రమాల్లో పాల్గొనే నాలాంటివారు.. ఇప్పుడు అక్కడ ట్రాఫిక్ రద్దీ వల్ల ఒక్క కార్యక్రమంలో పాల్గొనటం కూడా కష్టమవుతోంది. బెంగళూరు కంటే మౌలిక వసతులు, భూవనరులు ఉన్న హైదరాబాద్‌ను ట్రాఫిక్ విషయంలో తేలిగ్గా మెరుగుపరచవచ్చు. ట్రాఫిక్‌లో హైదరా'బాధ' సంక్షోభంగా మారకముందే.. ఎలా సంస్కరించవచ్చో పరిష్కారాల్ని రూపొందించేందుకు ఎఫ్.డి.ఆర్, లోక్‌సత్తా తరపున అధ్యయనం చేయటంతోపాటు.. ఆ రంగానికి సంబంధించిన నిపుణులు, జీహెచ్‌ఎంసీ, మెట్రో రైలు విభాగంలో అనుభవం ఉన్న అధికారులను, అన్ని ప్రధాన పార్టీల రాజకీయ నేతలను, పౌర సమాజాన్ని, యువ ప్రతినిధుల్ని భాగస్వాముల్ని చేస్తూ హైదరాబాద్‌లో ఇటీవల ఒక టౌన్‌హాల్ నిర్వహించాం. 'ట్రాఫిక్ అండ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ఇన్ హైదరాబాద్'కి కీలక సమస్యలను, పరిష్కారాలను ఈ సమావేశం ప్రాథమికంగా గుర్తించింది. మంచినీటి సరఫరా కష్టాలు, దిద్దుబాటు చర్యలపైనా దృష్టి సారించాం. వాటిని ప్రభుత్వం, పౌర సమాజం, హైదరాబాదీలు, ముఖ్యంగా యువతకు సంక్షిప్తంగా తెలియచేసి పరిష్కార కార్యాచరణలో భాగస్వాముల్ని చేసే ప్రయత్నమిది. నిజానికి ఈ పరిష్కారాలు, భారత్‌లోని అన్ని నగరాలకూ వర్తిస్తాయి. మనకు సంకల్పం ఉండాలేగానీ, పూర్తిగా ఆచరణసాధ్యం, తప్పనిసరి అవసరం.



భారతదేశ సమస్య ప్రధానంగా పట్టణీకరణలో ఉంది. ఆధునికకాలంలో పట్టణీకరణతోనే అభివృద్ధి సాధ్యం. కానీ వేగంగా జరుగుతున్నా, మన పట్టణీకరణ ఇప్పటికీ 35% మేరకే ఉంది. ఐక్యరాజ్యసమితి తాజా నివేదికలో భారత్‌లో 85% ప్రజలకు పట్టణ సదుపాయాలున్నాయని (రూర్బన్) చెబుతున్నా.. ఇప్పటికీ 60% జనాభా నివసిస్తున్న గ్రామాలలో అత్యధికం ఆర్థికాభివృద్ధి, ఉపాధి అవకాశాల కేంద్రాలుగా అభివృద్ధి చెందటం సాధ్యం కాదు. తగిన జనాభా, భౌగోళిక పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పుడే పట్టణీకరణ సహజంగా జరుగుతుంది. కాబట్టి, అంత పెద్దఎత్తున గ్రామాలు, వ్యవసాయం, అసంఘటిత రంగంలో జనాభా ఉండటం మన దేశ ఆర్థికాభివృద్ధికి పెద్ద సవాలుగా కొనసాగుతోంది. అందుకే చిన్న పట్టణాల అభివృద్ధి చేసి నూటికి 80 మంది అసంఘటిత కార్మికులకి ఉపాధి, పట్టణ సౌకర్యాలు, గౌరవప్రదమయిన జీవితం అందే ఏర్పాటు

చేయటం అత్యవసరం.

పట్టణీకరణ ద్వారా మనకంటే వేగంగా అభివృద్ధి చెందిన దేశాలు ట్రాఫిక్ సమస్యను ఒక క్రమపద్ధతిలో పరిష్కరించు కున్నాయి. అక్కడ ప్రజారవాణా 60-70% ఉండగా, ప్రయివేటు వాహనాలు 30% లోపు ఉన్నాయి. కానీ హైదరా బాద్‌లో అందుకు విరుద్ధంగా కార్లు, మోటారు సైకిళ్లు, స్కూటర్లు తదితర ప్రయివేటు వాహనాలు 60-70 శాతం దాకా ఉన్నాయి. ద్విచక్ర వాహనం ఉపయోగిస్తున్నవారు, కార్లు కొనటం సాధారణమైపోయింది. నగరలోని 1 కోటీ 40 లక్షల మంది జనాభాకు సుమారు 90 లక్షల వాహనాలుండగా, రోజుకు రెండు వేలు కొత్తగా వచ్చి చేరు తున్నాయి. హైటెక్ సిటీ ప్రాంతంలో.. ఒక్కో ఇంటికి 3-4 కార్లు ఉన్నాయి. ఈ పరిస్థితిని మార్చటానికి ప్రజా రవాణాలను అభివృద్ధి చేయాల్సిన ప్రభుత్వం.. మెట్రో విషయంలో అనాలోచిత నిర్ణయాలు తీసుకోవటం, ఆర్టీసీ, ఎంఎంటీఎస్‌ను పట్టించుకోకపోవటం వంటి చర్యలతో ప్రజలకు నరకం చూపిస్తోందన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం తర్వాత ప్రయాణికులు రోజుకు 16 లక్షల నుండి 25 లక్షలకు పెరిగితే, బస్సులు మాత్రం 2014లో ఉన్న 3,700 నుండి 3100కి తగ్గిపోయాయి. అది కూడా కాలం చెల్లిన బస్సుల్ని తాత్కాలి కంగా బాగుచేసి నడుపుతున్నారు. హైదరాబాద్ మెట్రో రైలుకి 171 కోచ్‌లు ఉంటే, మన కంటే కొద్దిగా పొడవైన బెంగళూరు మెట్రోకు 342 కోచ్‌లు ఉన్నాయి. వాళ్లు కొత్తగా 126 పెట్టెల్ని కొనుగోలు చేస్తున్నారు. మనం వేల కోట్ల ప్రాజెక్ట్‌ను మెరుగ్గా ఉపయోగించటానికి కనీస వనరులు ఇచ్చే విజ్ఞతను ప్రదర్శించలేకపోయాం. తెలంగాణ ఆదా యంలో సుమారు 75% హైదరాబాద్ నగరం అందిస్తోంది. గత ఆరేడేళ్లలో సుమారు ఏడు లక్షల ఉద్యోగాలను సిటీ అందించింది. ఇలాంటి నగరాన్ని మరింత సౌకర్యవంతంగా, సురక్షితంగా, పెట్టుబడులను ఆకర్షించేలా ఈ చర్యలతో పెంచటం అవసరం.

⏭ హైదరాబాద్‌లో వ్యక్తిగత వాహనాల వినియోగాన్ని ఇప్పుడున్న 60-70% నుండి 30% కంటే తక్కువకి తీసుకురావాలి. ప్రజారవాణాను 70% పైకి పెంచాలి. ప్రజారవాణాలో ప్రయివేటు భాగస్వామ్యం (వ్యక్తిగత ప్రయివేటు వాహనాలను, ప్రజారవాణాలో భాగమైన ప్రయివేటు వాహనాలను వేరుగా గుర్తించాలి) తీసుకోవచ్చు. వీటిలోనూ కాలుష్యాన్ని నివారించే ఎలక్ట్రిక్ వాహనాలకి, పునరుత్పాదక ఇంధన వనరులకి ప్రాధాన్యతనిచ్చి అందుకు తగిన మౌలిక వసతులపై దృష్టిసారించాలి. ఒకపక్కన డొక్కు బస్సుల్లో ప్రజలు వేలాడుతూ వెళ్తుంటే, ఇంకోపక్క 48 కార్లలో 48 మంది మాత్రమే ఖాళీ సీట్లతో డ్రైవ్ చేస్తుంటారు. ప్రపంచంలో ఎక్కడా 100% వ్యక్తిగత వాహనాల వల్ల అభివృద్ధి చెందిన నగరం లేదు. అమెరికాలాంటి దేశంలో కూడా ఆ పద్ధతి సాధ్యం కాదు.

⏭ ఫ్లైవోవర్లు 10-11 అంతస్తులు కూడా కట్టుకోవచ్చు. విద్యుత్ అలంకరణల మధ్య వాటిని చూసి మనం మురిసిపోవచ్చు. గర్వంగా చెప్పుకోవచ్చు. కానీ ఫ్లైవోవర్ల వల్ల ట్రాఫిక్ సమస్య పరిష్కారం కాదు. హైదరాబాద్‌లోనే కొన్నిచోట్ల ఫ్లైవోవర్ ప్రారంభించిన రోజునే, అక్కడ ట్రాఫిక్ జామ్ మొదలైంది. కాబట్టి, ట్రాఫిక్ ఒత్తిడిని పరిష్కరించా లనుకోవద్దు.. ఆర్టీసీ, మెట్రో, ఎంఎంటీఎస్ మొదలైన 'ప్రజారవాణా వ్యవస్థను విధానపరంగా' పరిష్కరించండి.

⏭ రోడ్లు విశాలం చేయటానికి, ఫుట్‌పాత్‌లను పరిరక్షించటానికి, వర్షపునీరు వరదలు కాకుండా, డ్రైనేజీలు పొర్లకుండా, శాస్త్రీయంగా చర్యలు తీసుకోవాలి. నీటి ప్రవాహదిశను సాంకేతికంగా అంచనా వేసి రహదారుల నిర్మాణం, విస్తరణ జరగాలి. కాంటూర్ సర్వే చేయకుండా, నీరు పల్లమెరుగు అనే సాధారణ సూత్రాన్ని సైతం పాటించకుండా రోడ్ల నిర్మాణం, వాటి అంతర్భాగంలో మురుగు, మంచినీరు పైప్‌ల లీకేజీల్ని సకాలంలో గుర్తించటంలో నిర్లక్ష్యంతో.. వాన-వరద- మురుగు- మంచినీరు కలిసి ప్రవహించటం సాధారణమైంది.

⏭ నగరంలో అడిగినవారికి, అడగనివారికి కూడా మంచినీరు ఉచితంగా సరఫరా చేయటంతోపాటు.. ఎంతో విద్యుత్ వినియోగంతో కృష్ణా, గోదావరి నదుల నుండి తీసుకొస్తున్న తాగునీటిలో 40% వృధాగా పోతున్నా, మూసీలో కలిసిపోతున్నా, తాగునీరు కలుషితమై ప్రజా రోగ్యం దెబ్బతింటున్నా చర్యలు లేవు. మురుగు నీరు వచ్చి మంచినీటిలో కలవకుండా రోడ్లు, విస్తరణ, వాటిల్లో మురుగు, మంచినీరు సవ్యంగా పారేలా, మరమ్మతులు వచ్చినప్పుడు వెంటనే గుర్తించగలిగే సాంకేతికతతో నిర్మాణం చేయాలి. పెద్ద ఖర్చులేకుండానే, ఈవేళ్టి సాంకేతికతతో ఇవన్నీ సాధ్యం. ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులను ప్రాజెక్ట్ వర్క్‌లో భాగంగా ఇందులో వినియోగించుకోవటానికి ఒప్పందాలు కుదుర్చుకోవచ్చు. హ్యాండ్సాన్ నైపుణ్యం వల్ల వారికీ తర్వాత మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయి. చాలా వనరులపరంగా సుసంపన్నమైన హైదరాబాద్‌కి రెండు పెద్దనదులు -కృష్ణ, గోదావరి- సానుకూలత ఉంది. లండన్, రోమ్, బెర్లిన్, బార్సెలోనా, వియన్నా లాంటి మహానగరాలకు కూడా లేని అవకాశం ఉంది. కానీ మన పాలన అధ్వాన్నం కావటం వల్ల.. వానాకాలం ఎటుచూసినా నీరున్నట్లు కనిపిస్తుంది. కాస్త ఎండరాగానే.. మళ్లీ నీళ్లకు కటకట. వర్షపు నీటిని నిల్వ చేయటం, మంచినీటి

సరఫరాలో వృధాను అరికట్టటం, మంచినీరులో మురుగు నీరు కలవకుండా చర్యలు కీలకం. మురుగునీరును వృధాగా భావించకుండా రీసైక్లింగ్ ద్వారా రక్షిత నీటిగా మార్చి వినియోగించుకునే పద్ధతీ అవసరం. ప్రతిరోజు 477 మిలియన్ గాలన్ల నీటిని- అంటే 217 కోట్ల లీటర్ల నీటిని- కృష్ణ, గోదావరిల నుండి తరలిస్తున్నా, దాదాపు సగం నీరు వృధాగా మూసీలో కలిసిపోవటంతో నగర ప్రజలు మంచినీటి కొరత వల్ల నరకం అనుభవించాల్సి వస్తోంది. కాబట్టి, ట్రాఫిక్, ప్రజారవాణాతోపాటు.. మంచినీటి సరఫరా కూడా భాగంగా తీసుకుని పంపిణీ వ్యవస్థను ప్రక్షాళన చేయాలి. వృధాకి ఆస్కారంలేకుండా 24 గంటల సరఫరా దిశగా చర్యలు అమలు చేయాలి.

⏭ అంతర్జాతీయ నగరాల్లో రోడ్ల విస్తీర్ణంలో ఫుట్‌పాత్‌లు, సైక్లింగ్ ట్రాక్‌లకు సింహభాగం కేటాయిస్తారు. లండన్, సింగపూర్ వంటి నగరాల్లో నాన్-మోటరైజ్డ్ ట్రాన్స్‌పోర్ట్ వాటా 30 శాతానికిపైగా ఉంటే హైదరాబాద్‌లో 5 శాతం లోపే ఉంది. షాంఘైలో 10 లక్షలకిపైగా ఇ-సైకిళ్లు ఏర్పాటు చేశారు.

⏭ రోడ్ల విస్తరణ, ఫుట్‌పాత్‌ల పరిరక్షణ సమయంలో మన లాంటి పేద దేశంలో రోడ్ల పక్కన వ్యాపారం చేసుకునేవారి పొట్ట కొట్టకూడదు. అభివృద్ధిని, జీవనోపాధిని కలపాలి. వారికి ప్రత్యామ్నాయం కల్పిస్తూ విస్తరణ చర్యలు తీసు కోవాలి.

⏭ ట్రాఫిక్ జంక్షన్లను మెరుగుపరచటానికి చిన్న చిన్న మార్పులకు ప్రాధాన్యత ఇవ్వాలి. అదేవిధంగా, తక్కువ వ్యయంతో పెద్ద మార్పులు తీసుకొచ్చేందుకు ప్రయత్నించాలి. ఇలాంటి నాయకత్వ సామర్థ్యాన్ని మనమేమీ కొత్తగా ప్రదర్శించటం లేదు. చాలా దేశాల్లో దిగువస్థాయి ప్రజా ప్రతినిధులు కూడా పన్నుల డబ్బును జాగ్రత్తగా వినియోగించటం, సులభమైన పరిష్కారాలను అమలు చేయటం సాధారణ పాలనలో భాగంగా పాటిస్తారు.

⏭ హైదరాబాద్‌లో బస్సులు, మెట్రో రైలుకి అదనపు కోచ్‌లు, లక్ష ఎలక్ట్రిక్ షేరింగ్ సైకిళ్లు, ఎంఎంటీఎస్ విస్తరణకు సుమారు రూ.7,000 కోట్లు ఖర్చవుతాయి. తెలంగాణ ఆదాయంలో 75% ఇస్తూ, 55% రెవెన్యూ మిగులున్న, జీఎస్‌టి వసూళ్లను ఏటా పెంచుతున్న హైదరాబాద్ నగరం వల్లే రాష్ట్ర బడ్జెట్ ప్రస్తుతం రూ.3,24,000 కోట్ల మేర ప్రతిపాదించగలిగారు. ఒక్క హైదరాబాదు నగరం నుంచే రాష్ట్ర ప్రభుత్వానికి సుమారు లక్ష కోట్ల రూపాయిల పన్నుల ఆదాయం వస్తోంది. అందులో ఏడాదికి 14-1500 కోట్ల చొప్పున అయిదేళ్లలో రూ.7,000 కోట్లు ఖర్చు చేయ లేరా? తెలంగాణ ప్రభుత్వం చేసే 2 రోజుల ఖర్చుతో ఈ మొత్తం సమానం. ముందు ఇందుకు చర్యలు తీసుకుని, ఆ తర్వాత




మెట్రో రెండో దశ, ఇతర పెద్ద పథకాలు చేపట్టవచ్చు.

⏭ ట్రాఫిక్ చలానాలను విధించేది ఆదాయం కోసం కాదు. ఆ తప్పు మళ్లీ చేయకుండా, ఎవరి ప్రాణాలతో చెలగాట మాడకుండా ఉండటం కోసం. వాటిని ఎన్నికల్లో ఓట్ల కోసం మాఫీ చేస్తే, వాటిల్లో రాయితీలు ప్రకటిస్తే.. అది పరిపాలనా?.. ఎడమ వైపు నుండి ఓవర్‌టేక్ చేయటం, ట్రాఫిక్ సిగ్నల్స్ జంప్ చేయటం వంటి వాటిపై కచ్చితంగా చట్టాన్ని అమలు చేయాలి. హైదరాబాద్‌లో గత కొన్నేళ్లలో 1 కోటీ 73 లక్షల ట్రాఫిక్ చలాన్లు జారీ చేశారట. వాటిలో చాలా మాఫీ చేశారు.

⏭ ట్రాఫిక్‌లో వాహనదారులు దురుసుగా కాకుండా.. పరస్పర నాగరికంగా స్పందించేలా, సివిక్ సెన్స్‌ని పెంచాలి.

⏭ నేను మొదటిసారి విదేశాలకు ఓ అధికారిక పర్యటనలో భాగంగా నెదర్లాండ్స్‌కి వెళ్లాను. అక్కడ ఉదయాన్నే పెందరాళే ఆఫీసులకు వెళ్లి సాయంత్రం నాలుగు గంటల కల్లా ఇంటికి తిరిగెళ్తారు. మా బృందం సాయంత్రం 5 గంటలకు ఏదో కార్యక్రమంలో పాల్గొనటానికి రోడ్డు దాటటానికి నిలబడ్డాం. రోడ్డు మీద ఒక్క వాహనం లేదు, నిర్మానుష్యంగా ఉంది. ఎవరూలేరుగదా అని మేం బిలబిలా రోడ్డు దాటుతున్నాం. మాకు గైడ్ చేస్తున్న డచ్ మహిళ వెంటనే మమ్మల్ని వారించి, 'జెంటిల్మన్, వాక్ సిగ్నల్ కోసం వెయిట్‌చేయండి' అన్నారు. ఆ తర్వాత అక్కడున్నన్ని రోజులూ మేం ఎప్పుడూ ట్రాఫిక్ నియమాల్ని ఉల్లంఘించలేదు. విదేశాల్లో మనం ప్రదర్శించే క్రమశిక్షణని మన దేశంలో ఎందుకు అనుసరించలేకపోతున్నాం? సంస్కృతి ఒక భాగం మాత్రమే. అది ఇతరులకు ఇబ్బందిగా, నష్టంగా పరిణమించే అవకాశముంటే.. కచ్చితంగా చట్టబద్ధమైన చర్య తీసుకోవాలి.

⏭ ఆర్‌టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించినట్లే, ఎంఎంటీఎస్‌లోనూ ఉచిత అవకాశమిస్తామంటున్నారు. ఈ నిర్ణయాన్ని ఆహ్వానిస్తున్నాం.

గతంలో 1 లక్షా 90 వేల మంది ప్రయాణించే ఎంఎంటీఎస్‌లలో ఇప్పుడు.. రోజుకు కేవలం 40,000 మంది ప్రయాణిస్తున్నారు. డెడికేటెడ్ లైన్లు, అన్ని రూట్లలో, ఎక్కువ సంఖ్యలో ఎంఎంటీఎస్‌లు, సమయపాలన ఉంటే.. అత్యంత చౌకగా, కాలుష్యం లేకుండా ప్రయాణించవచ్చు. అదేవిధంగా, ఇంటి వద్ద వరకు సదుపాయం ఉండేలా, ప్రజారవాణాను కాలనీల్లో, ఇతర చోట్ల లాస్ట్ మైల్ కనెక్టివిటీకి విస్తరించాలి.

⏭ ఆర్‌టీసీ బస్సులు, మెట్రో రైలు, రోడ్ల నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ వేర్వేరు శాఖల పరిధిలో ఉన్నాయి. సమన్వయలేమితో సిగ్నల్ వ్యవస్థలు, బస్‌బేల నిర్మాణం, మెట్రో స్టేషన్ల వద్ద కనెక్టివిటీ గందరగోళంగా మారాయి. లండన్‌లో మాదిరి ఏకీకృత సంస్థే దీనికి ఏకైక మార్గం. ఆర్‌టీసీ, ఎంఎంటీఎస్, మెట్రో రైలు, షేరింగ్ ఇ-సైకిళ్లు మొదలైనవాటన్నిటికీ 'ఒకే డిజిటల్ టికెట్ విధానాన్ని' అమలు చేయాలి. ప్రయివేటు సంస్థల భాగస్వామ్యం కూడా తీసుకోవచ్చు. తెలంగాణ ప్రభుత్వం యు.ఎం.టి.ఎ (ఉమ్టా) అని ఇందుకోసం ఓ సంస్థను ఏర్పాటు చేసినా, నామమాత్రంగా మారింది. తమిళనాడులో ఇలాంటి సంస్థకు ముఖ్యమంత్రి సారథ్యం వహిస్తున్నారు. ఇక్కడా ముఖ్యమంత్రి ఛైర్‌పర్సన్‌గా వ్యవహరించవచ్చు.

⏭ హైదరాబాద్‌లో ఇంటి నుంచి బస్సు, మెట్రో, లేదా లోకల్ రైలు అందుకోవటానికి, లేదా దిగిన తరువాత గమ్యాన్ని చేరుకోవటానికి ఎక్కువ ఖర్చు, సమయం వృథా అవుతున్నాయి. 20% ప్రయాణించటానికి.. 40% సమయం, మొత్తంగా 60% ఖర్చు భరించాల్సి ఉంటుంది. కాబట్టి ప్రయాణం మొదటి భాగం, చివరి భాగం (ఫస్ట్ మైల్, లాస్ట్ మైల్) – వీటి మీద దృష్టిని పెట్టి స్వంత వాహనం వాడకుండా సుఖంగా ప్రయాణం చేసే ఏర్పాట్లు అత్యవసరం.

⏭ రూ.12 లక్షలతో కారు కొంటే.. హైదరాబాద్‌లో పెట్రో ఖర్చు నెలకి రూ.20,000; ప్రయాణమేమో 55 నిమిషాల్లో 14 కిలోమీటర్లు. హైదరాబాద్‌లో అన్నిచోట్లా వెంటనే ప్రయివేటు వాహనాలను తగ్గించటం, ప్రజారవాణాను తప్పనిసరిచేయటం ఇప్పటికిప్పుడు సాధ్యంకాక పోవచ్చు. కానీ వెంటనే ప్రారంభించి, నగరంలో ఎక్కడ వీలుంటే అక్కడ మార్పులు తీసుకొస్తుంటే, క్రమంగా మిగిలినవారూ ట్రాఫిక్ పరిష్కారంలో భాగమవుతారు. ప్రజలుగా మనం కూడా ప్రభుత్వ ట్రాఫిక్ సంస్కరణలకు సహకరించే బాధ్యత తీసుకోవాలి. వాతావరణ పరిస్థితులు, అంతరాయాలులేని ట్రాఫిక్‌కి అనుగుణంగా ఐ.టి తదితర ఎక్కువ సిబ్బంది కార్యాలయాల సమయాల్ని సర్దుబాటు గావించుకోవటం, తల్లిదండ్రుల కార్లు తదితర సొంత వాహనాల వల్ల ట్రాఫిక్ జామ్ లేకుండా పాఠశాలలకు పిల్లలు వెళ్లి రావటానికి ఎక్కువగా సురక్షిత స్కూల్ బస్సులను, మెట్రో కనెక్టివిటీని వినియోగించటం మొదలైనవి పాటించాలి.

⏭ సొంత వాహనాలను ప్రయివేటు భాగస్వామ్యంలో భాగంగా ప్రజారవాణాకు అద్దెకివ్వొచ్చు. మన మహిళా సంఘాలు కొన్ని ఆ రకంగా తమ లాభాన్ని సమాజహితంతో సంధానం చేస్తున్నాయి.

⏭ ట్రాఫిక్‌లో ఆదర్శంగా ఉండే సింగపూర్‌లాంటి చోట కూడా వ్యక్తిగత ప్రయివేటు వాహనాలు ఉంటాయి. కానీ తక్కువ. 70% పైగా ప్రజారవాణా ఉంటుంది. సొంత వాహనం వినియోగించాలనుకుంటే, పన్నుల రూపంలో యజమాని చాలా డబ్బు చెల్లించాల్సి ఉంటుంది. అదేవిధంగా, పార్కింగ్ ద్వారా వచ్చే ఫీజు చాలా దేశాల్లో నగరాలకి ప్రధాన ఆదాయ వనరు. ప్రజారవాణాను ఎంతో నాణ్యతతో నిర్వహించటంతోపాటు.. సింగపూర్, తైపీ, హాంకాంగ్ వంటి నగరాల్లో మెట్రో రైళ్లను కూడా లాభాల్లో నడిపిస్తున్నారు. కాని మంచి ప్రమాణాల పౌర రవాణా లేకుండా ప్రైవేటు వాహనాలని అదుపుచేయలేం. అందుకే గత్యంతరంలేక హైదరాబాద్‌లో రోజుకి కొత్తగా 2500 ప్రైవేటు వాహనాలు నమోదవుతున్నాయి. ఇప్పటికి 84 లక్షల వాహనాలున్నాయి. 2030 నాటికి జనాభా కంటే వాహనాల సంఖ్య ఎక్కువవుతుంది.

**ఎన్నిక ఏదైనా, ఓటు.. ఈ 5 డిమాండ్లూ ఉన్న ఎజెండాకే**

ఇవేమీ గొంతెమ్మ కోర్కెలు కాదు. చాలా సులభంగా అమలు చేయగలిగినవి. హైదరాబాద్ ట్రాఫిక్ వల్ల ఇబ్బంది పడనివారు ఒక్కరు కూడా లేరు. ఒక్కో హైదరాబాదీ సగటున ఏడాదికి 123 గంటలు ట్రాఫిక్ వల్ల నష్ట పోతున్నట్లు అంచనా. దీనివల్ల ప్రభుత్వానికి, ప్రజలకు వస్తున్న ఆర్థిక నష్టం సుమారు రూ.50,000 కోట్లు. కాబట్టి మెట్రో, ఆర్‌టీసీ, ఎంఎంటీసీ, ఇ-సైకిళ్లు తదితర బహుళ ప్రజా రవాణాను ప్రయివేటు భాగస్వామ్యంతో 'ఒకే డిజిటల్ టికెట్' ద్వారా అనుసంధానించటం; వ్యక్తిగత ప్రయివేటు వాహనాల అవసరాన్ని, వినియోగాన్ని భారీగా తగ్గించేలా చర్యలు; రహదారులు, ఫుట్‌పాత్‌ల పరిరక్షణ, పార్కింగ్, ఇతర చట్టబద్ధ చర్యల్ని కచ్చితంగా అమలు చేయటం మొదలైన పరిష్కారాల ద్వారా హైదరాబాద్ ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు; ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం ద్వారా భాగ్యనగరాన్ని కాలుష్యరహిత గ్లోబల్ సిటీగా మార్చు కునేందుకు; తాగునీటి సరఫరాలో వృధాను అరికట్టి 24 గంటల సరఫరా దిశగా చర్యల కోసం.. ప్రభుత్వం, పార్టీలు, పౌర సమాజం, ప్రజాసంఘాలు, యువత, మహిళలు అందరూ ముందుకు రావాలి. జీహెచ్‌ఎంసీలో ఎన్నిక ఏదైనా.. మన ఓటు పార్టీలకు కాదు, ఈ అయిదు డిమాండ్లూ ఉన్న ఎజెండాకి మాత్రమే. ★

# హైదరాబాద్ ట్రాఫిక్, ప్రజారవాణా, మంచినీరుపై జేపీ టౌన్‌హాల్‌లో అఖిలపక్షం అభిప్రాయాలు




**ఈ టౌన్‌హాల్ రెండు ప్యానల్ చర్చలుగా జరిగింది. జేపీ సమన్వయకర్తగా వ్యవహరించారు. చర్చలో అధికారులు, వివిధ పార్టీల నేతలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు, సూచించిన పరిష్కారాలు సంక్షిప్తంగా:**



⇨ రుతుపవనాలు మొదలయ్యాయంటే, హైదరాబాద్ రోడ్లు వరదల్ని తలపిస్తాయి. ఈలోగానే రోడ్ల విస్తరణ, ఇతర మరమ్మతుల్ని పూర్తి చేయాలి. నగర రోడ్లను ఆక్రమణలు, చట్ట విరుద్ధ వాడకాల నుండి విముక్తి చేస్తే.. విస్తరణకు 33% స్థలం లభిస్తుంది. ట్రాఫిక్ సమస్యలపై శ్రద్ధ పెట్టిన మొదటితరం నిపుణుడు ప్రొఫెసర్ రాఘవాచారి చెప్పినట్లు, జంక్షన్ల వద్ద సులభంగా ఉండే ఇంజినీరింగ్ పరిష్కారాల్ని అమలు చేయాలి. అదేవిధంగా, విదేశాల్లో చాలా నగరాల్లో పార్కింగ్ ఫీజు పెద్ద ఆదాయమార్గం. మన వద్ద పార్కింగ్‌పై శ్రద్ధ లేదు. రోడ్ల మీద పార్కింగ్ సదుపాయం ఉంది గదా అన్నట్లు, ఎవరూ ఉన్న కొన్ని పార్కింగ్ సదుపాయాల్ని కూడా వినియోగించరు. రోడ్ల మీద పార్కింగ్ చేసే వారిపై చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి. సింగపూర్, తైపీ, హాంకాంగ్ వంటి నగరాల్లో మెట్రో ఎందుకు లాభాల్లో నడుస్తోందో అధ్యయనం చేయాలి. పార్కింగ్ ఫీజును భారీ ఆదాయ వనరుగా మార్చాలి. నగర జనాభా 2050 నాటికి 2 కోట్ల 80 లక్షలకు పెరుగుతుంది. ఇప్పటి నుండే సిద్ధమవ్వాలి.

**– ఎన్‌వీఎస్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు, మెట్రో రైలు కార్పొరేషన్ ప్రారంభ ఎండీ**



⇨ జీహెచ్ఎంసీ మాజీ కమిషనర్‌గా హైదరాబాద్‌లో అభివృద్ధికి, అధ్వాన్నానికీ బాధ్యత వహిస్తాను. ప్రయాణాలు అత్యంత నెమ్మదిగా సాగే నగరాల్లో బెంగళూరు 16 కిలోమీటర్లయితే, హైదరాబాద్ 19 కిలోమీటర్లు. ఒక్కోసారి పది నిమిషాలకి ఒక కిలోమీటరు వెళ్లటం గగనం. సైకిలు మీదయినా, హైదరాబాద్‌లో గంటకు 16 కిలోమీటర్లు వెళ్లగలం. కానీ మిగతా వాహనాల మధ్య సైకిల్ ప్రయాణం కష్టం. అదేవిధంగా, నగరంలో మొత్తం 9,250 కిలోమీటర్ల మేర రోడ్లు, 1000 కిలోమీటర్ల ఫుట్‌పాత్‌లు ఉంటే.. పాదచారుల నడక మార్గంలో 99.9% ఆక్రమణలకు గురైంది. జీహెచ్ఎంసీలో నెలలో ప్రతి మొదటి శనివారం మిగతా కమిషనర్లు, కలెక్టర్లతో సమావేశం నిర్వహించేవాళ్లం. సగానికిపైగా సమస్యలు ట్రాఫిక్‌కి సంబంధించే వచ్చేవి. యూటర్న్‌లు వంటి పరిష్కారాలను అమలు చేసేవాళ్లం. తెలంగాణలో మొత్తం 1,70,000 కుటుంబాలుంటే.. 1,73,000 వాహనాలున్నాయి. అంటే ఇంటికి సగటున ఒకటిన్నర వాహనం. భారత్‌లో 33 కోట్ల కుటుంబాలుంటే.. 32-33 కోట్ల వాహనాలున్నాయి. అంటే, ఇంటికి ఒక వాహనం. మొబైల్ ఫోన్లతో సమానసంఖ్యలో ఉన్నాయి. అదేవిధంగా, భారీ వర్షాల సమయంలోలా.. ప్రజలు అనవసరంగా రోడ్ల మీదకు రాకుంటే, చాలా ట్రాఫిక్ రద్దీని నియంత్రించవచ్చు. పౌరులు కూడా తమ ప్రాంతంలోని కమ్యూనిటీతో కలిసి పరిష్కారాలను సూచించాలి. ఇంటి




నుండి బయటికి వెళ్లాల్సి వచ్చినప్పుడు, ప్రజా రవాణా ఉందా? అనే అంశాన్ని తెలుసుకుని, తప్పనిసరైతే తప్ప.. సొంత వాహనాల్ని వినియోగించకూడదు. ప్రభుత్వం 'పెద్ద ఖర్చు లేకుండా' అమలు చేసే పరిష్కారాల ద్వారానే చాలా ఫలితాల్ని సాధించవచ్చు.


**– జనార్థనరెడ్డి, పూర్వ ఐఏఎస్ అధికారి**
**జీహెచ్ఎంసీ మాజీ కమిషనర్**

⇨ పార్కింగ్ సమస్యను కొనసాగిస్తున్నాం. ఐస్‌క్రీమ్ కోసం సురక్షితంగా వెళ్లిరావటానికి కార్లు వాడుతున్నాం. విదేశాల్లోలా మనకు స్పేస్‌వాక్ లేదు. ఫుట్‌పాత్ ఎక్కడ కట్ అవుతుందో తెలియదు. అదేవిధంగా, ప్రవర్తనలో మనకు సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. ఇద్దరు వాహనదారుల మధ్య సమస్య రోడ్ రేజ్‌గా, పెద్ద వివాదంగా తయారవుతోంది. ప్రయివేటు స్కూల్ బస్సులో ప్రయాణించే పిల్లలు 30% మంది మాత్రమే. మిగిలినవారంతా వాహనాల్లో వస్తారు. స్కూల్ వద్ద, ఆ తర్వాత ఒక జంక్షన్ నుండి ఇంకో జంక్షన్‌కి, అలా నగరంలోని చాలా ప్రాంతాలు స్కూల్ టైమింగ్స్‌లో జామ్ అవుతున్నాయి. లక్షల మంది ఉద్యోగులు, సొంత వాహనాలు, అందులోనూ కార్లు ఎక్కువగా ఉండే సైబరాబాద్‌లో కార్యాలయాలకు ముందుగానే వర్షం వచ్చే అవకాశాలు వంటి వాతావరణ హెచ్చరికలు చేస్తుంటాం. ఒకేసారి అందరూ రావటం, వెళ్లటం కాకుండా.. కార్యాలయ సమయాల్లో మార్పులు చేయటం వల్ల కూడా ట్రాఫిక్ అవరోధాలను నియంత్రించవచ్చు. అమెరికాలాంటి చోట సొంతకార్లున్నా, వారాంతాల్లో తప్ప ఉపయోగించరు. రోడ్ల మీద ఇబ్బందులు రాకుండా ప్రజారవాణా ఉపయోగిస్తారు.

**– నవేద్‌ఖాన్,**
**సొసైటీ ఫర్ సైబర్ సెక్యూరిటీ సీఈవో**

⇨ హైదరాబాద్ చాలా అంశాల్లో భారత్‌లోనే అగ్రస్థానంలో ఉన్న నగరం. ప్రపంచంలోనే వేగంగా పెరుగుతున్న నగరం. అదేవిధంగా, ఆటోమొబైల్ రంగం దేశంలో 3.2 కోట్ల మందికి ఉపాధినిస్తుంటే, హైదరాబాద్ అందులో కీలకపాత్ర పోషిస్తోంది. ఈ రకంగా చూస్తే, హైదరాబాద్ ట్రాఫిక్, ప్రజలు అటూఇటూ ప్రయాణించటం.. అభివృద్ధికి సంకేతం. మిగతా చాలా అంశాల్లో వేగంగా పెరుగుతున్న హైదరాబాద్, ట్రాఫిక్ నియంత్రణలో మాత్రం ఉన్నకొద్దీ దిగజారుతోంది. గత ఆరేళ్ల వరకు ఎంఎంటీఎస్‌లో 1 లక్షా 90 వేల మంది ప్రయాణిస్తే, ఇప్పుడు రోజుకు కేవలం 40,000 మంది ఉపయోగించుకుంటున్నారు. అదేవిధంగా, ఆర్టీసీని కుంగదీశారు. దిల్‌షుక్‌నగర్ నుండి హైటెక్‌సిటీకి మెట్రో ద్వారా 50 నిమిషాలు సమయం పడుతుంటే, రెండున్నర గంటలు పట్టే కారు ప్రయాణాన్ని చాలామంది ఉపయోగిస్తున్నారు. మనం ట్రాఫిక్ ప్రవాహంలో కొట్టుకుపోకుండా కాస్త ఆలోచిస్తే, సమస్యను కచ్చితంగా పరిష్కరించుకోగలం. సుమారు యాభై ఏళ్లుగా ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్న జేపీ.. ట్రాఫిక్ సమస్యలపై సైతం దృష్టి సారించటం అభినందనీయం. యువత, ప్రజలు.. ఎమ్మెల్యేలు, ఎంపీలు కానక్కర్లేదు. జేపీ స్ఫూర్తితో పనిచేస్తే మీ జీవితాల్లో, సమాజంలో చాలా విలువైన మార్పులు తేగలరు.

**– అలవిల్లి శ్రీనివాస్,**
**పౌర సమాజ నేత, డబ్ల్యూఆర్ఐ ఫెలో**



⇨ హైదరాబాద్ మహానగరానికి మేయర్‌గానూ పనిచేశాను. కానీ ట్రాఫిక్ బాగుచేసేందుకు ప్రభుత్వాలకు ఆసక్తి లేదు. అధికారులు పాలకుల ముందు పరిష్కారాలు చెప్పరు. ట్రాఫిక్ సమస్యకు పోలీసుల పరిష్కారం – బస్సుల్ని రద్దు చేయటం. రోడ్లపై రద్దీ తగ్గేందుకు కేవలం నాంపల్లి నియోజకవర్గంలో 47 దాకా బస్సుల్ని రద్దు చేశారు. మధ్యతరగతి ప్రజలు నివసించే ప్రాంతాల్లో రోడ్లు ఇరుకుగా ఉంటే, వాటిని విస్తరించకుండా అక్కడా బస్సుల్ని



రద్దు చేశారు. దీంతో చాలామంది సొంత వాహనాలు కొనుక్కున్నారు. మనమే ప్రజల్ని వ్యక్తిగత వాహనాలకు మళ్లించాం. హైదరాబాద్ ట్రాఫిక్ సమస్యను పరిష్కరించగలిగితే, చాలా రాష్ట్రాలకు మార్గం చూపినవారిమవుతాం.

**– మాజిద్ హుస్సేన్, నాంపల్లి ఎమ్మెల్యే**

⇨ ఇది ప్రజలకు అత్యంత అవసరమైన కార్యక్రమం. మన రాజకీయంలో సమస్య కేవలం అయిదేళ్ల విజన్‌తో మాత్రమే పనిచేయటం. దీంతో హైదరాబాద్‌లో ప్రజారవాణా జాతీయ సగటు కంటే తక్కువగా ఉంది. నగరాభివృద్ధి వేగానికి తగ్గట్లు నిరంతరం ట్రాఫిక్ సంస్కరణల్ని తెస్తుండాలి. అందుకు ప్రజలనూ సిద్ధం చేయాలి.

**– దాసోజు శ్రవణ్, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ**

⇨ఇతర దేశాల్లో ప్రతి నగరానికీ ట్రాఫిక్ ఇంజినీర్లు ఉంటారు. మన వద్ద అలాంటి ఆలోచనే చేయరు. జీహెచ్ఎంసీలో ఇద్దరు, ముగ్గురు ట్రాఫిక్ ఇంజినీర్లు ఉన్నారట. వారు భవనాలకు అనుమతులిచ్చేటప్పుడు ట్రాఫిక్‌కి సంబంధించి సూచనలివ్వటం ఎప్పుడో మర్చిపోయారు. మన నాయకులు టీవీ స్టూడియోల్లో తిట్టుకుంటాంగానీ, మిగతా సమయాల్లో కలిసే ఉంటాం. నాయకులు ఆలస్యానికి ట్రాఫిక్ జామ్ కారణం అని చెప్పటానికి పరిమితం కాకుండా.. మంచి పౌరులుగా, ప్రజలకు ఆదర్శంగా ఈ విషయంలో వ్యవహరించాలి.

**– సుభాష్. బీజేపీ ప్రధాన అధికార ప్రతినిధి**

**మొదటి, చివరి మైలు అనుసంధానం (ఇంటి దగ్గర్నుంచి సులభంగా బయల్దేరి, అంతే సౌకర్యవంతంగా, సకాలంలో తిరిగిరావటం)**

❖ నగరంలో ప్రతి సైకిల్‌కు రూ.20వేల చొప్పున రూ.200 కోట్లతో లక్ష ఈ-బైక్‌లను అందుబాటులోకి తేవాలి. షాంఘై (11 లక్షల బైక్‌లు), న్యూయార్క్ (35 వేల బైక్‌లు) తరహాలో హైదరాబాద్‌లోనూ 'బైక్ షేరింగ్' వ్యవస్థను నిర్మించాలి.

❖ మెట్రో, బస్ స్టేషన్ల నుండి కాలనీలకు కనెక్టివిటీ ఇచ్చేలా ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు, ఈ-ఆటో సర్వీసులను ప్రయివేటు భాగస్వామ్యంతో విస్తరించాలి.

**బస్సుల సంఖ్య రెట్టింపు**

❖ యూనియన్ పట్టణ వ్యవహారాల శాఖ ప్రమాణాల ప్రకారం లక్షమందికి 60 బస్సులు ఉండాలి.

❖ నగరంలో ప్రతి లక్ష జనాభాకు ఉన్న బస్సుల సంఖ్య కేవలం 28. బొగోటా (130), సింగపూర్ (99), న్యూయార్క్ (85) నగరాలతో పోలిస్తే ఇది అత్యల్పం.

❖ నగరంలో ప్రజారవాణాను బలోపేతం చేయాలంటే మరో 3,200 కొత్త బస్సులను ప్రవేశపెట్టాలి.

**రూ.7 వేల కోట్లు ఇలా..**

❖ 3,200 కొత్త బస్సులు.. రూ.4,800 కోట్లు

❖ ఆధునిక ఫుట్‌పాత్‌లు.. రూ.2,000 కోట్లు

❖ లాస్ట్ మైల్ కనెక్టివిటీ కోసం ఈ-సైకిళ్లు.. రూ.200 కోట్లు

**(ఎఫ్‌డీఆర్ పరిశోధనా బృందం)**

**(పూర్తి వివరాలకు జేపీ అఫీషియల్ యూట్యూబ్ ఛానల్‌లోని రెండు ప్యానల్ చర్చల వీడియోలను చూడగలరు)**

**అతిగా సొంత వాహనాల వాడకం**

| **నగరం** | జనాభా (సుమారు) | ప్రతి **100** మందికి ప్రైవేట్ వాహనాలు | ప్రజారవాణా (%) | **టికెటింగ్ విధానం** |
|---|---|---|---|---|
| హైదరాబాద్ | 1.4 కోట్లు | 68.77 | 30 | వేర్వేరు టికెట్లు |
| లండన్ | 90 లక్షలు | 28.89 | 63 | ఆయిస్టర్ కార్డ్ |
| న్యూయార్క్ | 85 లక్షలు | 26 | 62 | ఓమ్నీ కంటాక్ట్‌లెస్ |
| షాంఘై | 2.5 కోట్లు | 18 | 67 | పీటీసీ |
| సింగపూర్ | 61 లక్షలు | 11 | 66 | ఈజీ-లింక్ కార్డ్ |

(ఎఫ్‌డీఆర్ పరిశోధనా బృందం)





➩ జేపీ గారి స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చాను. విదేశాల్లో వ్యవస్థలు, చట్టాలు బలంగా ఉంటాయి, నాయకులంతా ప్రజాప్రయోజనాలకు సంబంధించిన విధానాలపై ఒకతాటి మీద ఉంటారు. అందువల్ల మనవాళ్లే అక్కడికెళ్తే, నిబంధనలు కచ్చితంగా పాటిస్తారు. ప్రజలు నీళ్లలాంటివారు. ఏ సీసాలో పోస్తే, ఆ రూపంలో కనిపిస్తారు. వారిని నిందించకుండా నాయకులు మార్గం చూపాలి. నాయకులే రాంగ్ రూట్‌లో కాన్వాయ్‌లతో వెళ్తుంటే, రోడ్లను విస్తరిస్తూ స్థలాల్ని కాపాడుతున్న 'హైడ్రా'లాంటి వ్యవస్థలను విమర్శిస్తుంటే ప్రజలకు ఏం చెబుతాం? కాక్రోచ్ పార్టీకి, అందుకు కారణమైన సీజేఐకి థ్యాంక్స్. మా కడుపులో ఉన్నదంతా కక్కేశాం. తెలివైనవారిని చుట్టూ ఏర్పాటు చేసుకుని, మొండిగా పరిష్కారాలు అమలు చేసే నాయకులు కావాలి. ఎటువంటి ట్రాఫిక్, మౌలిక సదుపాయాల సమస్యలు లేకుండా ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నాం. ఆర్టీసీకి ఎలక్ట్రిక్ బస్సులను సమకూరుస్తున్నాం. మనలో మనం అర్థంలేని విమర్శలతో కాలయాపన చేయకుండా, హైదరాబాద్‌ను గర్వించదగ్గ నగరంగా కలసి నిర్మిద్దాం. భావి తరాలకు అగ్నిపర్వతంలాంటి నగరాన్ని కాకుండా.. ఉద్యానవనంలాంటి హైదరాబాద్‌ని అందిద్దాం.

**– సామ రామ్మోహన్‌రెడ్డి,**
**టీపీసీసీ మీడియా, కమ్యూనికేషన్ విభాగం చైర్మన్**

## జనబలం చందాదారులు, పాఠకులకు ముఖ్య గమనిక !

క్షేత్రస్థాయి నుండి రాష్ట్ర స్థాయి దాకా జరిగే లోక్‌సత్తా ఉద్యమ కార్యక్రమాలను సభ్యులకి చేరవేసే ఒక న్యూస్ లెటర్ గా "జనబలం" పత్రిక 29 ఏళ్ల క్రితం మొదలయింది. నలుపు తెలుపు రంగుల్లో ఒక చిన్న న్యూస్ లెటర్‌గా ప్రారంభమైన జనబలం, లోక్ సత్తా ఉద్యమంతో పాటే ఎదిగింది. న్యూస్ లెటర్ దశ నుండి లోక్‌సత్తా భావజాల వ్యాప్తికి ఒక బలమైన మాధ్యమంగా, ఒక పూర్తి స్థాయి మాసపత్రికగా రూపుదిద్దుకుంది. వేలాదిమంది కార్యకర్తలకు కార్యాచరణలో కరదీపికగా మార్గదర్శనం చేసింది. ఒకానొక దశలో చందాదారుల సంఖ్య 35వేలు దాటింది. లోక్ సత్తా సభ్యులే కాకుండా, సమాజహితం కోరే ఎంతోమంది "జనబలం" ను ఆదరించారు. కొన్నాళ్ళ పాటు చందాదారులకే కాక, బహిరంగ మార్కెట్ లోను జనబలం పత్రిక పంపిణీ జరిగింది. లోక్ సత్తా కార్యకర్తలే కాకుండా మరెంతో మంది రచయితలు, కార్టూనిస్ట్ లు జనబలం ద్వారా ప్రజల్లో రాజ్యాంగం పట్ల, చట్టాల పట్ల అవగాహన పెంచే ప్రయత్నం చేసారు. లోక్ సత్తా ఉద్యమం ప్రారంభమై 2026 ఆగస్టుకు ముప్పై ఏళ్ళు పూర్తి అవుతున్నది.

ఇప్పుడు కాలం మారుతోంది. డిజిటల్ మీడియా యుగం నడుస్తోంది. పెద్ద పెద్ద దిన పత్రికలు కూడా వెబ్ ఎడిషన్స్ పైనే దృష్టి పెడుతున్నాయి. PDF కాపీలు మాత్రమే వాట్సాప్ ద్వారా పంపిణీ చేసే పత్రికలు కూడా ప్రజల ఆదరణ పొందుతున్నాయి. పాఠకులకు కూడా ఈ డిజిటల్ పత్రికలు చాలా సౌకర్యవంతంగా ఉన్నాయి. సమయం చిక్కినప్పుడు మొబైల్ ఫోన్‌లో చదువుకోవడానికి, మిత్రులతో షేర్ చేసుకోవడానికి ఇవి అనువుగా ఉన్నాయి. మరోవైపు పత్రిక ముద్రణ, పంపిణీ కూడా కష్టంగా మారుతోంది. అంతే కాకుండా ఇటీవల యూట్యూబ్ ద్వారా సమకాలీన పరిణామాలపై, లోక్ సత్తా అజెండాపై డా.జయప్రకాష్ నారాయణ్‌గారి వీడియో సందేశాలను, ప్రసంగాలను, ఇంటర్వ్యూలను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేస్తున్న సంగతి కూడా లోక్ సత్తా మిత్రులు గమనించే ఉంటారు.

ఈ నేపథ్యంలో పత్రికా సంపాదకవర్గం, లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్ గారితో సంప్రదించి, ఒక కీలక నిర్ణయం తీసుకుంది. జూన్, జూలై, ఆగస్టు నెలలు మాత్రమే పత్రిక ముద్రించిన కాపీలు పోస్ట్ ద్వారా పంపిణీ అవుతాయి. సెప్టెంబర్ 2026 సంచిక నుంచి ఆన్‌లైన్ ఎడిషన్(పీడీఎఫ్) అందుబాటులో ఉంటుంది. ప్రతీనెలా జనబలం పీడీఎఫ్ కాపీ పంపేందుకు జనబలం చందాదారులు మీ వాట్సాప్ నెంబర్, మెయిల్ ఐడీ వివరాలు లోక్‌సత్తా కార్యాలయ వాట్సాప్ నెంబర్ **9866074025** కు పంపగలరు. చందాదారులు, పాఠకులు ఈ మార్పును గమనించి ఎప్పటి మాదిరిగానే సహకరించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాము.

ఇట్లు
జనబలం సంపాదకవర్గం

# పదేళ్లలో రాష్ట్రాల ఆర్థిక స్థితిగతులు

**2015-16 నుండి 2024-25 ఆర్థిక సంవత్సరం వరకు వివిధ రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థల సరళిపై కాగ్ (కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్) ఇటీవల ఒక నివేదిక విడుదల చేసింది.**

**గత దశాబ్దకాలంలో, రాష్ట్రాల సగటు వ్యయం రూ.22.18 లక్షల కోట్ల నుండి రూ.51.20 లక్షల కోట్లకు పెరిగింది. అంటే, 131% పెరుగుదల. ఈ ఆర్థికాభివృద్ధితోపాటే.. సంక్షేమం వ్యయం కూడా భారీగా పెరిగింది.**

**'స్టేట్ ఫైనాన్సెస్' పేరుతో విడుదల చేసిన ఈ నివేదికలోని కొన్ని వ్యవస్థీకృత తీరుతెన్నులు:**

★ రోజువారీ తప్పనిసరి ఖర్చులు పెరిగాయి. మొత్తం బడ్జెట్‌లలో ఈ రెవెన్యూ వ్యయం 83% దాకా సగటున ఉంది. మిగతా కొద్ది డబ్బు నుండే మౌలిక వసతులు, వాణిజ్యానికి ప్రోత్సాహం వంటి ప్రభుత్వం చేయాల్సిన కీలక పనులకు, భవిష్యత్ అవసరాలకు కేటాయింపులు చేశారు. దాదాపు ప్రతి రాష్ట్రం పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రయత్నం చేసినా.. రోజువారీ ఖర్చుల్లో భాగంగా తాత్కాలిక ఉపశమనాలు (ఉచితాలు) ఎక్కువవటంతో, చాలా రాష్ట్రాల్లో సంక్షేమం-అభివృద్ధి మధ్య సమతూకం దెబ్బతింది.

★ బడ్జెట్‌లు జీడీపీ శాతంతో సమాన స్థాయిలో పెరుగుతున్నాయిగానీ, వ్యయం తీరులో మారుతున్న పరిస్థితులకనుగుణంగా వినూత్నత కొరవడింది. జీతాలు, పెన్షన్లు, వడ్డీ చెల్లింపులు, సబ్సిడీలే ఎక్కువ ఆదాయాల్ని మింగేశాయి.

★ రాష్ట్రాల స్థాయిలో అప్పు రూ.75.52 లక్షల కోట్లకు (జీఎస్‌డీపీలో 23.27%) పెరిగింది. ద్రవ్యలోటు నిబంధన (ఎఫ్ఆర్‌బీఎం చట్టం) 3% పరిధిని 28లో 18 రాష్ట్రాలు తరచూ ఉల్లంఘించాయి. ఇది దశాబ్దం రెండో దశలో ఎక్కువగా చోటుచేసుకుంది. ప్రభుత్వం బడ్జెట్‌లో చూపని రుణాలను కూడా లెక్కేస్తే.. అప్పులు రూ.90.51 లక్షల కోట్ల (జీఎస్‌డీపీలో 27.89%) మేర ఉంటాయి.

★ రాష్ట్రాల సొంత పన్నుల ఆదాయం (ఎస్ఓటీఆర్) గణనీయంగా పెరిగింది. మొత్తం రెవెన్యూ వసూళ్లలో ఈ ఆదాయం 50% దాకా ఉంది. ప్రధానంగా జీఎస్టీ ఇందుకు దోహదపడింది.

★ సంక్షేమంలో కొంత మెరుగైన విధంగా విద్య, ఆరోగ్యం వంటి మెరిట్ సబ్సిడీలకూ కేటాయింపులు పెంచారు (అయితే, వాటి వ్యయం తీరు సక్రమంగా లేకపోవటం వల్ల ఆ కీలక రంగాలు ఆశించిన ఫలితాలనివ్వటంలేదనే విమర్శలున్నాయి).

**చిన్న రాష్ట్రాల ఖర్చులో 25 శాతానికిపైగా ఉద్యోగుల జీతాలకే**

దేశంలోని చిన్న రాష్ట్రాలు ఏటా చేసే ఖర్చులో నాలుగో వంతు ఉద్యోగుల జీతాలకే సరిపోతోంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో నాగాలాండ్, మణిపుర్, హిమాచల్‌ప్రదేశ్, సిక్కిం, త్రిపుర, మిజోరం రాష్ట్రాలు తమ మొత్తం బడ్జెట్‌లో 25 శాతానికిపైగా ప్రభుత్వోద్యోగుల జీతాలకే వెచ్చించాయి. అత్యధికంగా నాగాలాండ్ మొత్తం బడ్జెట్‌లో 37 శాతం వేతనాలకు ఖర్చు చేసింది.

**ఏ రాష్ట్రంలో వేతనాల శాతం ఎంత**

2024-25లో వేతనాలకు తెలంగాణ మొత్తం బడ్జెట్‌లో 14.19 శాతం ఖర్చు చేస్తోంది. ఏపీ (16.96%), కేరళం (22.96%) కూడా గణనీయంగానే ఖర్చు చేస్తున్నాయి. కర్ణాటక (6.59%), మహారాష్ట్ర (8.51%) మాత్రం తక్కువ నిధులు వెచ్చిస్తున్నాయి.

★ వేతనాలకే కాక ఉద్యోగుల పదవీ విరమణ ప్రయోజనాల కోసం కూడా చిన్న రాష్ట్రాలే ఎక్కువ ఖర్చు చేస్తున్నాయి. దేశంలో అత్యధికంగా తన ఏడాది బడ్జెట్‌లో పింఛన్లకు హిమాచల్‌ప్రదేశ్ 19.63% ఖర్చు చేస్తుండగా.. అత్యల్పంగా ఛత్తీస్‌గఢ్ 5.84 శాతం మాత్రమే ఖర్చు పెడుతోంది. దక్షిణాదిన కేరళం అగ్రస్థానంలో నిలిచింది. ఈ రాష్ట్రంలో పెన్షన్ల కోసం 16.04 శాతం ఖర్చు చేస్తుండగా, తెలంగాణ 7.77 శాతం ఖర్చు చేస్తోంది.

★ అప్పులకు వడ్డీలు చెల్లించేందుకు ఎక్కువగా ఖర్చు చేస్తున్న రాష్ట్రాల్లో 19%తో పంజాబ్ దేశంలో మొదటి స్థానంలో నిలిచింది. అత్యల్పంగా ఒడిశా 2.52 శాతం మాత్రమే చెల్లిస్తోంది.

★ ఆహారం, విద్యుత్, ఇతర సబ్సిడీల కింద దేశంలోనే ఎక్కువగా ఖర్చు పెడుతున్న రాష్ట్రంగా కర్ణాటక నిలిచింది. ఈ రాష్ట్రంలో 14 శాతం నిధులు సబ్సిడీల కోసమే ఖర్చు చేస్తున్నారు. దేశంలోనే అత్యల్పంగా మొత్తం బడ్జెట్‌లో 0.02% మాత్రమే అరుణాచల్‌ప్రదేశ్‌లో సబ్సిడీల కింద ఖర్చువుతోంది. కేరళంలో ఇది 1.07%.

**తెలంగాణ**



తెలంగాణపై ఉన్న మొత్తం రుణభారం 2024-25 నాటికి రూ.6,89,021 కోట్లు. ప్రభుత్వేతర రుణాలకు అత్యధిక గ్యారంటీలు ఇచ్చిన రాష్ట్రాల్లో మొదటిస్థానంలో నిలిచింది. అత్యధిక అప్పుల భారం పెరిగిన రాష్ట్రాల్లోనూ తొలి స్థానాన్ని ఆక్రమించింది. రాష్ట్ర అప్పులు ఏటా పెరిగిపోతున్నాయి. పదేళ్లలో నాలుగేళ్లపాటు రెవెన్యూలోటులోకి జారిపోయింది. ప్రతి సంవత్సరమూ ఆర్థికలోటు కొనసాగింది.

★ పదేళ్లలో అన్ని రాష్ట్రాల పబ్లిక్ అకౌంట్ బకాయిలు (రాష్ట్ర ప్రావిడెంట్ ఫండ్స్‌కు వచ్చే సొమ్ము, చిన్న మొత్తాల పొదుపు వసూళ్ల వంటివి) సగటున 106% పెరగ్గా, తెలంగాణ లయబిలిటీ మాత్రం 826% పెరిగింది. ఇది దేశంలోనే అత్యధికం.

★ 2015-16 నుండి 2024-25 మధ్యకాలంలో దేశంలోని అన్ని రాష్ట్రాల అంతర్గత అప్పు 205% పెరగ్గా, తెలంగాణ అప్పు మాత్రం 352% పెరిగింది. అత్యధికంగా అంతర్గత అప్పు పెరిగిన రాష్ట్రాల్లో అసోం (415%), అరుణాచల్‌ప్రదేశ్ ( 389%), ఛత్తీస్‌గఢ్ ( 361%) తర్వాతి స్థానంలో తెలంగాణ నిలిచింది.

★ 2024-25 నాటికి తెలంగాణ మొత్తం అప్పులు జీఎస్‌డీపీలో 27.27 శాతానికి చేరాయి. రెవెన్యూలోటు -0.57%, ఆర్థిక లోటు -2.98% మేర నమోదైంది.

★ 2024-25లో యూనియన్ పన్నుల్లో వాటాకు ముందు రూ.27,376 కోట్లు, వాటా తర్వాత రూ.47,063 కోట్ల రెవెన్యూ మిగులు ఉంటుందని 15వ ఆర్థిక సంఘం అంచనా వేసింది. కానీ రూ.9,420 కోట్ల రెవెన్యూ లోటు ఏర్పడింది.

★ ప్రభుత్వ రంగ సంస్థలు, ఎస్‌పీవీలు తీసుకున్న రుణాలకు ప్రభుత్వం ఇచ్చిన గ్యారంటీలు జీఎస్‌డీపీలో 14.72% (రూ.2,41,528 కోట్లు) మేర ఉన్నాయి. ఇది దేశంలోనే అత్యధికం. జీడీపీలో 10 శాతానికి మించి గ్యారంటీలు ఇచ్చిన ఏకైక రాష్ట్రంగా తెలంగాణ గుర్తింపు పొందింది.

★ 2025 మార్చి 31 నాటికి రాష్ట్ర జీఎస్‌డీపీ రూ.16,40,901 కోట్లు ఉండగా, పబ్లిక్ డెట్ రూ.3,91,881 కోట్లుగా ఉంది.

★ 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 16 రాష్ట్రాలు కలిపి చేబదుళ్లు, ఓవర్ డ్రాఫ్ట్ కింద రూ.6.87 లక్షల కోట్లు ఉపయోగించుకోగా, అందులో రూ.1,29,376 కోట్లు తీసుకొని తెలంగాణ రెండో స్థానంలో నిలిచింది. 2015-16 నుండి 2024-25 మధ్య పదేళ్లకాలంలో ప్రతి సంవత్సరమూ వేస్ అండ్ మీన్స్ ఉపయోగించుకున్న 9 రాష్ట్రాల్లో తెలంగాణ కూడా ఉంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 365 రోజులు వేస్ అండ్ మీన్స్/ఓవర్ డ్రాఫ్ట్ ఉపయోగించుకుని పంజాబ్ తొలిస్థానంలో ఉండగా, తెలంగాణ 363 రోజుల పాటు ఉపయోగించి తదుపరి స్థానంలో ఉంది.

★ 2024-25లో తెలంగాణకు రూ.9,420 కోట్ల రెవెన్యూ లోటు ఏర్పడింది. ఆ ఏడాది రూ.1886 కోట్ల రెవెన్యూ మూలధన వ్యయంగా, రూ.110 కోట్ల మూలధన వ్యయాన్ని రెవెన్యూ వ్యయంగా తప్పుగా చూపింది.

★ 2024-25లో ఎక్సయిజ్ ద్వారా అత్యధిక ఆదాయం పొందిన రాష్ట్రాల్లో తెలంగాణ (రూ.18,604 కోట్లు) ఆరో స్థానాన్ని ఆక్రమించింది. గత పదేళ్లలో అన్ని రాష్ట్రాల మద్యం ఆదాయం 173% పెరగ్గా, తెలంగాణ ఆదాయం 388% పెరిగింది. ఇది దేశంలో అత్యధికం.

★ దేశంలో 12 రాష్ట్రాలు పెన్షన్ వ్యయం కంటే వడ్డీ చెల్లింపుల కోసం అధికంగా ఖర్చు చేస్తున్నాయి. ఇందులో తెలంగాణ కూడా ఉంది. మొత్తం బడ్జెట్ వ్యయంలో వడ్డీ చెల్లింపుల కోసం ఈ రాష్ట్రాలు చేసే ఖర్చు 10 శాతానికి మించి ఉంటోంది. ఇది ఆ రాష్ట్రాల అప్పుల భారానికి సూచిక. 2024-25లో ఆస్తుల సృష్టి కోసం తెలంగాణ ప్రభుత్వం ఏమీ ఖర్చు చేయలేదు.

★ మిషనరీ అండ్ ఎక్విప్‌మెంట్ కోసం అన్ని రాష్ట్రాలూ కలిపి రూ.16,349 కోట్లు ఖర్చు చేస్తే, ఇందులో తెలంగాణ వాటా కేవలం రూ.300 కోట్ల లోపే ఉంది.

★ గత దశాబ్దకాలంలో యూనియన్ ప్రభుత్వం నుండి రాష్ట్రాలకు వచ్చే రుణాలు, అడ్వాన్స్‌లు 371% పెరగ్గా, తెలంగాణకు మాత్రం కేవలం 62% పెరిగాయి. ఈ

విషయంలో రాష్ట్రం చిట్టచివరన నిలిచింది.

★ 2024-25 ఆర్థిక సంవత్సరంలో వేస్ అండ్ మీన్స్, ఓవర్ డ్రాఫ్ట్, మార్కెట్ రుణాలు రూ. 1,89,071 కోట్లు తీసుకోగా, అందులో పాత బకాయిల చెల్లింపుల కోసం రూ. 1,42,701 కోట్లు పోయింది. ప్రభుత్వానికి రూ. 46,370 కోట్లు మాత్రమే చేతికొచ్చింది. రెవెన్యూలోటు (రూ. 9,420 కోట్లు) సర్దుబాటు చేయగా నికరంగా మిగిలింది రూ. 36,950 కోట్లు మాత్రమే.

సానుకూలాంశాలు

★ 2024-25లో రాష్ట్ర రెవెన్యూ వ్యయంలో 90-100% వరకు రెవెన్యూ వసూళ్ల రూపంలో పొందుతున్న ఏడు రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి + మొత్తం ఆదాయంలో సొంత పన్ను, పన్నేతర ఆదాయం కలిపి 70 శాతానికిపైగా ఉన్న 8 రాష్ట్రాల్లో తెలంగాణ రెండో స్థానంలో నిలిచింది. ఈ రెండు మార్గాల ద్వారా రాష్ట్రానికి 79.16% ఆదాయం వచ్చింది.

★ 2024-25లో తెలంగాణ మొత్తం ఆదాయం రూ. 1,67,804 కోట్లు కాగా, అందులో పన్ను ఆదాయం రూ. 1,09,233 కోట్లు (65.10%). పన్నేతర ఆదాయం రూ. 23,608 కోట్లు (14.07%). 60 శాతానికి మించి సొంత పన్ను ఆదాయం పొందిన రాష్ట్రాల్లో తెలంగాణ 4వ స్థానంలో నిలిచింది + సేల్స్, ట్రేడ్ ట్యాక్స్‌ల ద్వారా తెలంగాణ 2024-25లో రూ. 31,816 కోట్ల ఆదాయం సాధించి దేశంలో 5వ స్థానంలో నిలిచింది + గత ఆరేళ్లలో రాష్ట్ర సొంత పన్ను ఆదాయ వృద్ధి సగటున 8.91% మేర పెరిగింది. జీఎస్‌టీ ముందునాటితో పోలిస్తే జీఎస్‌టీ అమల్లోకి వచ్చిన తర్వాత 9 రాష్ట్రాల ఆదాయం పెరిగింది. ఇందులో తెలంగాణ 8వ స్థానంలో ఉంది + ఖనిజ రాయల్టీ కింద తెలంగాణకు రూ. 5,402 కోట్లు దక్కాయి మొత్తం పన్నేతర ఆదాయంలో దీని వాటా 23%. దీనికితోడు భూములు, ఆస్తుల అమ్మకం ద్వారా రూ. 16,772 కోట్ల ఆదాయం దక్కింది. ఇది మొత్తం పన్నేతర ఆదాయంలో 71%

★ షేర్లు, ఈక్విటీలు, సెక్యూరిటీల్లో పెట్టుబడులు, ఫిక్స్‌డ్, టర్మ్ డిపాజిట్లలో అత్యధిక మొత్తం పెట్టుబడులు పెట్టిన రాష్ట్రాల్లో తెలంగాణ (రూ. 18,610 కోట్లు) రెండో స్థానంలో నిలిచింది.

**ఆంధ్రప్రదేశ్**

పదవీవిరమణ చేసిన ఉద్యోగులు, చట్టసభ సభ్యుల పెన్షన్లు, ఇతర పదవీ విరమణ ప్రయోజనాల రూపంలోనే ఏపీ ప్రతి ఏటా మొత్తం ఖర్చులో 10-15% మధ్య వెచ్చించాల్సి వస్తోంది. మరోవంక, పింఛన్ల కోసం ఖర్చు పెడుతున్న మొత్తం కన్నా అప్పులపై వడ్డీలకే ఎక్కువ ఖర్చు చేస్తున్న 12




రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటి.

★ 2924-25 ఆర్థిక సంవత్సరంలో సాధారణ, జీతాల ఖర్చుల కోసం మొత్తం ఖర్చులో 32-42% ఖర్చుచేసిన అయిదు రాష్ట్రాల్లో ఏపీ ఒకటి.

★ గత పదేళ్లలో దేశంలోని అన్ని రాష్ట్రాలలో మూలధన వ్యయం సగటున 294% పెరిగింది. ఏపీలో గ్రాంట్ ఇన్ ఎయిడ్ ఆధారంగా ఆస్తులు సృష్టించే హెడ్ ఆఫ్ అకౌంట్ ఏర్పాటు చేయలేదు. యంత్రపరికరాల కోసం 2024-25లో ఏపీ రూ. 300 కోట్ల లోపే ఖర్చు చేసింది.

★ అప్పులు చేసిన డబ్బు ఆస్తులు సృష్టించటానికి ఉపయోగిస్తే, అది ఆర్థిక వ్యవస్థకు ఉపకరిస్తుందనేది మౌలిక సూత్రం. ఏపీలో 2024-25లో నికర ప్రజారుణంలో 27% మూలధన వ్యయంగా ఖర్చు చేశారు.

★ అనేక రాష్ట్రాలు రెవెన్యూ లోటును సర్దుబాటు చేసుకోవటానికి నికర ప్రజారుణాన్ని వినియోగించుకుంటున్నాయి. నికర ప్రజారుణంలో రెవెన్యూలోటు ఏపీలో 77%గా ఉంది.

★ ప్రజారుణం సహా మొత్తం రాష్ట్ర రుణాలు స్థూల ఉత్పత్తిలో 32.8% దాటకూడదని 15వ ఆర్థిక సంఘం నిర్దేశించింది. 2024-25లో ఈ పరిమితిని దేశంలోని 13 రాష్ట్రాలు దాటేశాయి. వాటిలో ఆంధ్రప్రదేశ్ కూడా ఉంది. రాష్ట్ర రుణం జీఎస్‌డీపీలో 35.69%కి చేరింది.

చేబదుళ్లలో ఏపీ మూడో స్థానం

★ 2024-25లో దేశంలోని 16 రాష్ట్రాలు చేబదుళ్లు, ఓవర్ డ్రాఫ్ట్ సౌలభ్యం కింద రూ. 6.87 లక్షల కోట్లు ఆర్‌బీఐ నుండి వినియోగించుకోగా.. అందులో 62% ఉపయోగించుకున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ మూడో స్థానంలో ఉంది. ఏపీ 357 రోజులపాటు చేబదుళ్ల రూపంలో అప్పు తీసుకుంది. వీటికి వడ్డీ చెల్లించాలి.

★ 2024-25లో ఏపీ చేబదుళ్ల రూపంలో రూ. 1,72,532 కోట్లు తీసుకుంది.

★ గత పదేళ్లలో ప్రతి ఆర్థిక సంవత్సరంలోనూ చేబదుళ్లు తీసుకున్న 9 రాష్ట్రాల్లో ఏపీ ఉంది. ★

# కార్పొరేట్ ఆస్పత్రుల్లోనూ 'ప్రాథమిక వైద్యానికి' పెద్దపీట..

## -ప్రభుత్వాలు ఆలోచించాల్సిన డాక్టర్ దేవీ ప్రసాద్ షెట్టి 'నారాయణ హెల్త్' నమూనా-

రైజింగ్ తెలంగాణ 2047 లక్ష్యమైన 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ నిర్మాణానికి ఆరోగ్య రంగం అత్యంత కీలకమైనదని ప్రభుత్వం 2026-27 వార్షిక బడ్జెట్ సందర్భంగా పేర్కొంది. ఈ రంగం మీద ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. బహుశా రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈసారి అత్యధికంగా ఈ వైద్య ఆరోగ్య విభాగానికి కేటాయించారు. తెలంగాణ రూ.13,679 కోట్లు కేటాయించగా, ఆంధ్రప్రదేశ్ పాలకులు రూ.19,306 కోట్లు ప్రతిపాదించారు. తెలంగాణ ప్రభుత్వం 'రాజీవ్ ఆరోగ్యశ్రీ' పథకం కింద రేషన్ కార్డుదారులకి వర్తింప చేసే మొత్తాన్ని రూ.5 లక్షల నుండి 10 లక్షలకు పెంచారు. ఆంధ్రప్రదేశ్ సర్కారు రూ.2.5 లక్షల కనీస ఆరోగ్య కవరేజీని రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ ఉచితంగా అందిస్తున్నట్లు, పేదలకు గరిష్టంగా రూ.25 లక్షల దాకా ఇస్తున్నట్లు ప్రకటించింది. ఏపీలో ఈ పథకానికి ఎన్.టి.ఆర్ వైద్యసేవ అని పేరు పెట్టి, రూ.4,000 కోట్లు కేటాయించారు. ఇది ఆరోగ్యశ్రీ, ప్రభుత్వ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇన్సూరెన్స్ ఆధారితంగా నడిచే పథకం. రెండు రాష్ట్రాలూ జాతీయ స్థాయిలోని 'ఆయుష్మాన్ భారత్' స్కీమ్‌తో అనుసంధానమై ఈ కేటాయింపులు చేశాయి. దీంతోపాటు.. తెలంగాణ డిజిటల్ ఆరోగ్య ప్రొఫైళ్లను రూపొందిస్తుండగా, ఏపీ ప్రొఫైళ్లతోపాటు వైద్యసేవలకు ఏఐ డాక్టర్-సంజీవని పథకాన్ని ప్రారంభించింది.

అదేవిధంగా రెండు రాష్ట్రాలూ అధిక రక్తపోటు, గుండెజబ్బులు, డయాబెటిస్, ఫ్యాటీ లివర్, క్యాన్సర్ తదితర జీవనశైలి వ్యాధుల కోసం సర్వేలను నిర్వహిస్తున్నాయి. ప్రాథమిక స్థాయి ఆరోగ్యానికి తీసుకుంటున్న చర్యలు ఇంతవరకే పరిమితం. రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఎన్.టి.ఆర్ వైద్య సేవ రెండూ ప్రధానంగా ఆస్పత్రి సేవలకు సంబంధించినవి. అదే విధంగా ఆయుష్మాన్ భారత్. అంటే, రోగం పెరిగాక, ప్రాథమిక వైద్యం వల్ల కాక పైన ఆస్పత్రి సేవలకు పంపేవి. ఇక్కడ ఆపరేషన్లు సర్వసాధారణం. ఎక్కువశాతం మంది బతకగలిగినా.. పూర్తి ఆరోగ్యం, ఉత్పాదక శక్తి సాధ్యంకాక పోవచ్చు. ఆరోగ్యమే మహాభాగ్యము అనే సామెతకు దీటైనది.. చికిత్స కన్నా నివారణ ముఖ్యం అనే నియమం. ప్రపంచంలో ఆరోగ్య రంగంలో అత్యుత్తమ ర్యాంకుల్లో ఉన్న దేశాలన్నీ, వాటి కంటే ఎక్కువ ఖర్చు పెట్టే దేశాల కన్నా కూడా మెరుగైన వైద్య ఆరోగ్య సేవలు అందించటానికి పాటించే ప్రధాన సూత్రం - ప్రాథమిక ఆరోగ్యానికి పెద్దపీట వేయటం.

**30 ఏళ్ల ఆరోగ్యశ్రీతో ప్రజల ఆరోగ్యం ఎంత మెరుగుపడింది?**

తెలంగాణలో వృద్ధుల ఆరోగ్య సేవల విభాగం (జెరియాట్రిక్స్), మూత్రపిండాల వ్యాధులతో బాధపడు తున్నవారి కోసం డయాలసిస్ కేంద్రాలు, క్యాన్సర్ రోగుల కోసం డేకేర్ కేంద్రాలు వంటి వాటి మీద దృష్టి పెట్టారు. సంతోషం. అవి అవసరం కూడా. కానీ ఇవి మనుషుల్ని బతికించగలవు తప్ప, అందుకోసమయ్యే ఖర్చును భరించే సమాజానికి మేలు చేయలేవు. ఏ పేరు పెట్టినా.. ఆరోగ్యశ్రీ వల్ల ప్రజలందరికీ ఆరోగ్యం అందే అవకాశముంటే.. గత ముప్పై ఏళ్లలో అది పూర్తిగా సాధ్యమై ఉండేది. ఇంకా ఇంకా రోగాలు పెరిగిపోయే పరిస్థితి ఉండేది కాదు. యువతకూ ఆరోగ్య సమస్యలు పెరిగేవి కావు. కాబట్టి, ప్రపంచ దేశాల అనుభవాలు, మన దేశంలో ఆరోగ్యశ్రీ ట్రాక్ రికార్డు, సమాజంలో నెలకొన్న పరిస్థితులు.. వీటన్నిటినీ బేరీజు వేశాక - ప్రాథమిక వైద్యాన్ని పట్టించుకోకుండా ఆస్పత్రి వైద్యానికి ఎంత కేటాయించినా ఉపశమనం తప్ప ఫలితం పెద్దగా ఉండదని రుజువవుతోంది.

దీనికి ఇన్సూరెన్స్ కూడా తోడైతే, నానాటికీ పెరిగే ఆస్పత్రి ఖర్చు ఇంకా పెరుగుతుంది. చివరికి ఖజానాలో అత్యధిక భాగం అనారోగ్యం మధ్య అధికకాలం బతికే జనాభా కోసం వెచ్చించినట్లవుతుంది. ఇలాంటి జనాభా వల్ల ఉత్పాదకత ప్రమాణాలు ఎలా ఉంటాయో ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. ఈ నేపథ్యంలో 'నారాయణ హెల్త్' (హృదయాలయ) ఆస్పత్రి వ్యవస్థాపకులు డాక్టర్ దేవీ ప్రసాద్ షెట్టి ఒక నమూనాను అమలుచేస్తున్నారు.డాక్టర్ షెట్టి ప్రతిపాదనలోనూ ఇన్సూరెన్స్ ఉంటుందిగానీ.. వ్యాధి నివారణ, ప్రాథమిక దశలోనే నియంత్రణకి అత్యధిక ప్రాధాన్యత వచ్చేలా రూపకల్పన ఉంటుంది.

దేవీ షెట్టి, విశ్వేశ్వర రెడ్డి వాదన ఏమిటంటే - 'ప్రస్తుతం ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య సంరక్షణలో ప్రధానంగా ముగ్గురు స్టేక్ హోల్డర్లు ఉంటారు. ఒకటి ఆస్పత్రి, రెండు ఇన్సూరెన్స్ సంస్థ, మూడు రోగి. ఈ ముగ్గురికీ ఒకరి మీద ఒకరికి నమ్మకం ఉండదు. ఆస్పత్రి వారు లాభాల కోసం చూస్తారు. ఇన్సూరెన్స్ సంస్థ డబ్బు చెల్లించకుండా సాధ్యమైనంత తక్కువ మొత్తం భర్తీ చేసేందుకు లేదా ఎగ్గొట్టేందుకు ప్రయత్నిస్తుంది. రోగులు ఇన్సూరెన్స్‌కి తగ్గట్లు డబ్బు ఖర్చు చేయించటానికి ప్రయత్నిస్తూనే, ఆస్పత్రివాళ్లు దోపిడీ చేస్తున్నారని భావిస్తారు. దీనివల్ల ఆరోగ్యం ఉన్నకొద్దీ ఖరీదవటంతోపాటు.. డబ్బు ఖర్చు పెట్టినా సరైన చికిత్స అందుతుందన్న గ్యారంటీ లేదు. ఈ అపనమ్మకం చివరికి వైద్య విధాన లక్ష్యమైన ప్రజలకు నాణ్యమైన ఆరోగ్యాన్నే దెబ్బతీస్తోంది. ఈ నేపథ్యంలో.. ఆరోగ్య సంరక్షణ పేరుతో ప్రయివేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో అనారోగ్య దందా నడుస్తోంది. ఆస్పత్రికే గనక ఇన్సూరెన్స్ బాధ్యతల నిర్వ

హణకు లైసెన్స్ ఇస్తే.. ఖర్చు పెరగకుండా ఉండేందుకు వ్యాధి నివారణకు, ముందుగానే గుర్తించి నియం త్రించేం దుకు ప్రయత్నిస్తుంది. రోగికీ పెద్ద ఖర్చు లేకుండా ఉత్పాదక శక్తిని పెంచగలిగే, జీవితాన్ని కుటుంబసభ్యులతో ఆస్వాదిం చగలిగే, సమాజానికి కొంత మేలు చేయగలిగే మంచి ఆరోగ్యం సమకూరుతుంది. ఆరోగ్య భారతం సాధ్య మవుతుంది'.

ఇటీవల రిపబ్లిక్ టీవీ 'లెజెండ్' కార్యక్రమంలో ఈ అంశాల్ని డాక్టర్ షెట్టి సవివరంగా ప్రస్తావించారు. వివిధ దేశాల ఉదాహరణలను ప్రస్తావిస్తూ, ఆరోగ్య రంగంలో భారత్‌కి ఉన్న బలాల్ని ప్రస్తావించారు. ఆయనకు బ్రిటన్ సహా కొన్ని దేశాల్లో ఆస్పత్రులున్నాయి. ప్రభుత్వ ఆరోగ్య విధానం మెరుగ్గా ఉన్న దేశాల్లో ఒకటైన ఇంగ్లండ్.. ఒక రోజులో దేశమంతా మొత్తం 70 గుండె శస్త్రచికిత్సల్ని చేస్తే, ఒక్క బెంగళూరు నారాయణ హెల్త్ (హృదయాలయ) ఆస్పత్రిలోనే రోజుకి 37 ఆపరేషన్లు చేస్తారట. ప్రపంచంలోని అగ్రరాజ్యాలన్నిటిలో కలిపి ఒకరోజు చేసే కాటరాక్ట్ ఆపరేషన్ల కంటే భారత్‌లో ఎక్కువ జరుగు తాయట. అది కూడా చాలా తక్కువ ధరకి. ఒకప్పుడు రాజకీయ నాయకులు, సినీ తారలు వంటి వారు విదేశాలకు వెళ్లి చేయించు కునే ఆపరేషన్లను ఇప్పుడు భారత్‌లో పలు చోట్ల చాలా సాధా రణం. 37 ఏళ్ల క్రితం విదేశాల్లో లక్షన్నర రూపాయాలతో చేసిన గుండె ఆపరేషన్‌ని నారాయణ హృదయాలయ ఆస్పత్రిలో ఇప్పటికీ అదే రేటుకి చేయగలుగుతున్నారట. మన భారతీయ వృత్తి నిపుణుల కష్టం వల్ల ఇలాంటి అద్భుతాలు సాధ్యమవుతున్నాయని ఆయన తెలిపారు.

రోజుకి తొమ్మిది గంటలపాటు నిలబడి కొన్ని వారాల పసి బిడ్డలకు చేసే గుండె ఆపరేషన్లు ఎంత సంక్లిష్టమో చెప్పనక్కర్లేదు. అలాంటివి వెయ్యికి పైగా చేసిన డాక్టర్లు ప్రపంచం మొత్తం మీద ఆరేడుగురు ఉంటే, అందులో డాక్టర్ షెట్టి ఒకరు. ఇంత కష్టపడుతున్నా ఎందుకు అలసిపోకుండా పనిచేస్తున్నారు, రోగులకి నింపాదిగా సమయం ఎలా కేటాయిస్తున్నారు అనే ప్రశ్నకి ఆయన సమాధానమిస్తూ – లక్ష్యం తనను నడిపిస్తోందని తెలిపారు. మతం కన్నా స్పిరిచ్యువాలిటీ తనకు ఎక్కువ బలాన్ని స్తుందన్నారు. కింది స్థాయి నుండి ఎదిగిన భారతీయులు అలా కష్టపడగలుగుతారని కూడా తెలిపారు. ఇవన్నీ డాక్టర్ షెట్టి తెలిపిన పరిష్కారంపై మనం లోతుగా ఆలోచించాలని చెప్పటా నికి మాత్రమే పేర్కొంటున్న అర్హతలు.

**అసంఘటిత రంగ కార్మికుల కోసం..**

భారత్‌లో సుమారు 40 కోట్ల మంది అసంఘటిత కార్మికులు న్నారు. వారికి ఆదాయం తక్కువ అదీ నిలకడగా ఉండదు. సీజన్‌లో కొంత మెరుగ్గా ఉంటుంది. వీరు ఇన్సూరెన్స్ తీసు కోవటం, సకాలంలో కిస్తీలు కట్టటం, ఆరోగ్య ఖర్చు లు భరిం చటం ఊహించలేం. ఇప్పుడున్న పరిస్థితుల్ని ఇలాగే వది లేస్తే.. మనం మనిషి ప్రాణానికి ప్రైస్ ట్యాగ్ తగిలించి నట్లవుతుంది.

ఓ అగ్ర రాజ్యంలోలా మనం నెలల తరబడి డాక్టర్ అపాయింట్‌మెంట్ కోసం ఎదురుచూడనక్కర్లేదు, అక్కడి కంటే పది పదిహేను రెట్లు తక్కువ ఖర్చుతో ఆపరేషన్లు సహా సంక్లిష్ట చికిత్సల్ని పొందవచ్చు. కానీ ఆ మాత్రం ఖర్చు కూడా మన దేశంలో ఎక్కువ. ఒక సంవత్సరంలో 50 వేల రూపాయలు ఒక ఆపరేషన్ మీద ఖర్చు పెట్టి కోలుకోవటం ఓ అసంఘటిత కార్మికుడి కుటుంబానికి అసాధ్యం కాదు గానీ, ఇప్పటికీ కష్టమైన పని.. ఈ మాటలు చెబుతూ డాక్టర్ షెట్టి ఓ ఉదాహరణ ప్రస్తావించారు.

'చంటిబిడ్డను తీసుకొచ్చిన ఓ మహిళకు ఆపరేషన్ అవసరం అని చెబితే.. ఆ పిల్లాడు తట్టుకోగలడా అని కాకుండా – ఎంత ఖర్చవుతుంది అని మొదటి ప్రశ్న అడిగింది'. ''నిత్య జీవనావసరాలని డబ్బు ప్రభావం నుండి తప్పించటం భారతదేశం సాధించిన గొప్ప విజయం. మనం కొద్దిపాటి జాగ్రత్తలు పాటిస్తే, అందరికీ తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యాన్ని అందుబాటులోకి తేవచ్చు''.

ఆటలాడుతూ కుప్పకూలిపోతున్న యువకుల గురించి చెబుతూ, వాళ్లు ముందుగానే, కనీసం ఒక ఏడాది ముందైనా చెకప్ చేయిం చుకుని ఉంటే, చాలా తేలిగ్గా జబ్బు నుంచి బయటపడగలిగి ఉండేవారు అని డాక్టర్ షెట్టి తెలిపారు. ఎప్పుడెప్పుడు, ఏయే పరీక్షలు, ఎంత సులభంగా చేయించు కోవచ్చో వివరించారు. ప్రాథమిక వైద్యం ప్రభుత్వ ఆరోగ్య సంరక్షణ విధానంలో కీలకం కావాలని, అది లాభార్జనే ధ్యేయంగా పనిచేసే ఆస్పత్రుల లక్ష్యం కూడా కావాలంటే.. వారికే ఇన్సూరెన్స్ లైసెన్స్ ఇవ్వాలని తెలిపారు.

**రోజూ రూ.15 నుండి 100 వరకు చెల్లిస్తే..**
**కోటి రూపాయల వరకూ బీమా**

టీ తాగటానికి రోజుకి రూ.15, దోసె తినటానికి రూ.50, సగటు వినోద కార్యక్రమానికి వెళితే రూ.100 దాకా ఖర్చవు తాయి. ఆ మేరకు రోజూ ఒక ఆరోగ్య అకౌంట్‌కి చెల్లించగలిగితే, రూ. పది లక్షల నుండి కోటి వరకూ ఆ కుటుంబ సభ్యులకు ఆరోగ్య బీమా లభిస్తుందని డాక్టర్ షెట్టి తెలిపారు. అసంఘటిత రంగ కార్మికులకు కూడా పెద్ద కష్టం కాని పని ఇది. ప్రభుత్వం, వివిధ సంస్థలు సీఎస్ఆర్ ద్వారా ఇచ్చే నిధుల్ని (ప్రస్తుతం ఇవి ఎక్కువగా ముఖ్యమంత్రి సహాయనిధికి వెళ్తున్నాయి) కూడా ఇందులోనే జమ చేస్తారు. బీమా తీసుకున్న వారందరూ ఏ ఆరోగ్య సమస్యలేకున్నా.. ఆస్పత్రిలో అన్ని రకాల వైద్య పరీక్షలను నిర్ణీత కాలవ్యవధిలో ఉచితంగా చేయించు కోవచ్చు. ఏదైనా ఆరోగ్య సమస్య ఉంటే.. ఆ మేరకు మందులు, సూచనలు ఉచి తంగా అందిస్తారు. జీవనశైలి వ్యాధి అయితే నెలవారీ పర్య వేక్షిస్తారు. అనారోగ్యం రాకుండా.. యోగా, ధ్యానం వంటివి నేర్పించటంతోపాటు, ఎలాంటి ఆహారం తీసుకోవాలో చెబుతారు. ఎందుకంటే, రోగం ముదిరితే, ఆస్పత్రి యాజ మాన్యానికే ఖర్చు పెరిగి నష్టం కదా. ఒకవేళ వ్యాధి ఎక్కువగా ఉంటే, అప్పుడు ఆస్పత్రి సేవలను కూడా అన్ని వసతులతో అత్యాధునిక సాంకేతికతతో ఉచితంగా అందిస్తారు. విశ్వేశ్వరరెడ్డి కూడా లోక్‌సభలో ఇదే మాట చెప్పారు.

భారతదేశంలో సామాన్యులకి కూడా మంచి వైద్యాన్ని అతి తక్కువ ఖర్చుతో అందించే విధానంలో 5-7 ఏళ్లలో రాబోతోందని డాక్టర్ షెట్టి ధీమా వ్యక్తం చేశారు. ఈ అంశాల మీద ప్రభుత్వం నిపుణులతో చర్చించటం అవసరం. ఈలోగా కూడా, ప్రభుత్వం తాను అమలు చేస్తున్న విధానాలను ఆ దిశగా అమలు చేసి ఫలితాలను మెరుగుపరచవచ్చు.

ఉదాహరణకు, ఏపీ ప్రభుత్వం 2.5 నుండి 25 లక్షల వరకూ ఉచితంగా ఎన్.టి.ఆర్ వైద్య సేవ బీమాను అందిస్తోంది. ఆస్పత్రి వైద్యానికే వర్తించే ఈ కార్యక్రమానికి ఈ ఏడాది 4,000 కోట్లు కేటాయించారు. ఈ మొత్తం ప్రతి సంవత్సరం పెరుగటమే తప్ప తగ్గటం ఉండదు. ఇదే ప్రీమియం డబ్బుని ఆరోగ్య సమస్య ఏర్పడినదాకా చూడకుండా.. నిర్ణీత కాలవ్యవధిలో వైద్య పరీక్షలు చేసే విధంగా ప్రాథమిక వైద్యానికి సైతం వర్తింపచేయాలి. నివారణ, నియంత్రణ వైద్యానికే అత్యధిక ప్రాధాన్యత ఇస్తే.. ఫలితాలు మెరుగ్గా వస్తాయి. ఇందులో పౌరులు, వ్యక్తిగత వితరణశీలురు కార్పొరేట్ కంపెనీలను కూడా భాగస్వాముల్ని చేయాలి. ఆదాయాల్ని, వయసుని బట్టి పౌరుల వాటాను నిర్ణయించాలి. ఆ డబ్బుని ప్రజల్లో నేరుగా చెల్లించలేనివారి నుండి.. సంక్షేమం పేరుతో ఇస్తున్న పథకాల నుండి మిన హాయించుకోవటం లేదా కొన్ని రకాల వస్తువులు, సేవల మీద సుంకం రూపంలో సేకరించవచ్చు. వృద్ధులకి పెన్షన్ నుండి మినహాయించవచ్చు. నారాయణ హెల్త్ ఆస్పత్రుల గ్రూప్ కూడా అసంఘటిత కార్మికుల వరకే ఈ పథకం అని పేర్కొంది. అలా ఏర్పడిన ఆరోగ్య నిధికి మెరుగైన వడ్డీ కూడా లభించేలా వ్యాపార సంస్థల్లో పెట్టుబడి పెట్టవచ్చు. అంటే, ఇప్పుడున్న కంట్రిబ్యూటరీ పెన్షన్ పద్ధతిలో హెల్త్ ఇన్సూరెన్స్‌ని ఆస్పత్రి ఆధ్వర్యంలో ప్రభుత్వ పర్యవేక్షణలో నడపటం. ఏఐ సాంకేతికతను కూడా ఈ నమూనా పరిధిలోనే, వైద్యుల పర్యవేక్షణలోనే ఉపయోగించాలి.

**జాగ్రత్తలూ అవసరం**

ఆస్పత్రి వైద్యం ఖర్చు పెరిగిపోవటం, కానీ ఇన్సూరెన్స్ వల్ల వచ్చే డబ్బు పరిమితంగా ఉండటం, బీమా క్లెయిమ్ చేయని వారి ప్రీమి యం కూడా లాభసాటి కాకపోవటం పరిస్థితుల్లో.. నాసిరకం సేవలు అందించే అవకాశం ఉంది. ముఖ్యంగా డబ్బు ఆదా కోసం ఆపరేషన్ల వంటివి మొక్కుబడిగా చేస్తే అదో పెద్ద సంక్షో భం అవుతుంది. మరోవంక, అసంఘటిత రంగంలో డాక్టర్ షెట్టి అంచనా వేసినట్లు 40 కోట్ల మంది కాక, అదనంగా 14 కోట్ల మంది.. మొత్తం 54 కోట్ల మంది దాకా ఉన్నారు. ఇంతమందికి ఆ నమూనాను లోతుగా పరిశీలించకుండా అమలు చేయటం విధాన నిర్ణయం అనిపించుకోదు. అదీగాక, గతంలో అనుకున్నట్లు.. ప్రయివేటు ఆస్పత్రుల ప్రాబల్యం పెరిగి పోయి, వారు అడిగినంత డబ్బు ప్రభుత్వం చెల్లించాల్సి రావొచ్చు.

ప్రజల్లో 70 శాతానికి పైగా ఇప్పటికే ప్రయివేటు, కార్పొరేట్ ఆస్పత్రులకే వెళ్తున్నప్పుడు.. ప్రభుత్వం ప్రయివేటుని విస్మరించి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించటం సాధ్యం కాదు. కానీ అసలు ప్రభుత్వానికి ఎటువంటి సొంతబలం లేకుంటే, కీలక సమయాల్లో ప్రజల ఆరోగ్యంతో చెలగాటమవుతుంది. పరి శోధనలూ కుంటుపడతాయి. అందువల్ల, ప్రాథమిక వైద్యాన్ని,

## నివారణ, ప్రాథమిక వైద్యానికి ప్రాధాన్యతతో 'యాక్టివ్ యువ'

యువతలో జీవనశైలి వ్యాధులు పెరగటం అంటే.. నివారణ, ప్రాథమిక వైద్యం మన దేశంలో ఘోరంగా విఫలమవటానికి సంకేతమని ప్రభుత్వాలకన్నా కార్పొరేట్ ఆస్పత్రులతోపాటు.. సొంత ఆస్పత్రుల రంగంలో పెద్దగా విస్తరించని ప్రయివేటు ఇన్సూరెన్స్ సంస్థలూ బాగా గుర్తించాయి. ఆర్థిక సంస్కరణలు వచ్చినా.. గత పాతికేళ్లుగా చాలా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు అదే దుస్థితిలో కొనసాగుతున్నాయన్నది స్వల్పకాలిక జ్ఞాపకశక్తి ఉండే సోషల్ మీడియా యుగంలోనూ వారు విస్మరించలేదు. ఈ నేపథ్యంలో, ఆస్పత్రి చికిత్స దాకా వచ్చాక ఇన్సూరెన్స్ కంటే, ఆ అవసరం పెద్దగా ఉండని రీతిలో హృదయాలయ తరహాలో ఇన్సూరెన్స్ పథకాల్ని లాభసాటిగా రూపొందించటంపై దృష్టి పెట్టారు. యువత టార్గెట్ గ్రూప్‌గా అలాంటి పథకాలైతే, వారికి లాభాలొచ్చే అవకాశాలు ఎక్కువ. ఈ నేపథ్యంలో, ఆదిత్య బిర్లా గ్రూప్ కూడా అటువంటి కొన్ని పథకాల్ని ఆవిష్కరిస్తూ, ఏటా అప్‌డేట్ చేస్తోంది.

యువత ఆరోగ్య శైలిని దృష్టిలో పెట్టుకొని, ఆదిత్య బిర్లా హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీ 'యాక్టివ్ యువ' పేరుతో ఒక సరికొత్త ఆరోగ్య బీమా పాలసీని ఆవిష్కరించింది. మారుతున్న జీవనశైలికి అనుగుణంగా కేవలం వైద్య అవసరాల్లోనే కాకుండా, రోజువారీ జీవితంలో భాగమయ్యేలా ఈ ప్లాన్‌ను రూపొందించామని కంపెనీ తెలిపింది. ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించే వినియోగదారులకు హెల్త్ రిటర్న్స్ రూపంలో రివార్డులను అందించటం ఈ పాలసీ ముఖ్య ఉద్దేశం. ఈట్, మూవ్, హీల్.. అనే మూడు ప్రధాన సూత్రాల ఆధారంగా పనిచేస్తుంది. నెలలో 21 రోజులపాటు రోజూ రెండు పూటల భోజనం వివరాలను యాప్‌లో నమోదు చేస్తే, (ఈట్) 10 శాతం హెల్త్ రిటర్న్స్; నెలకు సగటున 7,500 అడుగులు నడిచినా లేదా 250 కేలరీలు ఖర్చు చేసినా (మూవ్) ప్రతి నెలా 4 బోనస్ యాక్టివ్ డేస్; 21 రోజులపాటు క్రమం తప్పకుండా 7-8 గంటలు నిద్రపోతే (హీల్) మరో 15 శాతం వరకూ హెల్త్ రిటర్న్స్‌లో అదనపు ప్రయోజనం లభిస్తుంది. రోజుకు 10 వేల అడుగులు నడవటం, వ్యాయామం ద్వారా 300 కేలరీలు ఖర్చు చేయటం ద్వారా వినియోగదారులు తమ వార్షిక ప్రీమియంలో 100 శాతం తిరిగి పొందే అవకాశాన్నీ కంపెనీ అందిస్తోంది. ఈ ప్లాన్‌లో అన్‌లిమిటెడ్ సమ్ ఇన్సూర్డ్, 11 ఏళ్లలో 11 రెట్లు పాలసీ మొత్తం పెరిగేలా యువ క్రెడిట్, డాక్టర్ సంప్రదింపులు, ఓపీడీ కవర్, ఆదాయ పరిరక్షణ లాంటివి ఉన్నాయి.

ఖరీదైన తృతీయ స్థాయి ఆస్పత్రి చికిత్సల్ని ప్రభుత్వం తన నియంత్రణలోనే కొనసాగించాలి. ఇందుకు అత్యుత్తమ మార్గం, ఇన్సూరెన్స్ పద్ధతి లేకుండా.. ప్రజలు, ప్రభుత్వం, వితరణ శీలురు, కార్పొరేట్ సంస్థల కంట్రిబ్యూషన్‌కి ఆరోగ్య నిధి ఏర్పాటు సహా మిగతా ప్రక్రియంతా డాక్టర్ షెట్టి, విశ్వేశ్వరరెడ్డి లాంటి వారు చెప్పిన నమూనాలో కొనసాగించవచ్చు. ప్రయివేటు వారు వారి ఇన్సూరెన్స్ పద్ధతిలో కొనసాగినా.. ప్రభుత్వం గ్రామాల మధ్య చిన్న పట్టణాలను (ఇప్పుడు ఏపీ ప్రభుత్వం ఉనికి లోకి తెచ్చిన రూర్బన్ పంచాయతీలనే ఆర్థిక కేంద్రాలుగా అభివృద్ధి చేయవచ్చు) పెంపొందించి, ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ సూచించినట్లు, ఫ్యామిలీ డాక్టర్‌ల బృందంతో ప్రాథమిక ఆరోగ్య సెంటర్‌ని ఏర్పాటు చేయాలి. అక్కడే వైద్య పరీక్షల ల్యాబొరేటరీ, జనరిక్ ఔషధ దుకాణం ఏర్పాటు చేయాలి. రోజువారీయో, నెలవారీయో కొద్దిమొత్తం చెల్లించే ప్రజలందరూ ఇక్కడ ఉచితంగా వైద్య సేవలను పొందవచ్చు. ఏ ఆరోగ్య సమస్యాలేకున్నా.. హృదయాలయ ఆస్పత్రి తరహాలోనే నిర్దిష్ట కాలవ్యవధిలో అన్ని రకాల వైద్య పరీక్షల్ని చేయించుకోవచ్చు. ఏ ఆరోగ్య సమస్యా లేకుంటే.. ముందు జాగ్రత్త చర్యలు; ఏమైనా సమస్య ఉంటే, నియంత్రణకి చర్యలు; మరీ పెద్ద సమస్యయితే ఆస్పత్రి చికిత్సకు ఫ్యామిలీ డాక్టరే చర్యలు తీసుకుంటారు. అంటే ఎమర్జెన్సీ మినహా ఓపీ మొత్తం ఫ్యామిలీ డాక్టర్ వరకే పరిమిత మవుతుంది. అయితే నమ్మకమున్న డాక్టర్‌ని ఎంచుకునే స్వేచ్ఛ గ్రామాల నుంచి వచ్చే లేదా ఆ వార్డులో ఉండే ప్రజలకు ఉండేలా వైద్యుల మధ్య పోటీ ఉంటుంది. ఈ ఏర్పాటుకి ఇప్పటికే మనకి ఎంబీబీఎస్ డాక్టర్లు అనేకమంది ఉన్నారు. వారికి సహాయ పడటానికి గ్రామీణ ప్రాంతాల్లో క్వాలిఫికేషన్ లేకున్నా కనీస నైపుణ్యమున్న వారు అవసరానికి మించి ఉన్నారు. కాబట్టి.. విదేశాల్లోలా అపాయింట్‌మెంట్ కోసం నెలల తరబడి వేచి ఉండనక్కర్లేదు.

ద్వితీయ స్థాయి చికిత్సలో నర్సింగ్‌హోంలను ప్రయివేటు భాగస్వామ్యంతో తీసుకోవచ్చు. ఇక్కడ ఇన్సూరెన్స్ పథకాలైన రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఎన్.టి.ఆర్ వైద్య సేవ, ఆయుష్మాన్ భారత్ వంటివి అమలు చేయవచ్చు. వ్యాధి బాగా ముదిరిన పరిస్థితుల్లో, ఎమర్జెన్సీ కేసుల్లో ఖరీదెక్కువ, ఫలితం తక్కువ ఉండే తృతీయ స్థాయి మల్టీస్పెషాలిటీ వైద్యం ప్రభుత్వం సొంతంగా వ్యవస్థీకృతంగా నిర్వహించటం మేలు. అయితే 'సేవకు తగ్గ పారితోషికం' పద్ధతిలో ప్రయివేటు, కార్పొరేటు వైద్య నిపుణుల సేవలను కొంతమేర ఉపయోగించుకోవచ్చు. దీనివల్ల నాణ్యత ఇంకా పెరిగి ప్రజలు లాభ పడతారు. ఈ రకంగా జరగాలంటే.. దశలవారీగా బోధనాస్పత్రుల్లో, ఇతరత్రా పెద్దాస్పత్రుల్లో ఆధునిక మార్పుల్ని తీసుకురావాలి. ఎంత పేరు, పరిజ్ఞానం ఉన్నా.. మారుతున్న వైద్య పద్ధతులను ఎప్పటికప్పుడు ఆసక్తితో అధ్యయనం చేసే వైద్య దిగ్గజాలను రోజుకు కొన్ని గంటలు బోధన, క్లిష్టమైన కేసుల్లో వైద్యానికి కేటాయించేలా అభ్యర్థించవచ్చు. ఇందుకోసం కొన్ని బ్లాకుల్ని అత్యాధునిక ప్రయివేటు, కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా అభివృద్ధి చేసి సంపన్నుల్ని, మెడికల్ టూరిజాన్ని ఆకట్టుకోవచ్చు. బలమైన స్థానిక ప్రభుత్వాల ద్వారా ప్రజారోగ్యం, ఫ్యామిలీ డాక్టర్‌ల వ్యవస్థ ద్వారా పటిష్ఠ ప్రాథమిక ఆరోగ్యం పునాదిగా పైస్థాయిలో కొంతమేర ప్రయివేటు, కార్పొరేట్ భాగస్వామ్యంతో, జిల్లా స్థాయి నుండి సరైన నియంత్రణా వ్యవస్థలో తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యం ప్రజలందరికీ అందించవచ్చు. క్రమంగా ప్రధానమంత్రికి అందే వైద్యాన్ని చిట్టచివరి పౌరునికి కూడా అందించవచ్చు. ఈ రంగంలో చిత్తశుద్ధితో కృషి చేస్తున్న డాక్టర్ జేపీ, డాక్టర్ షెట్టి, విశ్వేశ్వరరెడ్డి, నాగేశ్వరరెడ్డి లాంటి వారితో చర్చించి వారి సేవలను పూర్తిస్థాయిలో ఉపయోగించుకుంటేనే.. ఉపాధి ఆధారిత ఆర్థికాభివృద్ధితో కూడిన ఆరోగ్య తెలంగాణ, ఆరోగ్యాంధ్ర, ఆరోగ్య భారత్ లక్ష్యాలు నెరవేరతాయి. ★

## ప్రతి ముగ్గురిలో ఇద్దరికి ముప్పు
## -అపోలో హెల్త్ ఆఫ్ ది నేషన్ 2026-

దేశవ్యాప్తంగా మధుమేహం, అధిక రక్తపోటు, ఊబకాయం, క్యాన్సర్లు, ఫ్యాటీ లివర్, నిద్రలేమి.. తదితర జీవనశైలి వ్యాధులు విజృంభిస్తున్నాయని, ముఖ్యంగా యువతలో ప్రతి ముగ్గురిలో ఇద్దరు ఈ వ్యాధుల ముప్పు ముంగిట ఉన్నారని అపోలో ఆస్పత్రుల గ్రూప్ 'హెల్త్ ఆఫ్ ది నేషన్ నివేదిక 2026' పేర్కొంది. దేశవ్యాప్తంగా తమ ఆస్పత్రుల్లో చేసిన పరీక్షల ఆధారంగా ఈ నివేదికను రూపొందించారు.

నివేదికలోని కీలకాంశాలు:

30 ఏళ్లలోపున్న ప్రతి అయిదుగురిలో ఒకరు ప్రీడయాబెటిక్‌గా ఉన్నారు. సగంమందికిపైగా అసాధారణ కొలెస్ట్రాల్, అధిక బరువు సమస్యలున్నాయి. మూడింట రెండొంతుల మంది ఏదో ఒక అనారోగ్యంతో బాధపడుతున్నారు. 10 మందిలో ఏడుగురు డి-విటమిన్ లోపంతో ఇబ్బంది పడుతున్నారు. సగం మందిలో విటమిన్ బీ 12 తక్కువగా ఉంది.

+ మహిళల్లో రక్తహీనత, నడుము చుట్టూ కొవ్వు పేరుకుపోవటం లాంటి సమస్యలు కనిపించాయి. స్క్రీనింగ్ చేయించుకున్న 40 ఏళ్లు పైబడిన మహిళల్లో ప్రతి 359 మందిలో ఒకరికి ఎలాంటి లక్షణాలు బయటపడకుండానే రొమ్ము క్యాన్సర్ ఉన్నట్లు తేలింది.

+ 49 వేల మందికి అల్ట్రాసౌండ్ పరీక్షలు నిర్వహించగా.. 74% మంది ఏదో ఒక దశ ఫ్యాటీ లివర్ సమస్యను ఎదుర్కొంటున్నారు. హృద్రోగ లక్షణాలు లేనివారు కరోనరీ కాల్షియం స్కోరు పరీక్ష చేయించుకోగా.. 45% మందిలో ప్రారంభ గుండె సమస్యలు కనిపించాయి.

తెలంగాణలోనూ..

తెలంగాణలో 25.5% మంది డయాబెటిస్, 27.3% అధిక రక్తపోటు, 22.2% రక్తహీనత, 81.2% అధిక బరువు, మరో 70.6% మంది రక్తంలో అనారోగ్య ఫ్యాట్స్ (లిపిడ్స్)తో బాధపడుతున్నారు.

# ఈ చదువులతో వికసిత భారత్ అసాధ్యం.. స్కూలు చదువుల నాణ్యతకు మార్గసూచి



**'భారత్‌లో పాఠశాల విద్యావ్యవస్థ: గత పదేళ్ల సరళి విశ్లేషణ, విద్యలో నాణ్యతను పెంచేందుకు మార్గసూచి' పేరుతో నీతి ఆయోగ్ ఇటీవల ఒక నివేదికను విడుదల చేసింది.** 2014-15 నుండి 2024-25 వరకు దేశవ్యాప్తంగా విద్యావ్యవస్థ తీరుతెన్నులను విశ్లేషించింది. ఇందులో తీసుకున్న సమాచారం ఎన్.ఏ.స్, పరఖ్, పీటీఆర్, యూడీఐఎస్‌ఈ, అసర్‌ల నుండే గానీ, వీటన్నిటినీ మథించటానికి 2025లో ఢిల్లీలోని డాక్టర్ అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో ఒక విస్తృత కార్యశాలను నిర్వహించారు. ఆయా ఏజన్సీలు ఇచ్చిన సమాచారాన్ని విశ్లేషించి, దేశం, సమాజం ఎలా వినియోగించుకోవాలో నీతి ఆయోగ్ విద్యావిభాగం ఒక హేతుబద్ధ పద్ధతిలో వివరించి, మార్గనిర్దేశనం చేసే ప్రయత్నం చేసింది. ఇందులోని గణాంకాలు కొన్ని ఈ విద్యాసంవత్సరం కొంత మార్చవచ్చు, ఇది తాత్కాలిక నివేదిక మాత్రమే అని నీతి ఆయోగ్ పేర్కొన్నప్పటికీ.. సమ్మిళిత ఆర్థికాభివృద్ధికి కీలకమైన భారత విద్యావ్యవస్థ ప్రమాణాలపై స్పష్టతకు ఎంతో ఉపయోగపడుతుంది. పలువురు విద్యావేత్తలు, నిపుణులు పేర్కొన్నట్లు.. పౌర సమాజం వీటిని లోతుగా అధ్యయనం చేయాలి. ఢిల్లీ కార్యశాలలో ఎన్.సి.ఇ.ఆర్.టి, ఎన్.యు.ఇ.పి.ఏ, సి.బి.ఎస్.ఇ ప్రతినిధులతోపాటు యూనియన్, రాష్ట్ర అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. అందరి అభిప్రాయాలనూ క్రోడీకరించాక చివరిగా మరోసారి ఒక సంక్షిప్త చర్చను నిర్వహించి.. మౌలిక లోపాలు, 21వ శతాబ్దంలో, వికసిత భారత్ లక్ష్యసాధనకు విద్యలో అవసరమైన మార్పులను ఖరారు చేశారు.

**ఎన్‌రోల్‌మెంట్ సమస్యను**
**మన విద్యారంగం అధిగమించింది..**
**విద్యాప్రమాణాలే ఈవేళ అసలైన సవాలు**

విద్యారంగంలో భారతదేశం ఈవేళ ఎదుర్కొంటున్న సమస్య విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ ఎంతమాత్రం కాదని, వారి విద్యలో నాణ్యత కొరవడటమే అసలైన సమస్యని నీతి ఆయోగ్ నివేదిక పేర్కొంది. ఈ రంగంలో వ్యవస్థీకృత సంధానం, నిరంతర సంస్కరణలు కొనసాగుతుండాలని స్పష్టం చేసింది. జాతీయ విద్యావిధానం వికసిత భారత్‌కి కావలసిన పునాదిని వేసిందని, దీనివల్ల గత అయిదేళ్లలోనే గణనీయ మార్పులు మొదలయ్యాయని తెలిపింది. కొవిడ్ తర్వాత ప్రభుత్వ పాఠశాలలు ప్రయివేటు స్కూళ్ల కంటే ఎక్కువ వేగంగా కోలుకొని ఫలితాల్ని మెరుగుపరచుకోవటానికి ఈ విధానం దోహదం చేసింది. అయితే ఇంకా పలులోపాల్ని సరిదిద్దాల్సి ఉందని తెలిపింది. వివిధ రాష్ట్రాలలో అమలు చేస్తున్న అత్యుత్తమ పథకాలను వివరిస్తూ, వాటిని తమ పరిస్థితులకనుగుణంగా అన్ని రాష్ట్రాలూ అనుసరించాలని సూచించింది. విద్యలో యూనియన్, రాష్ట్రాల మధ్య అనుసంధానం సహకార ఫెడరల్ స్ఫూర్తితో ఉండటం ఫలితాల సాధనకు అవసరమని పేర్కొంది.

విద్యలో పరివృత్తం పరిమితం కాకూడదు..
**మొత్తం సమాజం, స్థానిక స్థాయి నుండి పెరగటం**
**సంకల్పం కావాలి,**

విద్యను పరిమిత దృష్టితో చూడటం వల్ల సమ్మిళిత అభివృద్ధి సాధ్యం కాదని, "మొత్తం సమాజం, స్థానిక స్థాయి నుండి పెరగటం" అనే సమీకరణాన్ని అనుసరించాలని తెలిపింది. విద్యలో ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యం అత్యంత కీలకమని, మన శిక్షణా ప్రమాణాల్ని, అంకితభావాన్ని గణనీయంగా మెరుగుపరచాలని స్పష్టం చేసింది. చాలామంది టీచర్లకు విషయ నైపుణ్యం తగినంత లేదని, వృత్తిపరమైన ప్రమాణాలు, మెంటారింగ్ వంటివి లోపించాయని తెలిపింది. సమాజంతో అనుసంధానానికి అవసరమైన నైతిక ప్రమాణాలు, విద్యార్థుల శారీరక, మానసిక ఆరోగ్యం, ఏఐ ఆధారిత విద్యకు సన్నద్ధతలో పలు లోపాలు ఉన్నాయని వెల్లడించింది. దేశంలో మొత్తం 14.71 లక్షల పాఠశాలల్లో 24.69 కోట్ల మంది పిల్లలు చదువుతున్నారని, 1 కోటి మంది టీచర్లున్నారని.. వీరిలో ప్రయివేటు స్కూళ్లలో చదివేవారి సంఖ్య వేగంగా పెరుగుతున్నా అక్కడా పెద్దగా మంచి చదువు రావటం లేదని 'అసర్' సర్వేను ఉటంకిస్తూ కార్యశాల అభిప్రాయపడింది. గతంలో 71 శాతం ఉన్న ప్రభుత్వ విద్యాసంస్థలు ఇప్పుడు 49 శాతానికి తగ్గిపోగా, ఆ మేరకు

ప్రయివేటు విద్యాసంస్థలు 41 శాతంపైగా పెరిగాయి.

తెలంగాణలో..

✦ వివిధ రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన మౌలిక వసతులున్నా, నాణ్యతతో కూడిన విద్యలో రాష్ట్రం పరిస్థితి పేలవంగా ఉంది.

✦ తెలంగాణ స్కూళ్లలో విద్యుత్ వసతి, కంప్యూటర్లు, ఇంటర్నెట్, స్మార్ట్ క్లాస్‌రూంల విస్తరణ గణనీయంగా పెరిగింది. విద్యార్థుల నమోదు రికార్డు స్థాయిలో ఉంది. 2014-15 విద్యాసంవత్సరంలో ప్రాథమిక స్థాయి నుండి ఉన్నత పాఠశాల స్థాయి వరకు విద్యార్థుల స్థూల నమోదు నిష్పత్తి (జీఈఆర్) 87.93% ఉండగా, 2024-25 నాటికి అది 111.6%కి చేరింది. మాధ్యమిక స్థాయిలో విద్యార్థుల నమోదు 76.7% నుండి 99.9 శాతానికి పెరిగింది. దేశంలోనే అత్యధిక మాధ్యమిక నమోదుగల రాష్ట్రాల్లో తెలంగాణ ముందు వరుసలో నిలిచింది. ప్రధానంగా 8వ తరగతి తర్వాత డ్రాపౌట్ల సంఖ్య కూడా బాగా తగ్గింది. రాష్ట్రంలో గురుకుల విద్యాసంస్థలు, కేజీవీబీ, మోడల్ స్కూల్స్, ఆశ్రమ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లు తగినన్ని ఉండటంతో విద్యార్థులు వాటి వైపు ఆకర్షితులవుతున్నారు. కానీ బోధన, అభ్యసన కార్యక్రమాల్లో పెద్ద పురోగతి లేదు. ప్రధానంగా బోధనలో నాణ్యత లోపించటం, గణితం, సైన్స్ సబ్జెక్టులలో విద్యార్థులు అత్యంత వెనుకబడివుండటం, ప్రాథమిక అభ్యసన, అవగాహన తీవ్ర ఆందోళనకరంగా ఉండటం సమస్యలు.

✦ నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం.. 9వ తరగతి పరీక్షల్లో తెలంగాణ విద్యార్థుల గణితం, సైన్స్ ఫలితాలు జాతీయ సగటు కంటే తక్కువగా ఉన్నాయి. భాషలలో మాత్రం జాతీయ సగటుతో సమానంగా ఉంది తప్ప, మెరుగైన రాష్ట్రాలతో పోటీ స్థాయిలో లేదు. మూడవ తరగతి నుండి 5వ తరగతి ఫౌండేషన్ లిటరసీ నుండి కాన్సెప్ట్ పరమైన అభ్యసనానికి మారే దశలో లెర్నింగ్ లోపాలు పెరుగుతున్నాయి.

✦ ఒక్క విద్యార్థి కూడా లేని పాఠశాలలున్న (ఘోస్ట్ స్కూల్స్) రాష్ట్రాల్లో పశ్చిమ బెంగాల్, తెలంగాణ ముందున్నాయి. తెలంగాణలో 2,245 వరకు పాఠశాలల్లో ఒక్క విద్యార్థి కూడా లేరు. అయినా వాటిల్లో 1,016 ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. 5,001 ఏకోపాధ్యాయ స్కూళ్లలో 62 వేల మందికిపైగా విద్యార్థులు చదువు తున్నారు. గ్రామీణ ప్రాంతాలలో జనాభా మార్పులు, ప్రభుత్వ పాఠశాలలపై విశ్వసనీయత లోపిస్తుండటం వంటి కారణాలతో ఈ పరిస్థితి ఏర్పడింది. రాష్ట్రంలో పెద్దసంఖ్యలో ప్రాథమిక పాఠశాలలే ఉండటం మరో ప్రధాన సమస్య. కేవలం 974 పాఠశాలలే

***నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం.. 9వ తరగతి పరీక్షల్లో తెలంగాణ విద్యార్థుల గణితం, సైన్స్ ఫలితాలు జాతీయ సగటు కంటే తక్కువగా ఉన్నాయి. భాషలలో మాత్రం జాతీయ సగటుతో సమానంగా ఉంది తప్ప, మెరుగైన రాష్ట్రాలతో పోటీ స్థాయిలో లేదు. మూడవ తరగతి నుండి 5వ తరగతి ఫౌండేషన్ లిటరసీ నుండి కాన్సెప్ట్ పరమైన అభ్యసనానికి మారే దశలో లెర్నింగ్ లోపాలు పెరుగుతున్నాయి.***

1 నుండి 12 వరకు ఇంటిగ్రేటెడ్ లేదా కాంపోజిట్ పాఠశాలలుగా ఉన్నాయి. (ఇంటర్మీడియెట్‌ను త్వరలో పాఠశాల విద్యలో విలీనం చేయాలని ప్రభుత్వం విధాన నిర్ణయాన్ని ప్రకటించింది).

✦ బాలికల విద్యలో తెలంగాణ అత్యుత్తమ పనితీరు కనబరుస్తోంది. సెకండరీ విద్యలో కూడా 78.58 శాతం నుండి 100 శాతం దాకా విద్యార్థినుల నమోదు పెరిగింది.

ఆంధ్రప్రదేశ్‌లో..

✦ 2024-25 యూడైస్ ప్రకారం ఏపీలో 12,912 ఏకోపాధ్యాయ బడులున్నాయి. వీటిలో దాదాపు 2 లక్షల మంది పిల్లలు చదువుతున్నారు. ప్రాథమిక స్థాయిలో 21 మందికి ఒక టీచర్ ఉండగా.. ప్రాథమికోన్నతంలో 15 మందికి, సెకండరీలో 10 మందికి, హయ్యర్ సెకండరీలో 30 మందికి ఒక టీచర్ ఉన్నారు.

✦ ఏపీలో పదో తరగతి నుండి ఇంటర్మీడియెట్ చదువు కొనసాగించేవారు 2014-15లో 40.79% ఉండగా, 2024-25కి వచ్చేసరికి ఆ సంఖ్య 76 శాతానికి పెరిగింది.

✦ రాష్ట్రంలో సాధారణంగా పాఠశాల విద్యార్థులు చదువుకు స్వస్తి చెప్పటం 6-8 తరగతుల్లో జరుగుతోంది. 3.7% మంది బడి నుండి ఏదోక ఆదాయ మార్గంలోకి మళ్లు తున్నారు.

✦ గతేడాదితో పోలిస్తే ఏపీలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లల సంఖ్య తగ్గి 32 లక్షలకు చేరింది.

మార్గసూచి..

**13 సబ్ థీమ్‌లలో సంస్థాగత, బోధనా సిఫార్సులు (8+5), 33 విధాన సిఫార్సులు**

విద్యకు పునాది అయిన పాఠశాల స్థాయిలో తెలుగు రాష్ట్రాల విద్యాప్రమాణాలు జాతీయ సగటు కంటే అధ్వాన్నంగా



ఉన్నాయి. అయితే ప్రపంచ సగటు ప్రమాణాల ప్రకారం చూస్తే, మన దేశంలోని అన్ని రాష్ట్రాలూ అధ్వాన్నంగా ఉన్నాయి. సంపన్నుల పిల్లలను ఉద్దేశించిన స్కూళ్లను మినహాయిస్తే.. కొన్ని రాష్ట్రాల్లో, కొన్ని స్కూళ్లలో, కొందరు టీచర్లు మాత్రమే భారత్‌లో మంచి పాఠశాల విద్య అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యాపరంగా, నిర్వహణ పరంగా కొన్ని సిఫార్సులను మార్గసూచిగా నీతి ఆయోగ్ విద్యావిభాగం తన 232 పేజీల నివేదికలో పేర్కొంది.

13 సబ్ థీమ్‌లలో, 33 విధాన సిఫార్సులను నీతి ఆయోగ్ సూచించింది. సంస్థాగతమైన, బోధనాపరమైన ప్రతి పరిష్కారంలో స్వల్ప కాల, మధ్య, దీర్ఘకాల చర్యలున్నాయి. విద్యను సాంకేతికతతో పరిశ్రమలతో, మార్కెట్ అవసరాలతో అనుసంధానిస్తూ సమగ్ర పరిష్కారాలను విద్యార్థులకు అందించే ప్రయత్నం చేసింది. ఏ పరిష్కారానికి ఏయే విభాగాల్ని సంధానం గావించాలో తెలియచేసింది. ప్రాచీన భారతంలో విద్య ఎలా ఉండేది దగ్గర్నుంచి, నేటి విద్యా ప్రమాణాల వరకూ ఈ నివేదికలో ప్రస్తావించింది. మార్గసూచిలోని కొన్ని ముఖ్యాంశాలు:

✦ ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్)ని మూడవ తరగతి స్థాయి దాటి విస్తరించాలి. నిపుణ్ భారత్ లక్ష్యాలతో సంధానించాలి.

✦ పాఠ్యపుస్తకాలను పూర్తిచేయటం కాకుండా, పిల్లలకు అందులోని పాఠాలకు సంబంధించిన మౌలికాంశాలపై పట్టు ఉండేలా బోధనాపద్ధతుల్ని మార్చాలని నివేదిక సూచించింది.

✦ బోధనా ప్రమాణాలను గణనీయంగా పెంచటంలో భాగంగా.. ఉపాధ్యాయులకు సమగ్ర శిక్షణను అందించాలి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా నూటికి 60 మార్కులు పరిధి దాటుతున్న టీచర్లు కేవలం 15 శాతం మాత్రమే.

✦ అభ్యసన సామర్థ్యాలను బేరీజు వేసేలా, అటువంటి ప్రశ్నల్ని రూపొందించగలిగేలా ఉపాధ్యాయులకు అవగాహన పెంచాలి. అభ్యసనంలో అంతరాలు, కొరతలను అంచనా వేసేందుకు సాంకేతికత ఉపకరణాలను వినియోగించాలి. మార్కుల కేటాయింపు విషయంలో కూడా సాంకేతికతను ఉపయోగించాలి.

✦ పరీక్షల నిర్వహణలో కూడా కాన్సెప్ట్‌ల పట్ల అవగాహన, విశ్లేషణా సామర్థ్యం, నిత్యజీవితంలోని సందర్భాలకు నేర్చుకున్న పరిజ్ఞానాన్ని వినియోగించటం, సమస్యలను పరిష్కరించే శక్తి, సంక్లిష్ట ఆలోచనా ప్రక్రియ మొదలైనవి ఒత్తిడి లేకుండా పరీక్షించే విధంగా ప్రశ్నల్ని రూపొందించాలి.


✦ తరగతి గతిలో బేరీజు, ప్రాజెక్ట్ వర్క్‌లు, ఆసక్తిగల రంగాలను అదనంగా నేర్చుకోవటం, ప్రయోగాత్మక అభ్యాసం, నిర్ణీత కాలవ్యవధిలో అభ్యసన సామర్థ్యాలను అంచనా వేయటం వంటివి ప్రశ్నా పత్రాల్లో భాగంగా ఉండాలి.


✦ మార్కుల ఆధారితంగా కంటే.. నేర్చుకోవటం ప్రాతిపదికన పైతరగతులకు ప్రమోట్ చేయాలి.

✦ కోచింగ్ సెంటర్‌లపై ఆధారపడిన పరీక్షల పద్ధతిని మార్చాలి.

✦ విద్యాప్రమాణాల గణింపు ప్రక్రియలో భాగంగా పరఖ్ (గతంలో ఎన్ఏఎస్), పీటీఆర్ తదితర సర్వేలను పటిష్ఠం చేయాలి.

✦ దేశంలో లక్ష కంటే ఎక్కువ (7%) పాఠశాలలు ఒకే ఉపాధ్యాయుడితో నడుస్తున్నాయి. వీటిలో అభ్యసన స్థాయిలు పడిపోతున్నాయి. అందువల్ల ఏకోపాధ్యాయ పాఠశాలల్లో తగిన సంఖ్యలో టీచర్లను సర్దుబాటు చేయాలి.




✦ ఢిల్లీ, ఛండీగఢ్ మినహాయించి.. మిగిలిన అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఉన్నత విద్యకొచ్చేసరికి డ్రాపౌట్లు కొనసాగుతున్నాయి. జాతీయ సగటు ప్రకారం పదవ తరగతి కొచ్చేసరికి డ్రాపౌట్లు 25 శాతం దాకా ఉన్నాయి. అయితే ఈ డ్రాపౌట్లు ప్రాథమిక పాఠశాలలు పెద్ద సంఖ్యలో (ఏడున్నర లక్షల దాకా) ఉండటం, ప్రాథమికోన్నత తక్కువగా (సుమారు లక్షన్నర), ఆ పైన ఇంకా తక్కువగా ఉండటం వల్ల మూడు స్థాయిల్లో స్కూళ్లు మారాల్సి రావటం వల్ల చోటుచేసుకుంటున్నాయని నివేదిక విశ్లేషించింది. కానీ కొందరు నిపుణుల అభిప్రాయం ప్రకారం.. విద్యలో నాణ్యత కొరవడటం వల్ల, ఎంత ఎక్కువ చదివితే అంత ఎక్కువ నిరుద్యోగం కళ్ల ముందే కనిపిస్తుండటం వల్ల.. టీనేజ్ నుండే పనిలో చేరి సంపాదించటం మేలు అనే అభిప్రాయం సామాన్య తల్లిదండ్రుల్లో ఎక్కువగా ఏర్పడింది.

✦ ఏఐ ఆధారిత బోధనను అన్ని స్థాయిల్లో ప్రారంభించాలి.

✦ లింగ సమానత్వం పాటించాలి. దేశంలో ఏ రాష్ట్రానికి తల్లిదండ్రులు వలసలు వెళ్లినా పిల్లలు నష్టపోకూడదు. ఇందుకోసం.. సమాజం యూనిట్‌గా అందరికీ నాణ్యమైన విద్యను అందించాలి.

✦ విద్యాసంస్థల పాలనా నిర్వహణను వికేంద్రీకరించాలి. స్థానిక ప్రభుత్వాల స్థాయిలో నిర్ణయాలు తీసుకోవాలి.

✦ పాఠ్యాంశాలలో కూడా స్థానిక ఉదాహరణల ద్వారా బోధించే పద్ధతుల్ని ప్రోత్సహించాలి. అవసరమైతే, పాఠ్యాంశాలను ఆ విధంగా మార్చుకునే వెసులుబాటు ఇవ్వాలి.

✦ స్కూలు కమిటీల్ని ఏర్పాటు చేయాలి. తల్లిదండ్రుల్ని భాగస్వాముల్ని చేయాలి.

✦ పాఠశాలల పనితీరును పర్యవేక్షించటానికి బ్లాక్ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకూ బోర్డుల్ని ఏర్పాటు చేయాలి. కలెక్టర్ల ఆధ్వర్యంలో డ్యాష్‌బోర్డు నిర్వహించాలి. రాష్ట్ర స్థాయిలో ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన బోర్డు ఏర్పాటు చేయాలి.

✦ పర్యవేక్షణతోపాటు బోధనలో అవసరమైన మద్దతును కూడా అందించేలా ఆ బోర్డులు బాధ్యతల్ని నిర్దేశించాలి.

✦ 'మిషన్ టీచర్స్ 2030'ని ప్రారంభించాలి.

✦ పీఎం శ్రీ స్కూళ్ల నిధుల్ని, నీతి ఆయోగ్ సారథ్యంలోని సాథ్-ఈ (సస్టెయినబుల్ యాక్షన్ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ హ్యూమన్ క్యాపిటల్) వంటి కార్యక్రమాల్ని రాష్ట్రాలు సద్వినియోగం గావించుకోవాలి.

✦ ప్రీ స్కూల్ విద్య (ఎర్లీ చైల్డ్‌హుడ్ డెవలప్‌మెంట్, కేర్ అండ్ ఎడ్యుకేషన్-ఈసీడీసీఈ)కి ఏకీకృత వ్యవస్థ ఏర్పాటు

✦ నాగాలాండ్‌లోని 'లైట్ హౌస్ స్కూళ్లు' (ఎల్‌హెచ్‌ఎస్), పీఐజీ (పెర్ఫార్మెన్స్ ఇన్సెంటివ్ గ్రాంట్స్), ఉత్తర్‌ప్రదేశ్‌లోని 'పోషణ్ భీ, పఢాయి భీ' (మిషన్ సునేహ్రా కాల్), మణిపూర్‌లోని 'యుఎస్‌పీ' (యూనిక్ సెల్లింగ్ ప్రపోజిషన్ ఇనీషియేటివ్), మధ్యప్రదేశ్‌లోని 'ఆనంద సభ, యూనియన్ ప్రభుత్వ ఆధ్వర్యంలోని 'మనోదర్పణ్' (మానసిక ఒత్తిడులను తగ్గించే లక్ష్యంతో), రాజస్థాన్‌లోని 'శాల స్వాస్థ్య పరీక్షణ్' (స్కూలు పిల్లల ఆరోగ్య, శారీరక, మానసిక దృఢత్వ పరీక్షలను సాంకేతికతతో చేయటం), 'ముఖ్యమంత్రి శిక్షిత్ రాజస్థాన్ అభియాన్ (విస్తృతస్థాయి విద్యాప్రమాణాలను సాంకేతికత సాయంతో సులభంగా అంచనా వేయటం), ఆంధ్రప్రదేశ్‌లోని 'మాకు పుస్తక పఠనం ఇష్టం', వివిధ భాషలలో విస్తృత, ఆధునీకరించిన పాఠ్యాంశాలను బోధించే స్వయం పోర్టల్, బేటీ బచావ్, బేటీ పఢావ్, తెలంగాణలోని 'తొలిమెట్టు' మొదలైన పథకాల నుండి ప్రతి రాష్ట్రం తమ విద్యావ్యవస్థను మెరుగుపరచుకోవచ్చు. ✪

# రాజకీయం..ఎజెండా మారకుండా ఎవరొచ్చినా ప్రయోజనం లేదు

**నీట్ పరీక్ష లీకేజీ వ్యవహారంలో కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలంటూ కాక్రోచ్ జనతాపార్టీ(సీజేపీ) దేశ వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తోంది..ఈ నేపథ్యంలో సీజేపీ ఆందోళనలు తదితర అంశాలపై ప్రజాస్వామ్య పీఠం, లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్ అభిప్రాయాలు..**

==========================



**ప్రశ్న: ఈరోజు జరుగుతున్న సిజేపి ప్రొటెస్ట్‌లో చాలా మంది ఎడ్యుకేషన్ మినిస్టర్ రాజీనామా కోసం డిమాండ్ చేస్తు న్నారు. కానీ మీ దృష్టిలో ఒక మంత్రి మారితే సరిపోతుందని అనుకుంటున్నారా?**

జేపీ: మారదు, ఎందుకంటే నేను చాలా కాలం నుంచి ఇదే వాదించాను.. లోక్‌సత్తా నినాదమే అది.. ఆటగాళ్ళు మారితే చాలదు ఆట నియమాలు మారాలి అని. అవినీతి, నిరుద్యోగం పెరుగుతున్నాయి, బీదరికం అనుకున్నంత స్థాయితో తగ్గడం లేదని ప్రజల్లో ముఖ్యంగా యువతలో కొంత ఆందోళన మొదలైంది. మొదట్లో గుజరాత్లో వచ్చింది తర్వాత బీహార్లో వచ్చింది దేశంలో చాలాప్రాంతాల్లో అవినీతి వ్యతిరేక ఉద్యమాలు వచ్చాయి. 1970లలో మేమంతా ఏమను కున్నాం ఆనాటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీని తప్పేస్తే అంతా బాగుపడిపోతుందనుకున్నా. చివరికి ఇందిరా గాంధీ వ్యతిరేకంగా ఉద్యమంగా మారిపోయింది. దీంతో ఆమె ఎమర్జెన్సీ పెట్టి దేశం మొత్తాన్ని జైలుగా మార్చేసింది. ఎమర్జెన్సీ పెట్టినప్పుడు విపరీతంగా స్పందించిన వాళ్లలో నేను ఒకడిని. వ్యక్తిగతంగా నాకేం నష్టం జరగలేదు. కానీ భావపరంగా ఒళ్లంతా దహించుకుపోయింది మాకు. సరే ఎమర్జెన్సీ అయిపోయింది ఎన్నికలు వచ్చాయి. ఓడిపోతే మేమంతా ఎగిరి గంతులు వేశాం. వెర్రి ఆనందంతో గంతులు వేశాం. డాన్స్ రాకపోయినా డాన్స్ చేశాం. దేశం అద్భుతంగా మారిపోతుంది గాంధీ విప్లవం వచ్చింది భవిష్యత్తు అందంగా ఉంటుందనుకున్నాం. ఏం మారలేదు. స్వేచ్ఛ మళ్ళీ వచ్చింది అంతే, ఇంకేమి జరగలేదు. కాబట్టి దీనికో నిర్మాణాత్మక మార్గం కావాలి. ఎందుకని మనం అనుకున్న ఫలితాలు రావడం లేదు యువతకు ఎందుకని నిరుద్యోగం ప్రధానంగా అది కదా సమస్య. ఈ పరీక్షల్లో సరే కొన్ని సాంకేతిక ఇబ్బందులు ఉంటాయి. కొన్ని చోట్ల అవినీతి కూడా ఉండొచ్చు.. ఆ కారణాలుగా పరీక్షలు మళ్ళీ మళ్ళీ రాయాల్సి రావడం కానీ లేకపోతే రిజల్ట్స్ గందరగోళం కానీ కావచ్చు. కానీ, వ్యవస్థీకృతంగా ఏం జరగాలి? మనం అనుకున్న ఫలితాలు ఈ దేశంలో యువతకి అందాలి అంటే ఎక్కడ తప్పటడుగు వేస్తున్నాం? చేస్తున్న మంచిని ఆపకుండా దాన్ని కొనసాగిస్తూ చెడుని ఎట్లా ఆపాలి.. దాన్ని ఎలా మార్చాలి దాని మీద దృష్టి పెట్టకుండా వీడిని దింపే వాడిని దింపే అంటే కేవలం పక్షపాత రాజకీయంలో భాగస్వాములు అయిపోతారు. బాగా ఉంటే ఆటగాళ్ళు మారితే అది కూడా మారనివ్వరు. ఎందుకంటే మీరు వీడిని దింపాలంటే వాడు మౌనంగా కూర్చుంటాడా ? కాబట్టి వాళ్ళ వ్యూహాలు వాళ్ళు వేసుకుంటారు, మీ వ్యూహాలు మీరు వేసుకుంటారు. మీరు రాజకీయ పార్టీల మధ్య పావైపోతారు. అది వ్యవస్థలో మార్పుకి ఒక నాంది కావాలి. వ్యవస్థలో కొంత మంచి ఉన్నది.. కొంత చెడు ఉన్నది. ఆ చెడుని ఎలా మార్చాలిని ఆలోచన చేస్తే మంచిది.

**ఈరోజు యువత ఉద్యోగాలు, ఎగ్జామ్ లీక్స్. ఉద్యోగాల భర్తీలో ఆలస్యం గురించి గట్టిగా మాట్లాడుతున్నారు. ఇవన్నీ వేరు వేరు సమస్యలా? లేకపోతే గవర్నెన్స్ ఫెయిల్యూర్ కారణం అనుకుంటున్నారా?**

జేపీ:నో, కచ్చితంగా వెనకాల భయంకంమైన వైఫల్యం ఉంది. అది స్థూలంగా చూస్తే. కానీ, దానిలో కొన్ని రంగాల్లో ప్రత్యేకం ఉదాహరణకి మంచి ప్రమాణాల విద్య అందట్లేదు. ఇది ప్రత్యేకంగా భారతదేశంలో మాత్రమే పెద్ద దేశాల్లో ఉన్న భయంకరమైన లోపం. మామూలు లోపం కాదు. మన దేశంలో పిల్లలకు బాగా విద్య రావాలని తల్లిదండ్రులు గాని

పిల్లలు గాని కోరుకున్నంతగా మరొకటి ఉండదు. ఇంత పెద్ద దేశం అయినా కూడా లక్షలు లక్షలు ఖర్చు పెడుతున్నారు. ఎన్నో త్యాగాలు చేస్తున్నారు పిల్లలు కష్టపడుతున్నారు. కానీ ప్రభుత్వాల వైఫల్యం వల్ల కొంతమందికి తప్ప, చెత్త కాయితాలు సర్టిఫికెట్లు డిగ్రీలు వస్తున్నాయి తప్పితే ఏమాత్రం పనికివచ్చే పరిజ్ఞానం రావట్లే దు. ఇది కేవలం పాలన వైఫల్యం అంటే చాలదు. పాలనా వైఫల్యం ఉన్నది దానిలో కూడా కొంచెం కొన్ని విషయాల్లో లోతుకెళ్లాలి. ముఖ్యంగా విద్య, ఆరోగ్యం, చిన్న పట్టణాల అభివృద్ధి. ఎందుకంటే మనం ఎంతసేపటికి ఢిల్లీ హైదరా బాద్ బొంబాయ్ చెన్నై, బెంగళూరు దీని చుట్టూ ఆలోచి స్తున్నాం. ఎందుకంటే కొంచెం కాస్త డబ్బు ఉన్నవాళ్లు అధి కారం ఉన్నవాళ్ళు, మీడియా అంతా అక్కడ ఉంటుంది. కాబట్టి. కానీ దేశం 60, 70, 80% ఉన్నది చిన్న పట్టణాల్లో నే. కాబట్టి ఎక్కడికక్కడ ఆర్థిక వ్యవస్థ బలపడకపోతే స్థానికంగా చిన్న ఉద్యోగాలు పెద్ద ఎత్తున రాకపోతే మనకి ఆంధ్రప్రదేశ్లో ఉదాహరణకి.. మీకు నేను ఎప్పుడు చెప్తుంటాను అచ్చుతాపురంలో 22000 మంది మహిళలకి కేవలం దుస్తుల తయారీలో బ్రాండిక్స్ అనే కంపెనీ వాళ్ళకి ఉద్యోగాలు ఇవ్వగలిగింది. చుట్టుపక్కల వందల గ్రామాల్లో కావాలనుకున్న ప్రతి మహిళకి ఉద్యోగం వచ్చింది. ఆ స్థాయి లో మీరు ఉద్యోగాలు కల్పన చేయకపోతే హైదరాబాద్ ఢిల్లీలో ఎంతసేపు సాఫ్ట్ వేర్ ఉద్యోగులు, హై లెవెల్ లో ఉన్న వాళ్ళ గురించి ఆలోచిస్తే ఈ దేశంలో అనుకున్న మార్పులు రావు.

**ఇప్పుడు ఈ యువతకు ఉన్న ఈ అసంతృప్తికి నిజమైన మార్పుగా మారాలంటే సిజేపి నెక్స్ట్ స్టెప్ ఏమి ఉండాలని మీరు అనుకుంటున్నారు?**

జేపీ: విజ్ఞత గలవాళ్ళు ఈ దేశంలో ఇప్పటికీ కోకొల్లలుగా ఉన్నారు. దేశాన్ని ప్రేమించేవాళ్ళు, నిజాయితీకి మారుపేరైన వాళ్ళు, పక్షపాతాలకి, పార్టీలకి లొంగని వాళ్ళు, అనుభవం , సమాజంలో విశ్వసనీయత గౌరవం ఉన్నవాళ్ళు. అలాంటి వాళ్ళని మీరు మీకు ఇష్టం వచ్చిన వాళ్ళని దేశం వివిధ ప్రాంతాల నుంచి ఓ పది మందిని ఎంపిక చేసుకోండి. దానిలో సిద్ధాంతాల రాద్ధాంతాల జోలికి వెళ్లబోకండి. పిడివాదంలోకి వెళ్ళబోకండి.. ఆధునిక ఆర్థిక వ్యవస్థలో ఇటు మార్కెట్ కావాలి, అటు ప్రజలకు విద్య, ఆరోగ్యం ఉమ్మడి సదుపాయం అందాలి. ఈ రెండిటిని సంధానం చేసే వ్యక్తిత్వం మనుషులని మీరు ఎంపిక చేసుకొని, దీనికి ఒక మార్గం కావాలంటే ఏ ఎజెండా కోసం మనం పోరాడాలని అడగండి. ఇదిగో వీడిని దింపేయి..ఇది చేయి వంటి చిన్న చిన్నవి చాలా సుష్మమైనవి కాకుండా వ్యవస్థల మార్పు. రెండోది, ఒకసారి ఏమిటి ఎజెండా అని నిర్ధారించిన తర్వాత దాన్ని ప్రజల దృష్టికి, రాజకీయం దృష్టికి, పత్రికల దృష్టికి వెళ్ళాలంటే నిర్మాణాత్మకంగా శాంతియుతంగా, ఏరకంగా ద్వేష రహితంగా ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలి..వినూత్నంగా ఆలోచించాలి. ఈ రెండు చేస్తే దేశంలో మౌలిక మార్పు నాంది పలికినవారు అవు తారు. లేకపోతే నాలుగు రోజులు న్యూస్ సైకిల్ లో ఉంటా రు. కొంతకాలం పాటు రాజకీయ పార్టీలకు పాచికల్లా ఉపయోగ పడతారు.కాలక్రమేణ ఇదంతా అందరూ మర్చిపోతారు.

**సిజేపీది మూమెంట్ లా కాకుండా పొలిటికల్ పార్టీగా ఎస్టాబ్లిష్ అవుతుందని మీరు అనుకుంటున్నారా ?**

జేపీ: కష్టం. ఎందుకంటే సింగిల్ ఇష్యూ పార్టీలు బతకవు . అందులో మన దేశంలో మన ఎన్నికల వ్యవస్థలో బాగా బలమైన పార్టీలు పాతుకుపోయిన తర్వాత వేరే పార్టీలకు స్థానం లేదు. చాలా అరుదుగా మొన్న విజయ్కి తమిళనా డులో చాలా అనూహ్యంగా అవకాశం వచ్చింది. అది దేశమంతటా ఒకరోజు జరగదు. అలాంటిది జరగాలంటే 15-20 ఏళ్ళు పడుతుంది. దేశంలో పక్వానికి రావాలి . అప్పుడు కూడా మన దేశంగా అనుకుంటున్నాం దేశం కరెక్టే కానీ రాష్ట్రాలు కీలకం. ఒక్కో రాష్ట్రంలో ఒక్కో తీరు గా రాజకీయంగానీ, ప్రజల స్పందన గానీ ఉంటుంది. ఈ మొత్తాన్ని సంధానం చేయాలి. అందుకనే 1952లో మొట్టమొదటి ఎన్నిక జరిగితే 77 దాకా ఈ పార్టీలు కలిసి రాలేదు. కాంగ్రెస్ కి వ్యతిరేకంగా ప్రత్యామ్నాయంగా ఒక రాజకీయ శక్తిగా. అది కూడా ఎంతోకాలం నిలవ లేదు. మళ్ళీ ముక్కలు అయిపోయింది. అందుచేత ఇంత పెద్ద దేశంలో ఒక ప్రభావశీలమైన రాజకీయ శక్తిగా ఎదగడం అనేది ఆషామాషీ కాదు. కానీ జరగాలన్నా కూడా ముందు ఏ అంశాల చుట్టూ మీకు కూడా అధికారం కావాలనా మీరు కోరేది. మీకు ఒక ఎజెండా కావాలి కదా? ఈ పార్టీలకు అతీతంగా కొత్త పార్టీ నిర్మాణం జరగాలి కదా? ఇది కొత్త పార్టీ ఈ పార్టీల్లా కాదు కేవలం అధికారం కోసం పోటీ పడేది కాదనే నమ్మకాన్ని కలిగించాలి కదా. ఇవన్నీ ఊరికే మాటలతో జరిగే పనులు కాదు. కాబట్టి రాజకీయ శక్తిగా ఒక పార్టీగా రావడం చాలా కష్టం కావచ్చు. అయితే దేశంలో ఇన్ని పార్టీలు అక్కర్లేదు. ఇన్ని పార్టీలు ఎందుకు అవసరం అవుతుంది అంటే, ఎందుకు వస్తున్నాయి అంటే జన జీవితాన్ని బాగు చేయడం కోసం ఉన్న పార్టీలు సరైన ప్రభావాన్ని చూపెట్టలేకపోతున్నాయి. దానికోసం ప్రజల ఆశల నుంచి కొన్ని సందర్భాల్లో రకరకాల పేర్లతో వస్తున్నాయి. ఎన్ని పార్టీలు వచ్చినా కానీ మనకు కావలసింది ఎలాంటి రాజకీయం? ఎలాంటి ఏజెండా? ఈ రెండూ మారకుండా ఎవరు వచ్చినా ఎంతమంది వచ్చినా ఉపయోగం లేదు ★

# తెలుగు రాష్ట్రాల్లో 'సర్'



దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్-సర్)ను ఎన్నికల సంఘం చేపట్టింది. ప్రతి 20-25 సంవత్సరాల కోసారి సమగ్ర సవరణ చేపడతారు. చివరిసారిగా 2022లో దేశవ్యాప్తంగా నిర్వహించారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు సహా దేశంలో మరికొన్ని రాష్ట్రాల్లోనూ ఈ విడత సర్ నిర్వహిస్తున్నారు. గత నెల 25న తెలుగు రాష్ట్రాల్లో ఈ ప్రక్రియ మొదలైంది. ఇప్పటికే సర్ పూర్తయిన రాష్ట్రాల్లో పెద్ద సంఖ్యలో ఓటర్లను తొలగించారనే ఆరోపణల నేపథ్యంలో ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో కుల, మత, ప్రాంత, లింగ భేదాలతో సంబంధం లేకుండా వయోజనులైన పౌరులందరికీ భారత రాజ్యాంగం ఓటు హక్కు కల్పించింది. ఓటు హక్కును పరిరక్షించుకునేందుకు విధిగా ప్రయత్నించాలి. సర్‌లో భాగస్వాములు కావాలి.

ఎస్ఐఆర్‌లో భాగంగా ప్రతి ఓటరు వద్దకు ఎన్నికల సిబ్బంది వెళ్లి సర్వే చేపడతారు. ఇందులో ప్రధానంగా శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లినవారు, మృతి చెందినవారు, రెండుచోట్ల ఓటర్లుగా నమోదైన వారిని గుర్తిస్తారు.

**ఎన్యూమరేషన్ ఫారం ఇస్తేనే ఓటు**

ఎన్యూమరేషన్ ఫారాన్ని ఎలాంటి తప్పులు లేకుండా నింపి సంతకం/వేలి ముద్ర వేసి బూత్ స్థాయి అధికారికి(బీఎల్ఓ) జూలై 24లోగా తిరిగి ఇవ్వాలి. అప్పుడే వారి పేరు ముసాయిదా ఓటర్ల జాబితాలో ప్రచురిస్తారు.

**ఫారం ఎలా పూరించాలి?**

★ ఇంటింటికి వెళ్లి ప్రతి ఓటరుకు రెండు ప్రతుల ఎన్యూమరేషన్ ఫారాలను బీఎల్ఓలు ఇస్తారు. ఈ ఫారాన్ని మూడు విభాగాలుగా విభజించి రూపొందించగా, ఎగువ విభాగంలో సంబంధిత ఓటరు పేరు, ఎపిక్ సంఖ్య, చిరునామా, ఫొటో తదితర పాక్షిక వివరాలు ప్రింట్ చేసి ఉంటాయి. పాత ఫొటో ముద్రించి ఉంటే కొత్త ఫొటోను అతికించడానికి ఒక బాక్స్ ఉంటుంది.

★ చివరిసారిగా రాష్ట్రంలో 2002లో 'సర్' నిర్వహించి తయారు చేసిన ఓటర్ల జాబితాలో ఓటరు పేరు, బంధువు పేరు ఉంటే.. ఆ వివరాలను ఫారం మధ్యలోని రెండో విభాగంలో నింపాలి. 2002 జాబితాలో వివరాలు ఎలా ఉంటే సరిగ్గా అలానే పూరించాలి. ఎడమవైపు కాలమ్‌లో ఓటరు, కుడి వైపు కాలమ్‌లో బంధువుకి సంబంధించి 2002 జాబితాలోని వివరాలు రాయాలి. 2002 జాబితాలో ఇద్దరిలో ఒకరి పేరే ఉంటే సంబంధిత కాలమ్‌లో ఆ వివరాలను నమోదు చేయాలి. ఇద్దరిలో ఒకరి పేరు లేకుంటే సంబంధిత కాలమ్ ఖాళీగా వదిలేయాలి. ఇద్దరి పేర్లూ లేకుంటే రెండు కాలమ్స్‌నూ ఖాళీగా వదిలేయాలి.

★ మూడో విభాగంలో ఓటరు పుట్టిన తేదీ, ఆధార్ (ఐచ్ఛికం),

మొబైల్ నంబర్, తండ్రి/సంరక్షకుడి పేరు ఎపిక్ నంబర్, తల్లి పేరు ఎపిక్ నంబర్, జీవిత భాగస్వామి పేరు ఎపిక్ నంబర్ రాయాల్సి ఉంటుంది. ఒక ప్రతిని బీఎల్ఓ తీసుకుని మరో కాపీని రశీదుగా తన సంతకంతో తిరిగి ఓటరుకే ఇస్తారు. దీన్ని భద్ర పరుచుకోవాలి. భవిష్యత్తులో అవసరం రావొచ్చు.

**ఎన్యూమరేషన్ ఫారం ఇవ్వకుంటే..**

ఎన్యూమరేషన్ ఫారాన్ని కేంద్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్ ద్వారా సమరించవచ్చు. అయితే, ఆధార్ అథెంటికేషన్ సదుపాయం కలిగిన ఓటర్లు మాత్రమే ఈ సదుపాయాన్ని ఉపయోగించుకోగలరు. ఇక బీఎల్ఓ ఎన్యూమరేషన్ ఫారాన్ని పంపిణీ చేయకుంటే సీఈఓ వెబ్‌సైట్ నుంచి తమ ప్రాంత బీఎల్ఓ ఫోన్ నంబర్‌ను తీసుకుని నేరుగా ఫోన్ చేయొచ్చు. ఈసీ వెబ్‌సైట్‌లో 'బుక్ ఎ కాల్ విత్ బీఎల్ఓ' సదుపాయాన్ని సైతం వినియోగించుకోవచ్చు. విదేశాల్లోని భారత పౌరులు ఆన్‌లైన్ ద్వారా ఎన్యూమరేషన్ ఫారాన్ని సమరించవచ్చు.

**జూలై 31న ముసాయిదా ప్రచురణ**

ముసాయిదా ఓటర్ల జాబితాను జూలై 31న పోలింగ్ కేంద్రాల వారీగా ప్రచురిస్తారు. ఎన్యూమరేషన్ ఫారాన్ని సమర్పించని ఓటర్లను ఈ జాబితా నుంచి తొలగిస్తారు. ఈ జాబితాను సైతం పోలింగ్ కేంద్రాల వారీగా ప్రచురించి స్థానిక కార్యాలయాలతో పాటు, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వెబ్‌సైట్‌లోనూ అందుబాటులో ఉంటుంది.

**ఈ పత్రాల్లో ఏదో ఒకటి చూపాలి**

ఎస్ఐఆర్ సర్వేలో ఆధార్ కార్డుకు పరిగణలోకి తీసుకోరు. 11 ఇతర కార్డుల్లో ఏదో ఒకదాన్ని ఓటరు నమోదుకు ఆధారంగా తీసుకుంటారు.

1. యూనియన్, రాష్ట్ర ప్రభుత్వ, పీఎస్‌యూ ఉద్యోగుల గుర్తింపు కార్డు. 2. 01-07-1987 కంటే ముందు దేశంలో ప్రభుత్వ / స్థానిక సంస్థలు/ బ్యాంకులు/ ఎల్ఐసి జారీ చేసిన ఆధారాలు, 3. సాధికార సంస్థ జారీ చేసిన జనన ధ్రువీకరణ పత్రం, 4. పాస్‌పోర్టు, 5. గుర్తింపు పొందిన బోర్డు/ విశ్వవిద్యాలయం జారీ చేసిన విద్యా ధృవీకరణ పత్రం, 6. అధికారిక స్థిర నివాస ధ్రువీకరణ పత్రం, 7. అటవీ హక్కుల పత్రం, 8. కుల ధ్రువీకరణ పత్రం, 9. జాతీయ గుర్తింపు కార్డు 10. స్థానిక అధికారుల ద్వారా రూపొందించిన కుటుంబ గుర్తింపు పత్రం, 11. ప్రభుత్వం ద్వారా జారీ అయిన భూమి లేదా ఇంటి కేటాయింపు పత్రం

**2002లో ఓటరు పేరు లేకుంటే?**

ఓటరు పేరు సర్ 2002 ఓటర్ల జాబితాలో లేకపోతే ఆందోళన అవసరం లేదు. 2002 జాబితాలో వారి తల్లిదండ్రులు/ నాయనమ్మ, తాతయ్యల పేర్లను సేకరించి ఎన్యూమరేషన్ ఫారంలోని సంబంధిత కాలమ్‌లో పూరిస్తే సరిపోతుంది.

**2002 జాబితాలో పేరెలా వెతకాలి?**

2002 నుంచి ఒకే చిరునామాలో ఉంటున్న ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారం నింపడంలో ఇబ్బందులు ఉండవు. 2002 ఓటర్ల జాబితాలో వారి పేరు, బంధువుల పేర్ల వివరాలు స్థానిక బీఎల్ఓల వద్ద ఉంటాయి. ప్రస్తుతం కొత్త చిరునామాలో ఉంటున్న ఓటర్లు మాత్రం 2002లో ఎక్కడ ఉన్నారో ఆ నియోజకవర్గ ఓటర్ల జాబితాలో తమ పేరు, బంధువు పేర్లను వెతకాలి. 2002 తర్వాత నియోజక వర్గాల పునర్విభజన జరగడంతో వాటి సరిహద్దులతోపాటు పేర్లూ మారాయి. అప్పటి నియోజకవర్గం పేరు, పోలింగ్ బూత్ వివరాలతో 2002 జాబితాలో పేర్లు చూడొచ్చు. ఈసీ వెబ్‌సైట్ తోపాటు సీఈఓ తెలంగాణ వెబ్‌సైట్ లో ఈ ఓటర్ల జాబితా అందుబాటులో ఉంది. నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్ల జాబితాలో సెర్చ్ చేసుకోవచ్చు. ఓటరు పేరు, ఇతర వివరాలతో సైతం పేర్లను వెతికే సదుపాయమూ ఉంది.

### 'సర్' షెడ్యూల్

★ ఇంటింటికి తిరిగి ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ జూన్ 25 నుంచి జూలై 24 వరకు

★ ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ జూలై 31

★ ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు, దరఖాస్తులు జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు

★ నోటీసుల జారీ/ విచారణ, ఎన్యూమరేషన్ ఫారాలు/ అభ్యంతరాలు/ దరఖాస్తుల పరిష్కారం జూలై 31 నుంచి సెప్టెంబర్ 28 వరకు

★ తుది జాబితా ప్రచురణ అక్టోబర్ 1

**ముసాయిదాలో పేరు లేకుంటే**

ముసాయిదా జాబితాపై అభ్యంతరాల (ఫారం7)తో పాటు కొత్తగా ఓటర్లుగా నమోదు (ఫారం6), వివరాల దిద్దుబాటు/ చిరునామా మారు(ఫారం8) కోసం జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు దరఖాస్తులను స్వీకరిస్తారు. ముసాయిదా జాబితాలో పేరు రాకపోయినా లేదా అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన/ నిండనున్న యువత ఓటర్లుగా నమోదు కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. జూలై 31 నుంచి సెప్టెంబర్ 28 మధ్య కాలంలో ఈ దరఖాస్తులను పరిష్కరి స్తారు. ఈ ప్రక్రియలో తీసు కున్న నిర్ణయాల ఆధారంగా ముసాయిదా జాబితాకు మారులు చేరులు చేసి తుది జాబితా ప్రచురిస్తారు. ముసాయిదా జాబితాలో పేరు రాకపోయినా లేదా అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన/ నిండనున్న యువత ఓటర్లుగా నమోదుకు దరఖాస్తు చేసుకోవాలి.

**నోటీసులు ఎవరికి ఇస్తారు?**

రెండు కేటగిరీల ఓటర్లకు నోటీసులు ఇవ్వనున్నారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో పేరు వచ్చినపటికీ, 2002 ఓటర్ల జాబితాతో మ్యాపింగ్‌లో తేడాలను గుర్తించిన ఓటర్లతోపాటు 2002 ఓటర్ల జాబితాలో తమతోపాటు తమ బంధువుల పేర్లు లేని ఓటర్లకు మాత్రమే ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఈఆర్వోలు) నోటీసులు ఇస్తారు. నిర్దేశిత తేదీకి విచారణకు హాజరై వీరు ఎన్నికల సంఘం నిర్దేశించిన పత్రాల్లో ఏదో ఒక పత్రాన్ని ధ్రువీకరణగా ఇవ్వాల్సి ఉంటుంది. ★

# ఏ దేశం నుండైనా సానుకూలాంశాలను గ్రహించాలి: జేపీ

## సీనియర్ సిటిజన్ల సంక్షేమం, గౌరవం కోసం పనిచేసినవారికి అవార్డుల ప్రదానం





ఇంట్లో, సమాజ జీవనంలో పెద్దవారిని గౌరవించటం మొక్కుబడి, ఛాందసం కాకూడదని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ప్రతి తరం తమ ముందుతరం కంటే తెలివితేటల్లో ముందుంటుందని.. దానర్థం ముందుతరాలు చూపిన మార్గదర్శనం పనికిరాదని కాదన్నారు. అలాగైతే ఈవేళ మనం బుద్ధుడు, గాంధీ, అంబేద్కర్‌ల గురించి మాట్లాడుకోవలసిన అవసరం ఉండదన్నారు. సీనియర్ సిటిజన్ల పట్ల నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా ప్రజల్ని చైతన్యపరిచేందుకు ఉద్దేశించిన అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా కృష్ణ సదన్, రెసిట్రోనిక్స్ సంస్థలు హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జేపీ పాల్గొన్నారు. తమ వృత్తివ్యాపారాలు కొనసాగిస్తూ వృద్ధులకు సేవలందించిన 15 మంది కేర్‌గివర్స్‌కి ఈ సంస్థలు అవార్డులను ప్రదానం చేశాయి. నామినేషన్లు, వడపోత పద్ధతిలో వీరిని ఎంపిక చేశారు. జేపీ మాట్లాడుతూ.. వృద్ధులకు, ఇతర అవసరార్థులకు సహాయపడటాన్ని అభివృద్ధి చెందిన దేశాల్లో పాఠశాల స్థాయి నుండీ బోధనలో భాగం చేస్తారని, కొన్ని దేశాలు అందుకు క్రెడిట్స్ కూడా కేటాయించి ప్రతిఫలాన్ని వివిధ రూపాల్లో అందిస్తాయన్నారు. చైనాలో పౌరులు ట్రాఫిక్ నియమాలు, పెద్దలకు అవసరమైన వైద్యం వంటి సేవలు చేయటాన్ని సీసీటీవీల్లో నమోదు చేసి.. చెడు ప్రవర్తనకు మైనస్ క్రెడిట్లు, మంచి ప్రవర్తనకు ప్లస్ క్రెడిట్లు ఇస్తూ విద్య, ఉపాధి వంటి రంగాల్లో అమలు చేస్తున్నారన్నారు. ఏ దేశం నుండైనా సానుకూలాంశాల్ని మనం గ్రహించాలన్నారు. యువత తమ కెరీర్‌ని చూసుకుంటూ, సమాజహితం కోసం ఆలోచించే క్రమంలో.. ఇంట్లోని సీనియర్ సిటిజన్లకే గాక, సమాజంలో కూడా అలాంటివారికి వీలైనంత సాయం చేయాలన్నారు. ఆధునిక యుగంలో మెదడుకి ముసలితనం వాయిదా పడుతోందని, అందువల్ల సీనియర్ సిటిజన్ల నుండి నేర్చుకోవటాన్ని.. అందులోని చెడును వదిలేసి మంచిని స్వీకరించటాన్ని ఒక అలవాటుగా పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్పేజ్ ఇండియా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు యతేంద్ర యాదవ్, కిన్నెర సంక్షేమ సంఘం చైర్‌పర్సన్ నాగ చంద్రికాదేవి తదితరులు పాల్గొన్నారు.

RNI. Regd No. 69976/98 Postal Reg. No. HCD-913/2024-2026 Published on 10th July 2026 Posting Date 15 &16th of every month
Posted at BPC-IV Patrika Channel, Nampally, HYDERABAD-500 001

# ఓటుతోనే నేతలు మాట వింటారు



**"రోడ్లే చెరువులు..**
**చేతులెత్తేసిన హైడ్రా"**
**రూ.1 లక్ష కోట్ల జీహెచ్ఎంసీ పన్నులు**
**రౌడీమామూళ్లా?**

**ఎన్నికలు ఏవైనా, పార్టీ ఏదైనా.. ఏడాదికి రూ.1500 కోట్లతో**

**ఈ 5 డిమాండ్లూ**

1. RTC, మెట్రో, MMTC, ఇ - సైకిళ్లు తదితర బహుళ ప్రజారవాణాకు (ప్రైవేట్ భాగస్వామ్యం ఉండొచ్చు) 'ఒకే డిజిటల్ టికెట్'
2. వ్యక్తిగత వాహనాల  అవసరాన్ని, వినియోగాన్ని భారీగా తగ్గించే చర్యలు
3. ఫుట్ పాత్ ల పరిరక్షణ, పార్కింగ్, ఇతర చట్టాలు కఠినంగా అమలు
4. ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీలు) వినియోగం, కాలుష్య నివారణ
5. తాగునీటి సరఫరాలో 40% వృధాని అరికట్టి 24 గంటల సరఫరా

**నెరవేర్చేవారికే**
**ఓటు వేయండి హైదరాబాదీలూ**

https://www.youtube.com/@JPLoksatta

*If undelivered please return to:*
*LOKSATTA UDYAMA SAMSTHA,*
*H.NO. 6-3-678,B-106,*
*PASHA COURT 71, Somajiguda,*
*Behind TRIBHUVANDAS*
*JEWELLERS (TBZ),*
*Hyderabad - 500 082*

Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, H.NO. 6-3-678,B-106,PASHA COURT 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS , Hyderabad- 500 082.
Printed at Kala Jyothi Process Pvt Ltd, Plot No : CFC-1 and 2, Survey No: 18, E-City, SEZ, General industrial park, Raviryal & Srinagar village, Maheswaram mandal, Rangareddy district-501359, Telangana.